ఆంధ్రజ్యోతి

www.andhrajyothy.com


ANDHRAJYOTHI

శనివారం | 5-7-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 97

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 6:59 తదుపరి ఏకాదశి; నక్షత్రం: స్వాతి రా.7:51 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.2:06-3:54; దుర్ముహూర్తం: ఉ.5:49-7:33; అమృతఘడియలు: ఉ.9:56-11:44; రాహుకాలం: ఉ.9:00-ఉ.10:30; సూర్యోదయం: 5:49, సూర్యాస్తమయం: 6:50

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


చరిత్రలోనే కనీవిని ఎరుగని తక్కువ తరుగు
బంగారం కొనేటప్పుడు మీరు పెద్ద మొత్తంలో డబ్బులు ఆదా చేస్తారు.
ఇలాంటి వేలాది డిజైన్లలో అందమైన నగలు, ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
KERALA FANCY 6%
LAPPA FANCY 6%
CALCUTTA 8%
CALCUTTA 8%
BOMBAY GHAT 9%
BOMBAY GHAT 9%
BOMBAY GHAT 9%
BOMBAY GHAT 9%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
BOMBAY FLOWER STEP 10%
CB KASU LAKSHMI 11%
CB MULLAI MALAI 11%
PSI DYE NAGAS 12%
PRECIOUS 12%
PRECIOUS 12%
TEMPLE 12%
BOMBAY DYE NAGAS 12%
LAPPA FANCY 6%
BOMBAY LAPPA 6%
CALCUTTA 8%
CALCUTTA 8%
BOMBAY FANCY 9%
BOMBAY GHAT 9%
BOMBAY GHAT 9%
BOMBAY U SHORT 9%
BOMBAY GHAT BEADS 9%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
CB U SHAPE 11%
CB FANCY 11%
PSI DYE NAGAS 12%
TEMPLE 12%
BOMBAY DYE NAGAS HOLLOW 12%
RUBY & EMERALD 12%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
తరుగు V.A. 10%
ఇలాంటి వందలాది బ్లాక్ బీడ్స్ డిజైన్లు, కేవలం 10% తరుగుకే మా వద్ద లభిస్తాయి.
ఇలాంటి రకరకాలైన డిజైన్లలో అందమైన వడ్డాణం / బ్రేస్‌లెట్ నగలు ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
V.A. 11%
V.A. 11%
V.A. 11%
V.A. 11%
V.A. 11%
V.A. 11%
V.A. 12%
V.A. 12%
బ్రేస్‌లెట్
MC DELHI V.A.3%
CASTING MC CHAIN STONE V.A.8%
KATTIYAR CASTING V.A.8%
LOTUS V.A.8%
LOTUS SAND V.A.8%
MC CASTING PLAIN V.A.8%
CASTING GENTS RUDRACHAM V.A.8%
BOMBAY STAMPING DELHI V.A.9%
BOMBAY NAVABEE FANCY V.A.9%
రకరకాలైన కాస్టింగ్ ఉంగరాలు (రాళ్ల పొదిగిన / రాళ్లు లేని) ఇదే తరుగులో మా వద్ద లభ్యం. ఇక్కడ కొన్ని ఉంగరాలు మాత్రమే చూపించాం.
5.5% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8%
8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8%
8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8%
8% 8% 8% 8% 9% 9% 9% 9.5% 9.5% 10% 10% 10%
ఎలాంటి దాపరికం లేని తక్కువ!
ఇతర నగల షోరూంలలో లలితా జ్యువెల్లరి వారి Estimate Slipను కస్టమర్లు చూపించిన తర్వాత.. వాళ్లు తరుగు తగ్గిస్తున్నారనే విషయం మా దృష్టికి వచ్చింది. కానీ, దేవుళ్లతో సమానమైన మా కస్టమర్లు మా వద్ద అలా విన్నవించుకోవాల్సిన అవసరం లేదు. ఏ నగ అయినప్పటికీ, మార్కెట్‌లో కంటే తక్కువ తరుగుకు మావద్ద తీసుకోవచ్చు!
నగల బుకింగ్ పథకం
OLD GOLD EXCHANGE
5 to 11 month scheme
ఖర్చు లేకుండా, పాత నగల అదే బరువుకు కొత్త నగ!
100% తరుగు లేదు
డబ్బులు చెల్లించి కూడా ఈ పథకంలో చేరవచ్చు!
కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.
Lalithaa
www.lalithaajewellery.com
@M.KIRANKUMAR_TELUGU
హైదరాబాద్ - సోమాజిగూడ • దిల్‌సుఖ్‌నగర్ • కూకట్‌పల్లి • చందానగర్ • సుచిత్రా సర్కిల్
సికింద్రాబాద్ • నిజామాబాద్ • ఖమ్మం • వరంగల్ • మిర్యాలగూడ
Customer Care: 90 99 999 916
VIRAL VIDEO 2.4+M VIEWS

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

Sabka Saath Sabka Vikas

Sabka Vishwas Sabka Prayas

శనివారం | 5-7-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 97 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 6.59 తదుపరి ఏకాదశి; నక్షత్రం: స్వాతి రా.7.51 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.2.06-3.54; దుర్ముహూర్తం: ఉ.5.49-7.33; అమృతఘడియలు: ఉ.9.56-11.44; రాహుకాలం: ఉ.9.00-ఉ.10.30; సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఫినిక్స్ ట్రైటాన్‌లో అర్థ గ్లోబల్ రూ.700 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని ఫినిక్స్ ట్రైటాన్ కమర్షియల్ రియల్టీ ప్రాజెక్ట్‌లో రూ.700 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు అర్థ గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్ వెల్లడించింది. ఫినిక్స్ ఈ నిధులను ప్రాజెక్ట్ పూర్తి చేయటానికి వినియోగించనుంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ కేంద్రంగా పని చేస్తున్న రూ.5,000 కోట్ల కేటగిరీ 3 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) అయిన అర్థ గ్లోబల్ దేశంలో పెట్టిన తొలి పెట్టుబడి ఇది. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 3.15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న 28 లక్షల చదరపు అడుగుల ఈ ప్రాజెక్టుకు నాలుగేళ్ల కాలపరిమితి గల నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) రూపంలో ఈ నిధులు అందించింది. నేరుగా ప్రాజెక్టు అమ్మకాలతో అనుసంధానమైన వేరియబుల్ రిటర్న్ నమూనాలో ఈ పెట్టుబడి ఉంటుంది. దీనివల్ల డెవలపర్‌పై నగదుపరమైన ఒత్తిడులుండవు. ఇన్వెస్టర్లకు కూడా ఆకర్షణీయమైన రాబడి లభిస్తుందని అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ సచిన్ సావ్రికర్ అన్నారు.

వచ్చే రెండేళ్లలో రూ.75 కోట్ల పెట్టుబడులు

పీవీఆర్ ఐనాక్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే రెండేళ్లలో తెలంగాణలో రూ.75 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పీవీఆర్ ఐనాక్స్ ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ హఫీజ్‌పేట్‌లో సరికొత్త 4 స్ర్కీన్స్ మల్టీప్లెక్స్ థియేటర్‌ను ప్రారంభించిన సందర్భంగా కంపెనీ సీఓఓ రోహన్ సాబ్లే మాట్లాడుతూ.. కార్యకలాపాల విస్తరణలో భాగంగా రానున్న రెండేళ్లలో ప్రతిపాదిత పెట్టుబడులతో మరో ఐదు మల్టీప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మల్టీప్లెక్స్‌తో 20 కొత్త స్ర్కీన్స్ అందుబాటులోకి రానున్నాయన్నారు. అంతేకాకుండా కొత్తగా 400 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దీంతో తెలంగాణలో మొత్తం ఉద్యోగాల సంఖ్య 1,700కు చేరుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం దక్షిణాది రీజియన్‌లో పీవీఆర్ ఐనాక్స్ 565 స్ర్కీన్స్‌ను నిర్వహిస్తుండగా అందులో 106 స్ర్కీన్స్ హైదరాబాద్‌లోనే ఉన్నాయన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	97
వరంగల్	95	గుంటూరు	102
కరీంనగర్	95	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	97
కర్నూలు	95	నెల్లూరు	102
విశాఖపట్నం	83	అనంతపురం	102
గోదావరి	97		

2 ఏళ్లలో రూ. 36,671 కోట్ల అక్రమార్జన

- డెరివేటివ్ ట్రేడింగ్‌లో అమెరికా సంస్థ జేన్ స్ట్రీట్ మాయాజాలం
- సెక్యూరిటీ మార్కెట్ నుంచి కంపెనీని నిషేధించిన సెబీ
- రూ.4,843 కోట్ల అక్రమ లాభాలు తిరిగి చెల్లించాలని ఆదేశం



4 కంపెనీల ద్వారా భారత్‌లో ట్రేడింగ్ కార్యకలాపాలు

అంతర్జాతీయ ట్రేడింగ్ కంపెనీ అయిన జేన్ స్ట్రీట్ గ్రూప్ ఎల్ఎల్‌సీ 2000 సంవత్సరంలో ఏర్పాటైంది. ఆల్గో ట్రేడింగ్, హై ఫ్రీక్వెన్సీ ట్రేడింగ్ సామర్థ్యాలను కలిగి ఉన్న ఈ గ్రూప్‌నకు చెందిన అమెరికా, యూరప్, ఆసియాలోని ఐదు కార్యాలయాల్లో 2,600 మందికి పైగా పనిచేస్తున్నారు. 45 దేశాల్లో ట్రేడింగ్ కార్యకలాపాలు నెరుపుతోందీ గ్రూప్. గ్రూప్‌నకు చెందిన 4 కంపెనీలు భారత మార్కెట్లో ట్రేడింగ్ కార్యకలాపాలు జరుపుతున్నాయి. అందులో జేఎస్ఐ ఇన్వెస్ట్‌మెంట్స్ ముంబై కేంద్రంగా 2020 డిసెంబరులో ఏర్పాటైంది. జేఎస్ఐ ఇన్వెస్ట్‌మెంట్స్ అనుబంధ విభాగమైన జేఎస్ఐ2 ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా ముంబై కేంద్రంగా 2024 సెప్టెంబరులో ప్రారంభమైంది. జేన్ స్ట్రీట్ సింగపూర్, జేన్ స్ట్రీట్ ఏషియా సింగపూర్, హాంకాంగ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. మన మార్కెట్లో సెబీ నమోదిత విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)గా ట్రేడింగ్ సాగిస్తున్నాయి.

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మరో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన జేన్ స్ట్రీట్ గ్రూప్ మన మార్కెట్ వ్యవస్థను తెలివిగా బురిడీ కొట్టించి వేల కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించిందని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గుర్తించింది. అందుకుగాను, జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధించిన సెబీ.. రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఇప్పటివరకు మార్కెట్ సంస్థ నుంచి సెబీ జప్తు చేసుకోనున్న అతిపెద్ద మొత్తమిదే.

రెండు వ్యూహాలతో మోసం

అధిక లావాదేవీలు జరిగే బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ సూచీల స్థాయిలను కృత్రిమంగా పెంచడం లేదా తగ్గించడం ద్వారా జేన్ స్ట్రీట్ గ్రూప్ ఈ భారీ మోసానికి పాల్పడిందని సెబీ గుర్తించింది. ప్రధానంగా ఈ రెండు సూచీ ఆప్షన్స్ ట్రేడింగ్ ద్వారా రూ.36,671 కోట్లు పోగేసింది. 2023 జనవరి నుంచి 2025 మార్చి మధ్య కాలంలో డెరివేటివ్ కాంట్రాక్టులకు సంబంధించి 21 ఎక్స్‌పైరీ (గడువు) తేదీల్లో ఈ గ్రూప్ తన చేతి వాటాన్ని ప్రదర్శించిందని నియంత్రణ మండలి దర్యాప్తులో వెల్లడైంది. ఆ గడువు తేదీల్లో సూచీల గమనాన్ని ప్రభావితం చేసి ఆప్షన్స్ మార్కెట్లో పొజిషన్ల ద్వారా భారీగా గడించేందుకు ఈ గ్రూప్ కంపెనీలు క్యాష్, ఫ్యూచర్స్ మార్కెట్లో భారీ ఎత్తున లావాదేవీలు నెరిపాయంటోంది. ఇందుకోసం జేన్ స్ట్రీట్ రెండు వ్యూహాలను ఎంచుకుంది. 1. ఇంట్రాడే ఇండెక్స్ మ్యానిపులేషన్ స్ట్రాటజీ. 2. మార్కింగ్ ది క్లోజింగ్ స్ట్రాటజీ.

ఇంట్రాడే ఇండెక్స్ మ్యానిపులేషన్ స్ట్రాటజీ

ఉదయం సెషన్‌లో బ్యాంక్ నిఫ్టీ సూచీ నమోదిత షేర్లు, వాటి ఫ్యూచర్స్‌లో పెద్దఎత్తున కొనుగోళ్లు జరపడం ద్వారా కృత్రిమంగా వాటి ధరలతో పాటు వాటికి గిరాకీ పెంచడం. ఉదయం కొనుగోలు చేసిన షేర్లు, ఫ్యూచర్స్‌లో మధ్యాహ్నం సెషన్ నుంచి ఉన్నఫళంగా అమ్మకాలకు పాల్పడటం ద్వారా వాటి ధరలను ఒక్కసారిగా తగ్గించడం చేసింది. తద్వారా జేన్ స్ట్రీట్ అప్పటికే తీసుకున్న ఇండెక్స్ ఆప్షన్స్ పొజిషన్ల ద్వారా భారీగా లాభం గడించింది.

మార్కింగ్ ది క్లోజింగ్ స్ట్రాటజీ

డెరివేటివ్ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ తేదీ నాడు చివరి రెండు గంటల ట్రేడింగ్‌లో పెద్దఎత్తున కొనుగోలు లేదా విక్రయం ద్వారా సూచీల గమనాన్ని ఒక్కసారిగా మార్చడం ద్వారా జేన్ స్ట్రీట్ షార్ట్ కాల్ లేదా లాంగ్ పుట్ పొజిషన్ల ద్వారా లబ్ధి పొందినట్లు సెబీ గుర్తించింది.

ఇండెక్స్ ఆప్షన్స్‌లో రూ.44,358 కోట్ల లాభం

పై రెండు వ్యూహాలను అనుసరించి జేన్ స్ట్రీట్.. ఇండెక్స్ ఆప్షన్ ట్రేడింగ్ ద్వారా రెండేళ్లకు పైగా కాలంలో రూ.44,358 కోట్లు ఆర్జించింది. ఇంత భారీ స్థాయిలో గడించేందుకు స్టాక్స్ ఫ్యూచర్స్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ.191 కోట్లు, క్యాష్ మార్కెట్లో రూ.288 కోట్లు నష్టపోవాల్సి వచ్చింది. అంటే, నికరంగా రూ.36,671 కోట్లు గడించింది.

కొనసాగుతున్న సెబీ దర్యాప్తు

జేన్ స్ట్రీట్‌పై దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సెబీకి ఇప్పటివరకు 18 గడువు రోజుల్లో బ్యాంక్ నిఫ్టీ, 3 గడువు రోజుల్లో నిఫ్టీ సూచీలో గ్రూప్ కంపెనీలు అనైతిక ట్రేడింగ్ కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆధారాలు లభించాయి. ఇతర గడువు రోజుల్లో, ఇతర సూచీల్లో, ఇతర ఎక్స్ఛేంజ్‌ల్లోనూ జేన్ స్ట్రీట్ అనైతిక ట్రేడింగ్‌కు పాల్పడిందా అన్న కోణంలోనూ సెబీ దర్యాప్తు సాగించనుందన్నారు. ఇప్పటివరకు గుర్తించిన రెండింటితోపాటు ఇంకేమైనా ట్రేడింగ్ వ్యూహాలను అనుసరించిందా అని కూడా నియంత్రణ మండలి విచారించనుందన్నారు.

సెబీ చేపట్టిన చర్యలివి..

శుక్రవారం జారీ చేసిన తాత్కాలిక ఉత్తర్వుల ప్రకారం.. జేన్‌స్ట్రీట్ గ్రూప్‌నకు చెందిన జేఎస్ఐ (జేన్ స్ట్రీట్ ఇండియా) ఇన్వెస్ట్‌మెంట్స్, జేఎస్ఐ2 ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ సింగపూర్ పీటీఈ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ ఏషియా ట్రేడింగ్ సంస్థలను సెక్యూరిటీస్ మార్కెట్ లావాదేవీల నుంచి తదుపరి ఆదేశాలిచ్చే వరకు నిషేధం విధించింది. అలాగే, ఈ కంపెనీలపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ నిషేధ కాలంలో జేన్ స్ట్రీట్ కంపెనీలు మన మార్కెట్లో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా షేర్ల కొనుగోలు, విక్రయాలు లేదా ఇతర కార్యకలాపాలకు నెరిపేందుకు వీలుండదు.

- డెరివేటివ్ ట్రేడింగ్‌లో వ్యవస్థాగత అక్రమాలకు పాల్పడటం ద్వారా ఆర్జించిన రూ.4,843.57 కోట్ల అయాచిత లాభాలను తిరిగి చెల్లించాలని ఆదేశం. జేన్ స్ట్రీట్ ఈ మొత్తాన్ని సెబీ ఎస్క్రో ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. అప్పటివరకు కంపెనీలు భారత్‌లోని తమ ఆస్తులను విక్రయించేందుకు కూడా వీల్లేకుండా సెబీ ఆంక్షలు విధించింది.
- జేన్ స్ట్రీట్ కంపెనీల బ్యాంక్ ఖాతాలు, డీమ్యాట్ అకౌంట్లు, కస్టోడియల్ అకౌంట్లను సెబీ స్తంభింపజేసింది. అంటే, సెబీ అనుమతి లేకుండా ఈ ఖాతాల్లోంచి సొమ్ము ఉపసంహరణకు వీలుండదు.
- భవిష్యత్‌లో జేన్ స్ట్రీట్ కంపెనీల కార్యకలాపాలను నిశితంగా గమనించాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను నియంత్రణ మండలి నిర్దేశించింది.

ఇలా బయటపడింది..

మిలీనియం మేనేజ్‌మెంట్‌తో జేన్ స్ట్రీట్ వివాదంపై 2024 ఏప్రిల్‌లో మీడియాలో కథనాలు వచ్చాయి. అనైతిక ట్రేడింగ్ వ్యూహం ద్వారా జేన్ స్ట్రీట్ భారత డెరివేటివ్ మార్కెట్ నుంచి 100 కోట్ల డాలర్లు ఆర్జించిందని మిలీనియం మేనేజ్‌మెంట్ ఆరోపించింది. ఆ కథనం ఆధారంగానే సెబీ జేన్‌స్ట్రీట్ గ్రూప్‌పై దర్యాప్తు ప్రారంభించింది.

ఒక్కరోజే రూ.735 కోట్ల లాభం

గత ఏడాది జనవరి 17న జేన్ స్ట్రీట్ ఇంట్రాడేలో సూచీ గతిని ఒక్కసారిగా మార్చడం ద్వారా ఏకంగా రూ.750 కోట్ల లాభం ఆర్జించిందట. దలాల్‌స్ట్రీట్‌లో ఈ గ్రూప్‌నకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు లాభమని సెబీ దర్యాప్తులో తేలింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	570
వరంగల్	562	గోదావరి	535
చిత్తూరు	633	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ. 78	

ఒడుదుడుకుల్లోనూ లాభాలొచ్చాయ్..

193 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, చివర్లో బ్యాంకింగ్ సహా ఇతర బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లతో లాభాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 193.42 పాయింట్ల వృద్ధితో 83,432.89 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 83,477.86 వద్ద గరిష్ఠాన్ని, 83,015.83 వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసిన సూచీ.. రోజంతా 462 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడింది. నిఫ్టీ విషయానికొస్తే, 55.70 పాయింట్ల లాభంతో 25,461 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 రాణించగా.. బజాజ్ ఫైనాన్స్ 1.60 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

బ్రోకరేజీ షేర్లు డౌన్

జేన్ స్ట్రీట్ వివాదం నేపథ్యంలో స్టాక్ బ్రోకింగ్, ఎక్స్ఛేంజ్‌లు, డిపాజిటరీ సంస్థల షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రోకరేజీ సేవల కంపెనీల్లో నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ స్టాక్ 11.26 శాతం క్షీణించగా.. ఏంజెల్ వన్ 5.94 శాతం నష్టపోయింది. స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈ షేరు సైతం 6.42 శాతం పతనమైంది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సీడీఎస్ఎల్) స్టాక్ 2.29 శాతం నష్టపోయింది.

యూపీఎస్ ఎంచుకునే వారికి పన్ను ప్రయోజనాలు

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను (యూపీఎస్) ప్రోత్సహించే లక్ష్యంతో ఆ స్కీమ్‌ను ఎంచుకునే ఉద్యోగులకు నేషనల్ పెన్షన్ స్కీమ్‌తో (ఎన్‌పీఎస్) సమానంగా పన్ను ప్రయోజనాలు అందించనున్నారు. ఇందుకు దీటుగా ప్రభుత్వం అవసరమైన మార్పులు చేసింది. పారదర్శకమైన, పన్ను ప్రయోజనాలు అధికంగా అందించే అంశాలను జోడిస్తూ కేంద్ర ప్రభుత్వోద్యోగులకు రిటైర్మెంట్ సెక్యూరిటీ పటిష్ఠం చేసే దిశగా యూపీఎస్‌ను పన్ను ప్రయోజనాల పరిధిలోకి తేవడం ఒక కీలకమైన ముందడుగు అని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఏడాది జనవరి 24వ తేదీన ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా యూపీఎస్‌ను ప్రవేశపెట్టింది. ఏప్రిల్ ఒకటి నుంచి అది అమలులోకి వచ్చింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,730 ▼	90,500 ▼	1,20,000 ▼
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,09,000 ▼
విశాఖపట్నం	99,990 ▲	90,500 ▼	1,20,000 ▼
రాజమండ్రి	98,730 ▼	90,500 ▼	1,10,700 ▼
ప్రొద్దుటూరు	97,400 ▼	89,610 ▼	1,08,300 ▲
ముంబై	97,021 ▼	88,871 ▼	1,07,580 ▼

స్పోర్ట్స్

ఈసారి కీస్ వంతు..

వింబుల్డన్

- మూడో రౌండ్‌లో అవుట్
- ఒసాకా కూడా..
- అల్కారజ్ ముందంజ

లండన్: వింబుల్డన్ ఆరంభంనుంచి రోజుకో సీడెడ్‌కు చుక్కెదురవుతోంది. ఐదో రోజు..ఆరో సీడ్ మాడిసన్ కీస్ ఇంటిబాట పట్టింది. ఆమెతోపాటు నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ నవోమి ఒసాకాకు కూడా మూడో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. అలాగే పురుషుల నాలుగో సీడ్ జాక్ డ్రేపర్‌కూ ఓటమి తప్పలేదు. రెండో సీడ్ అల్కారజ్, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో లారా సీగ్మండ్ 6-3, 6-3తో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కీస్‌కు షాకిచ్చింది. మరో మ్యాచ్‌లో పల్యుచెన్కోవా 3-6, 6-4, 6-4తో ఒసాకాను చిత్తు చేసి నాలుగో రౌండ్‌కు చేరింది. 13వ సీడ్ అనిసిమోవా 6-3, 5-7, 6-3తో దల్మా గాల్ఫీపై మూడో రౌండ్‌లో నెగ్గింది. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్ 6-1, 3-6, 6-3, 6-4తో స్త్రఫ్‌పై, 5వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 6-4, 6-3, 6-7 (7), 6-1తో 26వ సీడ్ డవిడోవిచ్‌పై, 14వ సీడ్ రుబ్లేవ్ 7-5, 6-2, 6-3తో మన్నారినోపై గెలుపొందారు. ఇక గురువారం అర్ధరాత్రి జరిగిన రెండో రౌండ్‌లో టైటిల్ ఫేవరెట్ సినర్ 6-1, 6-1, 6-3తో ఉకికని వరుస సెట్లలో ఓడించాడు. మరో మ్యాచ్‌లో వెటరన్ మారిన్ సిలిచ్ 6-4, 6-3, 1-6, 6-4తో నాలుగో సీడ్ డ్రేపర్‌ను తిరుగుముఖం పట్టించాడు. 10వ సీడ్ బెన్ షెల్టన్ 6-2, 7-5, 6-4తో హిజికటాపై నెగ్గి మూడో రౌండ్‌కు చేరాడు.

మూడో రౌండ్‌లో భాంబ్రీ జోడీ: యుకీ భాంబ్రీ/జియాంగ్ జిన్‌యు (చైనా) ద్వయం మిక్స్‌డ్ డబుల్స్ మూడో రౌండ్‌కు చేరింది. రెండో రౌండ్‌లో భాంబ్రీ/జియాంగ్ జంట 6-3, 1-6, 7-6 (6)తో నికోల్/క్రిస్టియన్ అమెరికా జోడీపై నెగ్గి ముందంజ వేసింది.



లారా సీగ్మండ్

భవాని డబుల్ ధమాకా



ఒలోమాక్ (చెక్ రిపబ్లిక్): ప్రపంచ పారా అథ్లెటిక్స్ మహిళల గ్రాండ్ ప్రీలో ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెట్ వి.భవాని రెండు స్వర్ణాలు కొల్లగొట్టి సంచలనం సృష్టించింది. చెక్ రిపబ్లిక్‌లోని ఒలొమౌక్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భవాని 100, 200 మీటర్ల స్ప్రింట్‌లో పసిడి పతకాలు సాధించింది. టీ46 విభాగంలో 100 మీ., రేసును 13.70 సెకన్లలో, 200 మీ., రేసును 29.07 సెకన్లలో ముగించి ప్రథమ స్థానం దక్కించుకుంది. భవాని స్వస్థలం నెల్లూరు.

విండీస్ 185/7

సెయింట్ జార్జ్: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో వెస్టిండీస్ రెండో రోజైన శుక్రవారం టీ విరామానికి 7 వికెట్లకు 185 పరుగులు చేసింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు కరీబియన్ జట్టు మరో 101 పరుగుల వెనుకంజలో ఉంది. బ్రండన్ కింగ్ 75 రన్స్ చేశాడు. క్రీజులో షమర్ జోసెఫ్ (6), అల్జారీ జోసెఫ్ (9) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో హాజెల్‌వుడ్, కమిన్స్, లియోన్ తలో రెండు వికెట్లు సాధించారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో కంగారూ జట్టు 286కు ఆలౌటైంది. అలెక్స్ క్యారీ 63, వెబ్‌స్టర్ 60 పరుగులు చేశారు. అల్జారీ జోసెఫ్‌కు 4 వికెట్లు లభించాయి.

జావెలిన్ విప్లవానికి నాంది..

నీరజ్ చోప్రా
బెంగళూరులో నేడు క్లాసిక్ ఈవెంట్



సా. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

బెంగళూరు: తన పేరిట శనివారం ఇక్కడ జరుగనున్న క్లాసిక్ ఈవెంట్ దేశంలో జావెలిన్ త్రో విప్లవానికి నాంది పలకగలదన్న ఆశాభావాన్ని నీరజ్ వ్యక్తంచేశాడు. ఇక్కడి కంఠీరవ స్టేడియంలో ఈ పోటీ జరగనుంది. భవిష్యత్ భారత జావెలిన్ త్రోయర్లలో ఈ టోర్నీ స్ఫూర్తి నింపుతుందని చోప్రా అన్నాడు. నీరజ్‌తోపాటు మరో ఇద్దరు ఒలింపిక్ పతక విజేతలు థామస్ రోలెర్, జూలియస్ ఎగో పోటీ బరిలో దిగుతున్నారు. భారత్ నుంచి నీరజ్‌తోపాటు రోహిత్ యాదవ్, సాహిల్ సిల్వాల్, జస్వీర్ సింగ్ తలపడుతున్నారు. మొత్తం 12 మంది త్రోయర్లు ఈ ఈవెంట్ బరిలో నిలిచారు.

అగ్రస్థానంలో గుకేష్

జాగ్రెబ్ (క్రొయేషియా): గ్రాండ్ చెస్ టూర్ ర్యాపిడ్ విభాగంలో గుకేష్ హవా కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన 7, 8 రౌండ్లను గుకేష్ డ్రా చేసుకొని 12 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. జీఎంలు అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో ఆడిన ఏడో రౌండ్‌ను, సరిక్ ఇవాన్ (క్రొయేషియా)తో జరిగిన ఎనిమిదో రౌండ్‌ను గుకేష్ డ్రా చేసుకున్నాడు.

బంగ్లాదేశ్‌లో భారత పర్యటన లేనట్టే!

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో భారత క్రికెట్ జట్టు పర్యటన రద్దు కానుంది. ఆ దేశంలో ఏడాది కాలంగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో టీమిండియా పర్యటన దాదాపు లేనట్టేనని బీసీసీఐ అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు. ఆగస్టు 17 నుంచి 31 వరకు జరగాల్సిన ఈ పర్యటనలో భారత్-బంగ్లాదేశ్ మూడు టీ20లు, మూడు వన్డేలలో తలపడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్‌లో ఆడే మ్యాచ్‌ల ద్వారా లభించే పాయింట్లు వన్డే ప్రపంచ కప్‌నకు అర్హత సాధించేందుకు కీలకం కావడంతో .భారత పర్యటన పూర్తిగా రద్దు కావడంలేదు. వచ్చే ఏడాది ఆ టూర్ జరిగే అవకాశముందని ఆయన వివరించారు.

గిల్ తలకు బలంగా..

మూడో రోజు తొలి సెషన్‌లో కెప్టెన్ గిల్ తలకు బంతి బలంగా తాకడం ఆందోళన కలిగించింది. జడేజా ఓవర్‌లో హ్యారీ బ్రూక్ ఆడిన బంతి తొలి స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న గిల్ వైపు వెళ్లింది. దీన్ని అందుకోవడంలో తను కాస్త ఆలస్యంగా స్పందించగా ఆ బంతి అతడి తలకు తాకి పైకి లేచింది. వెంటనే నొప్పితో విలవిల్లాడిన గిల్‌ను ముందుగా కీపర్ పంత్ వచ్చి పరిశీలించాడు. ఆ తర్వాత ఫిజియో వచ్చి చికిత్స అందించడంతో గిల్ తిరిగి ఫీల్డింగ్ కొనసాగించడం ఊరటనిచ్చింది.

148 ఏళ్ల టెస్టు చరిత్రలోనే అత్యంత చెత్త బౌలింగ్ (618 బంతుల్లో 5.14 ఎకానమీ)ను నమోదు చేసిన పేసర్ ప్రసిద్ధ్.

1 భారత్ తరఫున వేగంగా (40 ఇన్నింగ్స్) 2 వేల టెస్టు పరుగులు సాధించి ద్రవిడ్, సెహ్వాగ్‌ల సరసన చేరిన జైస్వాల్.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఆరుగురు డకౌట్లు కావడం ఇదే తొలిసారి.

టెస్టుల్లో 300+ భాగస్వామ్యం నమోదైనా తక్కువ స్కోరు (407)కే ఆలౌటైన జట్టుగా ఇంగ్లండ్

బెన్ స్టోక్స్ ఆడిన 113 టెస్టుల్లో తొలి బంతికే వెనుదిరగడం ఇదే తొలిసారి. సిరాజ్ ఈ వికెట్ తీశాడు.

3 టెస్టుల్లో వంద పరుగుల్లోపే ఐదు వికెట్లు కోల్పోయినా ఓ జట్టు (ఇంగ్లండ్) ఆరో వికెట్‌కు 300+ పరుగులు (ఇంగ్లండ్) జత చేర్చడం ఇది మూడో సారి మాత్రమే.

ఇంగ్లండ్ పోరాడినా..
భారత్‌దే ఆధిక్యం

స్మిత్, బ్రూక్ భారీ శతకాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 407

భారత్ రెండో ఇన్నింగ్స్ 64/1

సిరాజ్‌కు ఆరు వికెట్లు



సిరాజ్ (6/70)

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టును టీమిండియా శాసించే దిశగా సాగుతోంది. ప్రస్తుతం గిల్ సేన 244 పరుగుల స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. శనివారం ఆటలో వేగంగా ఆడి భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచితే మ్యాచ్ ఫలితాన్ని ఆశించవచ్చు. అయితే మూడో రోజు శుక్రవారం రెండు సెషన్లపాటు ఇంగ్లండ్ జట్టే ఆధిపత్యం చూపింది. ఓ దశలో 84/5తో ఇబ్బందుల్లో పడిన ఇంగ్లండ్‌ను జేమీ స్మిత్ (184 నాటౌట్), హ్యారీ బ్రూక్ (158) అసాధారణ ఇన్నింగ్స్‌తో గట్టెక్కించే ప్రయత్నం చేశారు. ఆరో వికెట్‌కు ఈ జోడీ 303 పరుగులను జత చేయడం విశేషం. అయితే చివరి సెషన్‌లో పేసర్లు సిరాజ్ (6/70), ఆకాశ్ (4/88) దెబ్బతీయడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 407 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 180 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ ఆట ముగిసే సమయానికి 13 ఓవర్లలో వికెట్ నష్టానికి 64 పరుగులతో ఆడుతోంది. జైస్వాల్ (28) వేగంగా ఆడగా, క్రీజులో రాహుల్ (28 బ్యాటింగ్), కరుణ్ (7 బ్యాటింగ్) ఉన్నారు.

స్మిత్ మెరుపు శతకం: 77/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ ఆరంభంలోనే మరో రెండు వికెట్లు కోల్పోయింది. పేసర్ సిరాజ్ వరుస బంతుల్లో రూట్ (22), కెప్టెన్ స్టోక్స్ (0)లను అవుట్ చేయడంతో ఆతిథ్య జట్టు 84/5 స్కోరుతో దయనీయ స్థితిలో నిలిచింది. కానీ జేమీ స్మిత్ ఎదురుదాడిని భారత బౌలర్లు ఊహించలేదు. వన్డే తరహాలో అతడు బ్యాట్ ఝుళిపించడంతో పరుగుల వరద పారింది. అయితే పేసర్ ప్రసిద్ధ్ షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బందిపెట్టాలని చూశాడు. కానీ స్మిత్ ధాటికి అతడి వ్యూహం పని చేయలేదు. పైగా అతడి ఓవర్‌లోనే 4,6,4,4,4తో 23 పరుగులు రాబట్టాడు. అటు స్పిన్నర్లు జడేజా, సుందర్‌లను సైతం స్మిత్ వదలకుండా బౌండరీలతో జోరును చూపాడు. ఈ బాదుడుకు లంచ్ బ్రేక్‌కు కాస్త ముందుగానే 80 బంతుల్లోనే కెరీర్‌లో రెండో శతకం కూడా పూర్తి చేశాడు. అటు చక్కటి సహకారం అందించిన బ్రూక్ 91 పరుగులు సాధించగా, తొలి సెషన్‌లో ఇంగ్లండ్ 27 ఓవర్లలో ఏకంగా 172 పరుగులు రాబట్టింది.

వికెట్ లేకుండానే..: రెండో సెషన్‌లోనూ స్మిత్-బ్రూక్ జోడీని విడదీసేందుకు భారత బౌలర్లు చెమటోడ్చినా ఫలితం లేకపోయింది. ఇక తొలి టెస్టులో 99 పరుగుల వద్ద వెనుదిరిగిన హ్యారీ బ్రూక్ ఈసారి ఎలాంటి పొరపాటూ చేయలేదు. తన తొమ్మిదో శతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు నితీశ్ ఓవర్‌లో స్మిత్ క్లిష్టమైన క్యాచ్‌ను పంత్ డైవ్ చేసి పట్టాలనుకున్నా బంతి అందలేదు. ఈ సెషన్‌లో భారత్‌కు దక్కిన అవకాశం ఇదొక్కటే. ఇద్దరూ చెత్త బంతుల కోసం ఓపిగ్గా ఎదురుచూసి బౌండరీలు రాబట్టారు. చివరకు 355/5 స్కోరుతో ఇంగ్లండ్ టీ బ్రేక్‌కు వెళ్లగా.. అప్పటికి స్మిత్-బ్రూక్ జోడీ ఆరో వికెట్‌కు అజేయంగా 271 పరుగులు అందించింది. మొత్తంగా ఈ సెషన్‌లో జట్టు 28 ఓవర్లలో 106 పరుగులు సాధించింది.

కొత్త బంతితో..: వికెట్ల కోసం ఎదురుచూస్తున్న భారత్‌కు చివరి సెషన్ అవకాశం కల్పించింది. కొత్త బంతితో పేసర్లు ఆకాశ్, సిరాజ్ చెలరేగడంతో ఎదురుచూపులు ఫలించాయి. ముందుగా బ్రూక్‌ను ఆకాశ్ బౌల్డ్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 303 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే వోక్స్ (5)ను ఆకాశ్.. కార్స్ (0)ను సిరాజ్ వరుస ఓవర్లలో అవుట్ చేశారు. ఓవైపు స్మిత్ క్రీజులో నిలిచినా మరో ఎండ్‌లో మిగిలిన ఇద్దరినీ సిరాజ్ అవుట్ చేసి 6 వికెట్లతో అదుర్స్ అనిపించాడు.



బ్రూక్ (158)
స్మిత్ (184 నాటౌట్)

1 తొలి సెషన్‌లోనే శతకం చేసిన ఇంగ్లండ్ బ్యాటర్‌గా జేమీ స్మిత్. అలాగే భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్టుల్లో ఫాస్టెస్ట్ (80 బంతుల్లో) శతకం బాదిన బ్యాటర్‌గానూ నిలిచాడు. ఈక్రమంలో తను కపిల్ దేవ్ (86 బంతుల్లో)ను అధిగమించాడు. ఇక టెస్టుల్లో అత్యధిక స్కోరు (184 నాటౌట్) సాధించిన ఇంగ్లండ్ కీపర్‌గా స్టివార్ట్ (173)ను అధిగమించాడు. అలాగే ఈ జట్టు తరఫున ఏడు అంతకంటే దిగువ బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎక్కువ పరుగులు సాధించిన బ్యాటర్‌గా రంజిత్ సింగ్ (1897లో 175 పరుగులు) రికార్డును బ్రేక్ చేశాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) కరుణ్ (బి) సిరాజ్ 19; డకెట్ (సి) గిల్ (బి) ఆకాశ్ 0; పోప్ (సి) రాహుల్ (బి) ఆకాశ్ 0; రూట్ (సి) పంత్ (బి) సిరాజ్ 22; బ్రూక్ (బి) ఆకాశ్ 158; స్టోక్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 0; స్మిత్ (నాటౌట్) 184; వోక్స్ (సి) కరుణ్ (బి) ఆకాశ్ 5; కార్స్ (ఎల్బీ) సిరాజ్ 0; టంగ్ (ఎల్బీ) సిరాజ్ 0; బషీర్ (బి) సిరాజ్ 0; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 89.3 ఓవర్లలో 407 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-25, 4-84, 5-84, 6-387, 7-395, 8-396, 9-407, 10-407; **బౌలింగ్:** ఆకాశ్ 20-2-88-4; సిరాజ్ 19.3-3-70-6; ప్రసిద్ధ్ 13-1-72-0; నితీశ్ కుమార్ 6-0-29-0; జడేజా 17-2-70-0; సుందర్ 14-0-73-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) టంగ్ 28; రాహుల్ (బ్యాటింగ్) 28; కరుణ్ (బ్యాటింగ్) 7; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 13 ఓవర్లలో 64/1. వికెట్ పతనం:** 1-51; **బౌలింగ్:** వోక్స్ 5-0-28-0; కార్స్ 5-1-23-0; టంగ్ 3-1-12-1.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు:16
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 97

అల్లూరి గొప్ప పోరాట యోధుడు

బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటం జరిపిన రాబిన్‌హుడ్.. మన్యం వీరుడు

ఆయన ఆశయాలకు అనుగుణంగానే గిరిజనుల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి

అల్లూరి 128వ జయంతి ఉత్సవాల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

11



శనివారం | 5-7-2025

వెల (Price) : Rs. 6.50 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 6.59 తదుపరి ఏకాదశి; నక్షత్రం: స్వాతి రా.7.51 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.2.06-3.54; దుర్ముహూర్తం: ఉ.5.49-7.33; అమృతఘడియలు: ఉ.9.56-11.44; రాహుకాలం: ఉ.9.00-ఉ.10.30; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వాళ్లు మొగోళ్లు కాదు.. ఆడోళ్లు కాదు

బీజేపీ రాజ్యాంగంలోనే లౌకిక, సామ్యవాదం

ఆ పార్టీకి, మోదీ, షాకు దమ్ముంటే రాజ్యాంగం

2 నుంచి ఆ రెండు పదాలనూ తొలగించాలి

ఇది నా సవాల్: ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

మోదీ సర్కారు పాటిస్తున్న విదేశాంగ విధానం వల్ల దేశం చుట్టూ శత్రువులే ఉన్నారని ధ్వజం

పీవోకేను ఇంకా ఎందుకు లాక్కోలేదని నిలదీత





ఎల్బీ స్టేడియంలో సామాజిక న్యాయ సదస్సులో ఖర్గే, రేవంత్ అభివాదం; పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

ఈసారి సెంచరీ!

వంద సీట్లు గెలుస్తాం.. మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం.. ఒక్కటి తగ్గినా నాదే బాధ్యత

మూడేళ్ల ముందే నేను మీకు అందరికీ హామీ ఇస్తున్నా

తెలంగాణ నుంచి ఈసారి 15 మంది ఎంపీల్ని ఢిల్లీకి పంపుతాం

పెరగనున్న ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు.. కొత్తగా 80 మందికి టికెట్లు

రిజర్వేషన్లతో 60 మంది వరకు మహిళలు అసెంబ్లీలోకి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు బాధ్యత నాదే

ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం.. ఒక్కటి తగ్గినా

ఎల్బీ స్టేడియంలో కాళ్ల ముందు క్షమాపణ చెప్పి బయటకు వెళతా

విష ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్‌పై సోషల్ మీడియాలో యుద్ధం

సామాజిక న్యాయ భేరి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): "మూడేళ్ల ముందే హామీ ఇస్తున్నా..! రాబోయే ఎన్నికల్లో 100 ఎమ్మెల్యే సీట్లను గెలుస్తాం. ఇక్కడ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. వంద సీట్లలో ఒక్కటి తగ్గినా నాదే బాధ్యత. తెలంగాణ నుంచి 15 మంది ఎంపీలను ఢిల్లీకి పంపుతాం. ఢిల్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు మావంతు సహకారం అందిస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిన పూనారు. ఈసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని 2023 సెప్టెంబరు 17న రంగారెడ్డి జిల్లాలో మాట ఇచ్చామని, ఇచ్చినట్లే.. డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ సామాజిక న్యాయ సమర భేరి సభలో 31 నిమిషాలపాటు ఆయన మాట్లాడారు. "చాలామంది నాయకులకు ఒక భయం ఉంది. తమ నియోజకవర్గానికి ఎవరో ఎమ్మెల్యేగా వచ్చారని, భవిష్యత్‌లో తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన చాలామంది నాయకులకు ఉంది. అయితే, వచ్చే ఎన్నికలనాటికి సీట్లు పెరగబోతున్నాయి. 119 నియోజకవర్గాలు 153 కాబోతున్నాయి. పార్లమెంట్ సీట్లు పెరగనున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున 60-70 మందే ఎమ్మెల్యేలున్నారు. రాబోయే రోజుల్లో కొత్తగా మరో 80 మందికి టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది. యువతకు మాట ఇవ్వదల్చుకున్నా. ప్రజల్లో ఉండండి.. కొట్లాడండి. ప్రజాసేవ చేయండి. మీరు అడగాల్సిన పని లేదు. ఢిల్లీకి వెళ్లాల్సిన పనిలేదు. మీ టికెట్

మిగతా 2వ పేజీలో...



క్రమశిక్షణకు మారు పేరు

రోశయ్య

మాజీ సీఎం జయంతి సభలో మంత్రులు దుద్దిళ్ల, జూపల్లి, పొన్నం

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే 7

గ్రూపులు కడతామంటే..
భయపడం!

- కాంగ్రెస్ ఇలాంటి ఒడిదుడుకులను చాలా చూసింది
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు
- ఇబ్బందులుంటే పార్టీ అంతర్గత వేదికల్లోనే మాట్లాడాలి
- నెలాఖరులోగా నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలి
- తెలంగాణను మోడల్ స్టేట్‌గా తీసుకుంటున్నాం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాలి
- టీపీసీసీ పీఏసీ, విస్తృత సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం
- నామినేటెడ్ పోస్టులకు పేర్లను షార్ట్‌లిస్ట్ చేసి పంపాలని నాలుగు నెలలుగా కోరుతున్నా స్పందించడం లేదు
- మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి



టీపీసీసీ, పీఏసీ భేటీలో ఖర్గే. చిత్రంలో రేవంత్, వేణుగోపాల్, మహేశ్

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): "ఓ నలుగురు, ఐదుగురు ఎమ్మెల్యేలతో గ్రూపులు కడతాం.. ఏదో చేస్తామంటే భయపడతామా? నేను గానీ, రాహుల్ గాంధీ గానీ భయపడేది లేదు. ఇలాంటి ఒడిదుడుకులను కాంగ్రెస్ పార్టీ ఎన్నింటినో చూసింది. పార్టీ నేతలు ఇష్టారీతిన వ్యవహరిస్తే రాహుల్‌గాంధీ అస్సలు సహించరు. పార్టీ క్రమశిక్షణను తప్పి ప్రవర్తిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు" అని పార్టీ రాష్ట్ర నేతలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హెచ్చరించారు. పార్టీ నాయకులకు ఏవైనా సమస్యలుంటే అంతర్గత వేదికలపై మాట్లాడాలని, లేకుంటే తమకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు. బహిరంగంగా మాట్లాడి ప్రతిపక్షాలకు అస్త్రాలు ఇవ్వొద్దని సూచించారు. పార్టీ, ప్రభుత్వం, కొత్త, పాత నేతలు సమన్వయంతో, క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని చెప్పారు. శుక్రవారం గాంధీ భవన్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాలు, సలహా

మిగతా 7వ పేజీలో...



20 కంటే ఎక్కువ మంది పిల్లలున్న చోట బడి!

రాష్ట్రంలో 212 గ్రామాలు, 359 పట్టణ కాలనీల్లో ఏర్పాటుకు సర్కారు నిర్ణయం

డీఈవోలకు ఉత్తర్వులు జారీ 11

ఈడీ విచారణకు అల్లు అరవింద్

రామకృష్ణ టెలిట్రానిక్స్ కేసులో విచారించిన దర్యాప్తు సంస్థ

3 గంటలకు పైగా ప్రశ్నించిన అధికారులు

మరోమారు హాజరు కావాలని ఆదేశం

ఓ ఆస్తి కొనుగోలు అంశంలో ఈడీ పిలిచింది: అల్లు అరవింద్ 11



కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రెస్‌మీట్ పెడతా

రైతు సమస్యలు, బనకచర్లపై వివరిస్తా

ఒకట్రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి బయటకొస్తా.. పార్టీ నాయకులతో కేసీఆర్

ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించిన యశోద ఆస్పత్రి వర్గాలు 9

భారత్‌కు ఒక సరిహద్దు.. ముగ్గురు శత్రువులు

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా, తుర్కియే మద్దతు

చైనా ఆయుధాల పరీక్షకు పాక్ 'లైవ్‌ల్యాబ్'

81% పాక్ సైనిక హార్డ్‌వేర్ చైనాదే 7

వెల్లడించిన ఆర్మీ అధికారి రాహుల్ సింగ్

బీసీలకు అన్యాయమే.. కాంగ్రెస్
సామాజిక న్యాయమా?



'జై బాపు' అంటూనే గ్రామ స్వరాజ్యం నిర్వీర్యం

'జై భీమ్' అని పోడు భూముల్లోకి బుల్డోజర్లు

అప్పుడు ఎమర్జెన్సీ.. ఇప్పుడు 'జై సంవిధాన్'

ఇదే కాంగ్రెస్ సామాజిక న్యాయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

రాష్ట్ర సారథిగా నేడు బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్/సిరిసిల్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర పాలనలో ఒక్క హామీని కూడా సమర్థంగా అమలు చేయలేకపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం 'సామాజిక న్యాయ సమరభేరి' అంటూ తెలంగాణ ప్రజలను మరోసారి మాయ చేయాలని చూస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. "కులగణన పేరిట బీసీలకు అన్యాయం చేసి, ముస్లింలను బీసీ కోటాలో చేర్చడమే సామాజిక న్యాయమా.." అని నిలదీశారు. సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ పార్టీ 'సామాజిక న్యాయ సమరభేరి' సభను నిర్వహించిందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "జై బాపు.. అని నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, గాంధీ

మిగతా 11వ పేజీలో...

బీజేపీకి మహిళా బాస్!







వనతీ శ్రీనివాసన్

రేసులో నిర్మల, పురందేశ్వరి, వనతీ శ్రీనివాసన్?

జాతీయ అధ్యక్ష పదవిని తొలిసారి మహిళకు అప్పగించే యోచన

దక్షిణాదిలో విస్తరణకు వ్యూహం

ప్రతిపాదనకు ఆరెస్సెస్ మద్దతు

న్యూఢిల్లీ, జూలై 4: బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి తొలిసారి మహిళను వరించే అవకాశముంది. ఈ పదవికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ మాజీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతీ శ్రీనివాసన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురు నేతలూ దక్షిణాదికి చెందినవారు కావడం విశేషం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని భావిస్తున్న నేపథ్యంలో మహిళా నాయకత్వం వైపు పార్టీ అగ్రనేతలు మొగ్గు చూపుతున్నట్టు

మిగతా 7వ పేజీలో...



'మోదీ కానుక'గా
20 వేల సైకిళ్లు

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పంపిణీ చేయనున్న బండి సంజయ్

11న తన పుట్టినరోజు సందర్భంగా టెన్త్ విద్యార్థులకు కేంద్ర మంత్రి బహుమతి

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన పుట్టిన రోజు(జూలై 11) సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 20 వేల సైకిళ్ల పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు 'మోదీ కానుక' పేరిట సైకిళ్లు ఇవ్వనున్నారు. విద్యార్థులతోపాటు

మిగతా 11వ పేజీలో...

సింగరేణి మట్టి బంగారమే!

ఓపెన్ కాస్ట్ మట్టిలో అరుదైన స్కాండియం, స్ట్రోంటియం

ఇవే కాకుండా మరో 14 రకాల అరుదైన మూలకాలు

మరిన్ని పరిశోధనలకు సీఎస్ఐఆర్‌తో ఒప్పందం

ఆగస్టు నుంచి వెలికితీతకు సింగరేణి ముమ్మర సన్నాహాలు

15 టన్నుల మట్టిలో కిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉండే అవకాశం

కొత్తగా 30 లక్షల టన్నుల అరుదైన ఖనిజాల వెలికితీతకు ప్రణాళిక

మాగ్నెట్లు, ఎలక్ట్రానిక్స్, బ్యాటరీల తయారీలో ఇవే కీలకం

తాజా పరిణామాలతో భారత్ మూడో స్థానానికి చేరుకునే చాన్స్



భూపాలపల్లి ప్రాంతంలో ఓ ఉపరితల బొగ్గు గని

(భూపాలపల్లి, ఆంధ్రజ్యోతి)

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ఇటీవల చైనా దిగుమతులపై పన్నులు పెంచారు! ట్రంప్ పన్నులు పెంచినప్పుడల్లా అమెరికా దిగుమతులపై చైనా కూడా అదే స్థాయిలో పెంచింది! ఒకరికొకరు పోటాపోటీగా 200 శాతానికిపైగా అలా పెంచుకుంటూ పోయారు! చివరకు, అమెరికాయే దిగి రావాల్సి వచ్చింది! పన్నులను తగ్గించాల్సి వచ్చింది! ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి.. చైనా నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న అత్యంత అరుదైన ఖనిజాలు! ఆ ఖనిజాల సరఫరా ఆపేసినా.. పన్నులు పెంచినా అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమే! మరి, అటువంటి అరుదైన

మిగతా 9వ పేజీలో...

నవ భారతంలో అవకాశాలకు
హద్దే లేదు

త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కానుంది

ఏఐ, సెమీకండక్టర్, క్వాంటమ్ కంప్యూటింగ్‌లతో ముందంజ

బిహార్ వారసత్వం ఘనమైనది

ట్రినిడాడ్-టొబాగోలో మోదీ

పోర్ట్ ఆఫ్ స్పెయిన్, జూలై 4 : భారత్‌లో అవకాశాలకు హద్దే లేదని, త్వరలో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఏఐ, సెమీకండక్టర్, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో చేపడుతోన్న పరిశోధనలు భారత్ అభివృద్ధికి నూతన చోదకాలుగా ఉన్నాయని చెప్పారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఆయన గురువారం ట్రినిడాడ్-టొబాగో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక

మిగతా 7వ పేజీలో...



మూడో బిడ్డను కంటే రూ. 12 లక్షలు!

రెండో బిడ్డకైతే రూ.6 లక్షలు

జనాభాను పెంచుకోవటానికి చైనా తంటాలు.. నగదు ప్రోత్సాహకాలు

గృహనిర్మాణ సబ్సిడీలూ ఇస్తున్న వైనం

పుట్టే ప్రతి శిశువుకు మూడేళ్లపాటు ఏటా 43 వేలు.. త్వరలో కొత్త పథకం

చైనాలో పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఉద్యోగాలు చేసే వయస్కుల తగ్గుదల

వివాహం పట్ల యువతలో విముఖత

బీజింగ్, జూలై 4: ప్రజల మీద అత్యంత కఠినమైన ఆంక్షలు విధించి జనాభాను తగ్గించుకున్న చైనా.. ఇప్పుడు, పడిపోతున్న జనాభాను పెంచుకోవటానికి నానాతంటాలు పడుతోంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ముగ్గురిని కన్నా ఫర్వాలేదు.. డబ్బులిస్తాం అని ప్రకటిస్తోంది. రెండో బిడ్డను కన్న

మిగతా 7వ పేజీలో...

మహాలక్ష్మి పథకంతో..
192.50 కోట్ల మంది ప్రయాణం

- రూ.6,436.17 కోట్ల రవాణా చార్జీల పొదుపు
- ఆర్టీసీలో 3,035 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం
- బీసీలకు అదనంగా రూ.2,971 కోట్లు
- ప్రగతి నివేదికలో ప్రభుత్వం వెల్లడి

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకంలో ఇప్పటి వరకు 192.50 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. తద్వారా వారు రూ.6,436.17 కోట్ల మేర రవాణా చార్జీలను పొదుపు చేసుకున్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆర్టీసీ, రవాణా, బీసీసంక్షేమ శాఖలు.. సంస్కరణలు, అభివృద్ధిపై ప్రగతి నివేదికను విడుదల చేశాయి. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల వాటా 40% నుంచి 66.56శాతానికి పెరిగింది. పొదుపు సంఘాల ద్వారా 6 వేల కొత్త బస్సులను కొనుగోలు చేయగా.. ఆర్టీసీలో ఖాళీల భర్తీకి 3035 పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్మెంట్ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటి వరకు 781 కారుణ్య నియామకాలు, మెడికల్ ఇన్వాలిడేషన్ స్కీమ్ కింద 277 నియామకాలను చేపట్టారు. 2023 డిసెంబరు నుంచి మొత్తం 2,194 కొత్త బస్సులు సంస్థలో ప్రవేశ పెట్టారు. హైదరాబాద్‌లో 275 ఇంట్రా సిటీ, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ, సూర్యాపేటలో 146 ఇంటర్ సిటీ విద్యుత్తు బస్సులను ఈ ఏడాది చివరినాటికి ప్రవేశపెట్టనున్నారు. హైదరాబాద్‌లో డీజిల్ బస్సుల స్థానంలో 2,800 ఈవీ బస్సులను ప్రవేశపెడతారు. మరోవైపు.. వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు అతిక్రమించే వారిపై రవాణా శాఖ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. అతివేగం, మాదక ద్రవ్యాలు తీసుకుని వాహనాలను నడిపిన 18,973 మంది డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేశారు. ఈవీ పాలసీలో భాగంగా.. జూలై 1 వరకు నమోదైన 42,348 వాహనాలకు రూ.311.07 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చారు. కాగా.. బీసీల అభ్యున్నతికి గత ఏడాది కంటే.. ఈసారి అదనంగా రూ.2,971.32 కోట్లను విడుదల చేసినట్లు బీసీ సంక్షేమ శాఖ విడుదల చేసిన ప్రగతి నివేదిక గుర్తుచేసింది. గీతకార్మికులు, విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలపెంపు, హస్టళ్లకు పక్కా భవనాల నిర్మాణం, బీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్‌కు కేటాయింపులు, రజక, నాయీ బ్రాహ్మణ కులాలకు ఉచిత విద్యుత్తు పథకం, గురుకులాల్లో 5,136 ఖాళీల భర్తీ గురించి తన నివేదికలో వివరించింది.

కొత్త థర్మల్ ప్లాంట్‌ల విద్యుత్ ధరపై పరిమితి

- యూనిట్‌కు రూ.2.86గా నిర్ణయించిన సీఈఆర్సీ

కొత్తగా నిర్మించిన థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ధరపై కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్సీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఈ ప్లాంట్‌లు సింక్రనైజేషన్ (విద్యుత్ ఉత్పత్తి మొదలు పెట్టి గ్రిడ్‌కు అనుసంధానం కావడం) అయినప్పటి నుంచి అవి సీవోడీ (ప్లాంట్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించే రోజు) అయ్యే వరకు యూనిట్‌కు రూ.2.86 కన్నా ఎక్కువ వసూలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు సీఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. సీవోడీ కానంత వరకు, ఒక వేళ ప్లాంట్‌లు పరిమితికి మించి విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, గ్రిడ్‌లో ఫ్రీక్వెన్సీ 50.05గా ఉంటే ఆ అదనపు విద్యుత్‌కు ఎటువంటి చెల్లింపులు చేయరు.

శంషాబాద్ విమానాశ్రయంలో
ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్ రూరల్, జూలై4 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జైపూర్ వెళ్తున్న ఇండిగో విమానం 6ఈ 815 టేకాఫ్ అయిన తర్వాత తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ అయింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 6.33 గంటలకు 190 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయిన ఇండిగో విమానంలో 41 నిమిషాల తర్వాత విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఎట్టకేలకు పైలట్లు చాకచక్యంగా వ్యవహరించి విమానాన్ని సురక్షితంగా తిరిగి ఉదయం 7.16 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో దింపడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. మరమ్మతుల అనంతరం విమానం తిరిగి జైపూర్ బయలుదేరి వెళ్లింది.

రాష్ట్రంలో భూసంస్కరణల చట్టం అమలవుతోందా?

- వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భూసంస్కరణల చట్టం- 1973 అమలు తీరుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ చట్టాన్ని సరిగా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ సింగూరు జలసాధన కమిటీ అధ్యక్షుడు కంచరి బ్రహ్మం రాసిన లేఖను స్వీకరించి సుమోటో పిటిషన్‌గా విచారణ చేపట్టింది. కొందరు సీలింగ్ పరిమితిని మించి భారీ విస్తీర్ణంలో వ్యవసాయ భూములను స్వాధీనంలో ఉంచుకుంటున్నారని, కొన్ని కార్పొరేట్ కంపెనీలు కూడా ఆదే పని చేస్తున్నాయని ఆ లేఖలో ఫిర్యాదు చేశారు. ఈ అక్రమాలపై స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్ఏ, న్యాయశాఖ కార్యదర్శులకు నోటీసులు జారీచేసింది.

అక్రమ నిర్మాణాల ముందు బోర్డులు పెట్టాలి

- స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చి ఎందుకు ఆగిపోతున్నారు?: హైకోర్టు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాల ముందు అవి 'నిబంధనలను ఉల్లంఘించిన కట్టడాలు' అని తెలిసే విధంగా బోర్డులు పెట్టాలని హైకోర్టు అభిప్రాయపడింది. ఇలా బోర్డు పెట్టడం వల్ల ప్రజలు అందులో ఇళ్లు కొని నష్టపోకుండా ఉంటారని తెలిపింది. వాటి యజమానులు పరువు కోసమైనా నిర్మాణం చేపట్టకుండా ఉంటారని పేర్కొంది. మహారాజ్‌గంజ్ తోటగూడలోని ఓ భవనానికి జీహెచ్ఎంసీ అధికారులు అది అక్రమ నిర్మాణం అని స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత కూడా కూల్చివేతలు చేపట్టకుండా సాగదీస్తున్నారని ఆరోపిస్తూ జీ శ్రీనివాస్ అనే వ్యాపారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. జీహెచ్ఎంసీ అధికారులు జారీచేసిన స్పీకింగ్ ఆర్డర్‌ను అక్రమ నిర్మాణం వద్ద బోర్డు పెట్టి ప్రదర్శించాలని సూచించింది. అక్రమ నిర్మాణమని తేలిన తర్వాత అధికారులు ఎందుకు సాగదీస్తున్నారని, ప్రజలు కోర్టుకు వచ్చే వరకు ఎందుకు ఆగుతున్నారని ప్రశ్నించింది. కూల్చివేయాలని కోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినా అమలు చేయడం లేదని తెలిపింది. అందువల్ల కోర్టు, అధికారులు అంటే అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారికి భయం పోతోందని వ్యాఖ్యానించింది. చర్యలు తీసుకోవడానికి సమయం ఇవ్వాలని జీహెచ్ఎంసీ న్యాయవాది కోరడంతో విచారణ ఈనెల 11కు వాయిదాపడింది.

ఎంపికైన అభ్యర్థుల జీవితాలను బలిపెట్టొద్దు

- పరీక్షలపై న్యాయసమీక్షకు అవకాశం తక్కువ
- గ్రూప్-1పై వాదనలు

కొంతమంది పిటిషనర్ల ఆధారరహిత ఆరోపణల కోసం తమ జీవితాలను బలిపెట్టకూడదని గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు హైకోర్టును కోరారు. గ్రూప్-1 మూల్యాంకనంలో లోపాలతోపాటు, సెంటర్ల కేటాయింపు, పేపర్లు సరిగాదిద్దలేదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌లలో పలువురు ఎంపికైన అభ్యర్థులు ఇంప్లీడ్ అయ్యారు. వీటిపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ కొనసాగించింది. ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ.. పోటీ పరీక్షల వంటి నైపుణ్యంతో కూడిన వ్యవహారాల్లో న్యాయసమీక్షకు చాలా తక్కువ అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల్లో ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలేనని.. వారి భవిష్యత్తును కాపాడాలని కోరారు. అత్యంత రహస్య అంశాలు సహా టీజీపీఎస్సీ మొత్తం ఎంపిక ప్రక్రియను కోర్టు ముందు ఉంచిందని, అక్రమాలకు అవకాశం లేని పారదర్శకమైన ఎంపిక జరిగిందనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. అత్యంత పకడ్బందీగా జరిగిన ఎంపిక ప్రక్రియలో జోక్యం చేసుకోరాదని పేర్కొన్నారు. తదుపరి విచారణ సోమవారానికి వాయిదాపడింది.

ఈసారి సెంచరీ!

(మొదటిపేజీ తరువాయి)

మీ ఇంటికే వస్తుంది. దారి ఖర్చులిచ్చి మరీ మిమ్మల్ని గెలిపించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుంది. మహిళా రిజర్వేషన్ రాబోతోంది. 60 మంది దాకా మహిళలు అసెంబ్లీలో ఉండబోతున్నారు. వారిలో ఐదారుగురు మంత్రులవుతారు. ప్రజల్లో ఉండే ఆడబిడ్డలను ప్రోత్సహించి టిక్కెట్లిచ్చి గెలిపించుకునే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుంది" అని అన్నారు. ఎమ్మెల్యే, ఎంపీల ఎన్నికలు అయిపోయాయని, ప్రాణసమానులైన కార్యకర్తల ఎన్నికలు ఉన్నాయని, వాటిలో మిమ్మల్ని గెలిపించే బాధ్యత తనదని, సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని, అన్ని పదవులూ భర్తీ చేసే వరకూ విశ్రమించేది లేదని చెప్పారు. కార్యకర్తలను గెలిపించుకునే పూచీ తనదని అన్నారు.

ముణ్ణాళ్ల ముచ్చటేనన్నారు

మూడు రంగుల జెండా పట్టుకుని కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని, ఆ జెండాను గుండెల్లో నింపుకొని ప్రతి తలుపును తట్టి విజయం సాధించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పుడు ఈ ప్రభుత్వం మూణ్ణాళ్ల ముచ్చటే అన్నారు. మూన్నాళ్లు అయ్యాక.. సర్కారు ఉంటుంది కానీ సంక్షేమం అమలు చేయదని ఎత్తిపొడిచారు. పథకాలను అమలు చేసిన తర్వాత.. కాంగ్రెస్ నేతలు కలిసి ఉండరు. కలహించుకుంటారని అపోహలు సృష్టించారు. ఈరోజు కలిసి ఉండటమే కాదు.. కలిసికట్టుగా ఉంటూ, నవ్విన వారి ముందు తలెత్తుకొని ఉంటున్నాం" అని సీఎం గర్వంగా చెప్పుకొచ్చారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని అమలు చేస్తూ దేశానికే మోడల్‌గా తెలంగాణను ఆవిష్కరించామన్నారు. పాదయాత్రలో రాహుల్ హామీ ఇచ్చినట్లు ఏడాదిలోనే కుల, జన గణన పూర్తి చేశామని, సామాజిక



కాంగ్రెస్ సామాజిక న్యాయ సమర భేరి సభలో సీఎం రేవంత్, కేసీ వేణుగోపాల్ మధ్య సరదా సంభాషణ

న్యాయంలో భాగంగా ఎస్సీ వర్గీకరణ చేశామని వివరించారు. రాష్ట్రంలో దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ, అడుగంటిన రాజ్యాంగ వ్యవస్థలను పునరుద్ధరించుకుంటూ, ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ తెలంగాణను అభివృద్ధి పథంవైపునకు తీసుకువెళ్తున్నామన్నారు. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చినా నిటారుగా నిలబడి ముందుకెళ్తున్నామన్నారు. "18 మాసాల్లో రైతు రుణమాఫీ, భరోసా వంటి పలు సంక్షేమ పథకాల కోసం రూ.1.04 లక్షల కోట్లను ఖర్చు పెట్టిన ఘనత కాంగ్రెస్‌దే. నాడు వరి వేస్తే ధాన్యం కొనుగోలు కేంద్రాలను బంద్ చేశారు. వరి వేస్తే ఉరి వేసుకోవడమేనని, తనకు సంబంధం లేదని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వచ్చాక.. చివరి గింజ వరకూ కొన్నాం. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి మాట నిలుపుకొన్నాం. రైతు భరోసా విషయంలో కొందరు గోతి కాడ నక్కలా ఎదురుచూశారు. ప్రభుత్వం విఫలమవుతుందని భావించారు. కానీ, 70 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్లను 9 రోజుల్లో వేశాం. సాగు దండగ కాదు.. పండగని, మాది రైతు రాజ్యమని నిరూపిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామన్నారు.

రైతుకు అండగా ఉన్నదెవరో తేల్చుకుందామా?

"రైతురాజ్యం ఎవరు తెచ్చారో అసెంబ్లీలో అయినా.. పార్లమెంటులో అయినా చర్చ పెడదాం. రైతులకు అండగా నిలబడింది ఎవరో తేల్చుకుందాం. చర్చకు కేసీఆర్, కేటీఆర్, కిషన్‌రెడ్డి, మోదీ ఎవరు వస్తారో చెప్పాలి. కాంగ్రెస్ కార్యకర్తలతో నేను వస్తాను" అని సీఎం రేవంత్ సవాల్ విసిరారు. ఇందిరాగాంధీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి.. ఇందిరమ్మ నాడు తెచ్చిన సంక్షేమం, అభివృద్ధి పేదవారి జీవితంలో వెలుగులు నింపాయని చెప్పారు. అందుకే ప్రతి సంక్షేమ పథకానికి ఇందిరమ్మ పేరు పెడుతున్నామన్నారు. "హైదరాబాద్ లో పేదవారికి రూ.5 భోజనం పెడదామని ఇందిరమ్మ పేరుతో క్యాంటీన్స్ పెడితే ఈ దద్దమ్మలు ఆమె పేరు ఎలా పెడతారని ధర్నాలు చేశారు. ఒక్కొక్కర్ని బట్టలిప్పదీసి కొడితే తప్ప.. ఇందిరమ్మ గొప్పతనం వారికి అర్థం కాదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణమే కాకుండా, వారికి వేయి బస్సులు కొనిచ్చి యజమానులను చేశామని, ఒకనాడు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్స్ అంటే అదానీ, అంబానీలకే పరిమితమని, మన ఆడబిడ్డలకు పెట్రోల్ బంకులిచ్చి వ్యాపారం చేయిస్తున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాలల పెత్తనం మహిళలకే ఇచ్చామని గుర్తు చేశారు. స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతను బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు వాళ్లకు ఇస్తే తాము ఆడబిడ్డలకు అప్పగించామని, హాస్టల్‌లో బియ్యం, ఇతరాత్రా కాంట్రాక్టులూ వారికే ఇచ్చామని, ఇందిరమ్మ రాజ్యం కాబట్టే ఆడబిడ్డలను ఆర్థికంగా ఎదగనిచ్చామని చెప్పారు. కోటీశ్వరులను చేసే బాధ్యతను రేవంత్ అన్న తీసుకుంటాడని, ప్రతి మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేరాలని పిలుపునిచ్చారు.



ఒకటి తగ్గినా..

"కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం. ఇదే ఎల్బీ స్టేడియం సాక్షిగా తొలి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలిచ్చాం. కేసీఆర్, కిషన్ రెడ్డి, నరేంద్ర మోదీకి సవాల్ విసురుతున్నా. మీకు దమ్ముంటే, ధైర్యముంటే, చిత్తశుద్ధి ఉంటే రండి. 60 వేల మందిని ఎల్బీ స్టేడియానికి తీసుకువచ్చి తలలు లెక్కపెట్టిస్తా. ఒక్కటి తగ్గినా మీ కాళ్ల ముందు క్షమాపణ చెప్పి బయటకు వెళ్తా. ఇది మా నిజాయితీ" అంటూ సీఎం రేవంత్ రెడ్డి విపక్షాలకు సవాల్ విసిరారు. ప్రైవేటు కంపెనీలు, కార్పొరేట్ కంపెనీల్లో లక్ష ఉద్యోగాలిచ్చామని, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని వివరించారు. తెలంగాణ ఉద్యమం అంటేనే నిరుద్యోగుల పోరాటమని, కేసీఆర్ మాత్రం ఉద్యోగాలివ్వకుండా గొర్రెలు, బర్రెలు పంచిపెట్టి, ఆయన, ఆయన కొడుకు రాజ్యాలు ఏలడం న్యాయమా? అని ప్రశ్నించారు. వందలాదిమంది బలిదానాలతో తెలంగాణ తెచ్చుకున్నది గొర్రెలు, బర్రెలు, చేపల కోసమా అని కేసీఆర్‌ను నిలదీశారు. "ఉన్న పాఠశాలలు సరిపోవని రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రారంభించుకున్నాం. ఏటా 1.15 లక్షల మంది ఇంజనీరింగ్ పాసైనా నైపుణ్యం లేక జాబ్స్ రావడం లేదు. అందుకే వారికి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్స్ యూనివర్సిటీ ప్రారంభించాం. స్కిల్స్ నేర్పించి, వారికి ఉపాధి కల్పించబోతున్నాం. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్స్ సాధించేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించుకున్నాం. 2034 ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి బంగారు పతకం తెచ్చే బాధ్యత తెలంగాణ యువత తీసుకుంటుందని ప్రధాని మోదీకి చెబుతున్నా" అని సీఎం అన్నారు.

దుబాయ్‌లో ఆఫీసులు పెట్టి విష ప్రచారం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో విజయాలు సాధించినా, తాము పనిలో పడి ప్రచారం చేసుకోవడం మర్చిపోయామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇన్ని కార్యక్రమాలు చేసిందంటే ఆశ్చర్యంతో నోరు తెరిచి చూస్తున్నారని, మరి, వీటిని ఎందుకు ప్రచారం చేసుకోలేకపోతున్నామని క్యాడర్‌ను ప్రశ్నించారు. కానీ, వాళ్లు (బీఆర్ఎస్) కిరాయి మనుషులను పెట్టి, దుబాయ్‌లో ఆఫీసులు పెట్టి విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి వచ్చిన వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లని, ప్రచార కార్యకర్తలుగా మారాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, సోషల్ మీడియాలో యుద్ధం ప్రకటించాలని అన్నారు. కాంగ్రెస్ చేసే యుద్ధంలో కల్వకుంట్ల గడీ తునకలు అయిపోవాలని పిలుపునిచ్చారు.



కాంగ్రెస్ సామాజిక న్యాయ సమర భేరి సభలో పాల్గొన్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీఎం రేవంత్, కేసీ వేణుగోపాల్, మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల, కోమటిరెడ్డి, దామోదర తదితరులు

వాళ్లు మొగోళ్లు కాదు... ఆడోళ్లు కాదు

బీజేపీ పార్టీ రాజ్యాంగంలోనే లౌకిక, సామ్యవాదాలు

- దమ్ముంటే రాజ్యాంగం నుంచి ఆ రెండు పదాలనూ తొలగించాలి
- ఇది నా సవాల్: ఏఐసీసీ చీఫ్ ఖర్గే

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): "రాజ్యాంగ రచన జరిగినప్పుడు సోషలిజం, సెక్యులరిజం అనే పదాలు లేవని.. మధ్యలో చేర్చిన ఆ పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ సభ్యుడొకరు కోరుతున్నారు. తొలగిస్తామంటున్నారు. నేను సవాల్ చేస్తున్నా. మీరుగానీ, మీ బీజేపీగానీ, మీ మోదీ, మీ షా.. ఎవరూ రాజ్యాంగం నుంచి ఆ పదాలను తొలగించలేరు. ఇది నా సవాల్. మీకు తొలగించే దమ్ముందా? మీ బీజేపీ రాజ్యాంగంలోనే రెండో అధికరణంలో సెక్యులరిజం, సోషలిజం అనే పదాలున్నాయి. మరి మీరెందుకు ఆ పదాలను మీ పార్టీ రాజ్యాంగంలో ఎందుకు రాసుకున్నారు?" అని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. "ఎందుకంటే.. వీరంతా ఇటు మగోళ్లు కాదు.. అటు ఆడోళ్లు కాదు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎల్బీస్టేడియంలో జరిగిన సామాజిక న్యాయ సదస్సును ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలంతా కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చిన ఆయన.. రానున్న రోజుల్లో కేంద్రంలో అధికారంలోకి రానున్నామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే ఆ ఘనత పార్టీ కార్యకర్తలదేనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పేద వర్గాలు, రైతులు, యువత, మహిళలకు న్యాయం జరిగిందన్నారు. కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ.. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని ఖర్గే ధ్వజమెత్తారు. "అధికారంలోకి రాగానే విదేశాల నుంచి నల్లధనం తెప్పించి ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు వేస్తామని ఇచ్చిన హామీని అమలు చేశారా? ఏటా 2 కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు.. ఇచ్చారా? రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇస్తామని ప్రకటించారు.. ఇచ్చారా?" అని ఖర్గే నిలదీశారు. కేంద్రంలో నెహ్రూ, ఇందిరాగాంధీ అధికారంలో ఉన్న సమయంలోనే హైదరాబాద్ చుట్టూ పక్కల ప్రాంతాల్లో 50కి పైగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటయ్యాయని.. అవేవీ మోదీ ఏర్పాటు చేసినవి కావని గుర్తుచేశారు. మోదీ సర్కారు విదేశాంగ విధానంపైనా ఖర్గే నిప్పులు చెరిగారు. "మీ విదేశాంగ విధానం సరిగ్గా లేదు. దీనివల్ల దేశం చుట్టూ శత్రు దేశాలే ఉన్నాయి. పాకిస్థాన్, చైనా.. చివరికి నేపాల్ కూడా దేశానికి దూరమయింది." అని మండిపడ్డారు.

పీవోకేను ఎందుకు లాక్కోలేదు

పహల్గాంలో ఉగ్రదాడి జరిగితే.. అన్ని రాజకీయ పక్షాలూ దేశం కోసం జవాన్లకు మద్దతు ప్రకటించాయని ఖర్గే గుర్తుచేశారు. "అఖిల పక్ష సమావేశం పెట్టాలని మేం పదే పదే కోరితే... ఏడుస్తూ అందుకు అంగీకరించారు. తీరా ప్రధాని మోదీ ఆ సమావేశానికి హాజరుకాకుండా ఎన్నికల ప్రచారం కోసం బిహార్‌కు వెళ్లారు. ఇదేనా మీ దేశభక్తి" అని దుయ్యబట్టారు. "పాకిస్థాన్‌ను నాశనం చేస్తాం... నాశనం చేస్తాం అంటూ ఎన్నికల్లో ప్రచారం చేస్తుంటారు? యుద్ధం జరిగినప్పుడు ఎందుకు నాశనం చేయలేదు. మధ్యలో ఎందుకు వదిలేశారు? అధికారంలోకి రాగానే ఆర్నెల్లలో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను లాక్కుంటామని ప్రకటించారు? ఇంకా ఎందుకు లాక్కోలేదు? భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపినట్టు ట్రంప్ చెబుతున్నారు. దీనిపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు. అమెరికాతో పాటు ప్రపంచ దేశాలన్నీ ఒక్కటై బెదిరించినా లొంగకుండా ఇందిరాగాంధీ పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసి, బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించారని గుర్తుచేశారు. "దేశ ప్రజల కోసం మహాత్మాగాంధీ, ఇందిర, రాజీవ్ ప్రాణాలిచ్చారు. మీ ఇంట్లో ఎవరైనా ఇచ్చారా? ఆర్ఎస్ఎస్ నుంచి ఒక్కరైనా దేశం కోసం ప్రాణాలు ఇచ్చారా?" అని ఖర్గే నిలదీశారు. 42 దేశాల్లో తిరిగిన మోదీ ఒక్కసారి మణిపూర్‌కు వెళ్లలేదని ఖర్గే మండిపడ్డారు. "ఎన్నిరోజులు మణిపూర్‌కు వెళ్లకుండా ముఖం చాటేస్తారు? ఆ రాష్ట్రం దేశంలో భాగం కాదా?" అని నిలదీశారు.



ప్రజల మాటే మా మాట

ప్రధాని మోదీ తన మనసులో ఏముందో చెప్పడానికి 'మన్ కీ బాత్' అంటారని.. తాము మాత్రం ప్రజల గుండెల్లో ఏముందో అదే చెబుతామని.. తమది 'దిల్ కీ బాత్' అని ఖర్గే వ్యాఖ్యానించారు. చెప్పడమే కాక.. తాము చేసి చూపిస్తామని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం 11 ఏళ్లలో అన్ని వ్యవస్థలను దెబ్బతీసిందన్న ఆయన.. మళ్లీ కేంద్రంలో తాము అధికారంలోకి రాగానే దేశ స్వరూపాన్ని సమగ్రంగా మార్చుతామన్నారు. "గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం అవినీతి పేరుతో ఏ విధంగా దోచుకుందో మనమంతా చూశాం. ఆ పార్టీ అవినీతి మీకు తెలియంది కాదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం తెలంగాణకు, హైదరాబాద్‌కు చేసిందేం లేదు. హైదరాబాద్‌కు ఐటీని ఎవరు తెచ్చారు? నెహ్రూ, ఇందిరా హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశాం. తెలంగాణకు మీరు (బీజేపీ) చేసిందేంటి? సోనియాగాంధీ చొరవతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది" అని ఖర్గే వ్యాఖ్యానించారు.



ఖర్గేతో కరచాలనం చేస్తున్న జగ్గారెడ్డి

దేశానికి ఆదర్శంగా తెలంగాణ

దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో తొలిసారిగా కులగణన చేయించిందని ఖర్గే గుర్తుచేశారు. ఉపాధి, సామాజిక న్యాయం అందించాలనే ఉద్దేశంతోనే ఆ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని.. కులగణనతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. జనాభా దామాషా ప్రకారం బీసీ వర్గాలకు రిజర్వేషన్లు అందించడానికి కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని.. బీసీలకు రిజర్వేషన్లు ఇప్పించే దాకా తాము విశ్రమించబోమని ప్రకటించారు. రాష్ట్ర ప్రజలు కూడా మరింత అప్రమత్తంగా ఉంటూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా.. రేవంత్ సర్కారు రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి ఖర్గే ప్రస్తావించారు. రైతు భరోసా కింద 15 ఎకరాల దాకా వ్యవసాయ భూములు ఉన్న 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.8265 కోట్లు వేశామన్నారు. రాష్ట్రంలోని 4.5 లక్షల మంది గిగ్ వర్కర్ల కోసం చట్టం తేనున్నామని.. ప్రతి పేదవాడికీ సహాయం చేయనున్నామని హామీఇచ్చారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో అన్ని రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టాన్ని తెస్తామని రాహుల్ గాంధీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసిన ఖర్గే.. దానికి అనుగుణంగా చట్టం తెస్తామని వెల్లడించారు. తెలంగాణలో ప్రతి చోటుకూ, ప్రతి గడపకూ జై బాపు, జై సంవిధాన్ నినాదంతో వెళ్దామన్నారు.


మోదీ లేడుగా... భయమెందుకు?

ఖర్గే ప్రసంగం ముగింపులో.. జై కాంగ్రెస్, జై హింద్ అనే నినాదాలు చేస్తూ సభకు హాజరైన కార్యకర్తలతో కూడా అవే నినాదాలు ఇప్పించారు. కొందరి నుంచి స్పందన రాకపోవడంతో.. "సభకు మోదీ రాలేదు కదా మీరెందుకు భయపడుతున్నారు?" అంటూ వారితో నినాదాలు చేయించారు. సభ ముగిసిన అనంతరం ఆయన 5.45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

రాజ్యాంగాన్ని
మార్చడానికి బీజేపీ కుట్ర

పదేళ్లలో అడ్డగోలుగా బీఆర్ఎస్ దోపిడీ: భట్టి

ఒకవైపు రాజ్యాంగ రక్షణ కోసం కాంగ్రెస్, ఇండియా కూటమి పోరాడుతుంటే.. మరోవైపు, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ, ఎన్డీఏ కూటమి కుట్రలు చేస్తున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. 'సామాజిక న్యాయ సమర భేరి సభ'లో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగమంటే కేవలం ఒక పుస్తకం కాదని, దేశ ప్రజల అవసరాల కోసం రూపొందించిన అద్భుత గ్రంథమని పేర్కొన్నారు. రాజ్యాంగమే లేకపోతే దేశంలోని పేదలు, సామాన్యులు, దళితులు, గిరిజనులకు ఎలాంటి హక్కులు ఉండేవి కావని చెప్పారు. రాజ్యాంగాన్ని నిలబెట్టుకుంటేనే అందరికీ భవిష్యత్తు ఉంటుందన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ అడ్డగోలుగా దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. ఇక, కేంద్రంలోని బీజేపీ సర్కారు రాష్ట్రాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సామాజిక న్యాయ సూత్రాన్ని పాటిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.



ఆ 11 మంది ఏమయ్యారు?

సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి ఐదు రోజులైనా దొరకని ఆచూకీ

- డీఎన్ఏ పరీక్షల్లోనూ తేలని ఆనవాళ్లు
- వారి కుటుంబాలకు ఏం చెబుదాం?
- తర్జనభర్జనలో అధికారులు.. పరిశ్రమలో మరోసారి అణువణువూ గాలింపు
- చికిత్సపొందుతున్న వారిలో మరొకరు మృతి
- 39కి చేరిన మృతుల సంఖ్య.. మరో నలుగురికి సీరియస్


గల్లంతైన కార్మికుల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు

సంగారెడ్డి ప్రతినిధి, పటాన్‌చెరు, పటాన్‌చెరు రూరల్, ఆంధ్రజ్యోతి, జూలై 4: పాశమైలారంలోని సిగాచి రసాయన పరిశ్రమలో ప్రమాదం జరిగి ఐదు రోజులు గడుస్తున్నా, శిథిలాల తొలగింపు దాదాపు పూర్తయినా ఇంకా 11 మంది కార్మికులు, సిబ్బంది ఆచూకీ దొరకలేదు. నిజానికి ప్రమాద స్థలంలో దొరికిన మృతదేహాల్లో చాలా మందికి సంబంధించి ఏవో కొన్ని చిన్న చిన్న భాగాలే దొరికాయి. ఒడిశాకు చెందిన మహాపాత్రో అనే కార్మికుడికి సంబంధించి అర చెయ్యితోపాటు మరో రెండు చిన్న భాగాలే లభించాయి. ఈ నేపథ్యంలో ఆచూకీ దొరకని 11 మంది పూర్తిగా కాలిబూడిదయ్యారా? ఇతర మృతదేహాల భాగాల్లో వీరి భాగాలు కలిసిపోయి ఉంటాయా అన్నది తేలడం లేదు. బాధిత కుటుంబాలకు ఏం చెప్పాలనే దానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ప్రకటన చేద్దామని భావిస్తున్నట్టు తెలిసింది.

మరోసారి అణువణువూ గాలింపు

ఆచూకీ తెలియకుండా పోయినవారు ప్రమాద సమయంలో ఏదైనా మూలకు వెళ్లి దాక్కునే ప్రయత్నం చేసి ఉండొచ్చని, వారికి సంబంధించి అవశేషాలు ఏమైనా లభించవచ్చనే ఉద్దేశంతో సహాయక బృందాలు ఫ్యాక్టరీలోని అన్ని విభాగాల్లో అణువణువూ గాలింపు చేపట్టాయి. సందేహంగా ఉన్న బూడిద, ఇతర అవశేషాలను సేకరిస్తున్నాయి. కాగా, సిగాచి పరిశ్రమలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఇస్నాపూర్‌కు చెందిన సిల్వేరు రవి (36) కూడా గల్లంతయ్యారు. ప్రమాదం జరిగిన రోజున ఆయన విధులకు హాజరైనట్టు రికార్డుల్లో ఉంది. కానీ ఇప్పటివరకు ఆచూకీ దొరకలేదు.


పరిశ్రమలో శిథిలాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న రెస్క్యూ బృందాలు

క్షతగాత్రుల్లో ఒకరు మృతి..

ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహారాష్ట్ర కార్మికుడు భీంరావు శుక్రవారం చనిపోయారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మొత్తంగా మృతుల సంఖ్య 39కి చేరింది. వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్న నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఇప్పటివరకు 12 మంది డిశ్చార్జికాగా, మరో 21 మంది ఆస్పత్రుల్లో ఉన్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 15 మృతదేహాల డీఎన్ఏ విశ్లేషణ పూర్తవడంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు. శిథిలాల్లో దొరికిన ఈ మృతదేహాల భాగాలను ప్లాస్టిక్ కవర్లలో చుట్టి, కార్టన్ డబ్బాల్లో పెట్టి తరలిస్తున్నారు. చాలావరకు స్థానికంగా శ్మశాన వాటికల్లోనే దహనం చేస్తుండగా.. మరికొందరు స్వరాష్ట్రాలకు తీసుకెళ్తున్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎస్

సిగాచి ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు భరోసా ఇచ్చారు. సీఎస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ శుక్రవారం పరిశ్రమను సందర్శించింది. ప్రమాదానికి కారణాలు, భద్రతా ప్రమాణాలు, ఇతర అంశాలపై సమీక్షించింది. బాధిత కుటుంబాలను పరామర్శించింది. త్వరలోనే ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపడతామని ఈ సందర్భంగా సీఎస్ పేర్కొన్నారు.

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు.. ఒకే అంబులెన్సులో..

సిగాచి ప్రమాదంలో బిహార్‌లోని రోథాస్ జిల్లా అవుర్హా గ్రామానికి చెందిన ముగ్గురు కార్మికులు దిలీప్‌కుమార్, దీపక్‌కుమార్, నాగపాశ్వాన్ మృతిచెందారు. డీఎన్ఏ విశ్లేషణతో వారి మృతదేహాలను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇక చికిత్స పొందుతూ మృతి చెందిన భీంరావు మృతదేహాన్ని ఆయన భార్య సోని, బంధువులు కలసి స్వగ్రామం మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలూకా మనుర్‌కు తరలించారు. ఒడిశాకు చెందిన ప్రశాంత్ మహాపాత్రోకు సంబంధించి మూడు భాగాలను డీఎన్ఏ పరీక్షల ఆధారంగా గుర్తించి.. ఆయన భార్య సోనాలికి అప్పగించారు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు అధికారులు ఇస్నాపూర్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా..

ఇంజనీరింగ్‌కు కొత్త సిలబస్

- జేఎన్‌టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి
- కొత్త అకడమిక్ రెగ్యులేషన్స్‌పై ముగిసిన కసరత్తు
- మొత్తం 164 క్రెడిట్లు.. అందులో 160 వస్తే చాలు
- తక్కువ గ్రేడ్ లేదా ఫెయిలైన సబ్జెక్టుల నుంచి 4 క్రెడిట్‌ల వరకూ మినహాయింపు
- పాస్ కాకపోతే రెగ్యులర్ సబ్జెక్టులు తీసుకోవచ్చు

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు వీలుగా జేఎన్‌టీయూహెచ్ కొత్త అకడమిక్ (ఆర్25) రెగ్యులేషన్స్‌ను రూపొందించింది. వీటిపై వర్సిటీ ప్రాంగణంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాయింట్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ల సమావేశం శుక్రవారం ముగిసింది. కొత్త అకడమిక్ రెగ్యులేషన్స్‌లో కీలక అంశాలను వర్సిటీ వీసీ టి.కిషన్‌కుమార్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. వర్సిటీ పరిధిలోని నాన్ అటానమస్ అఫిలియేటెడ్ కళాశాలలకు తాజా (ఆర్25) నిబంధనలు 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వస్తాయని, అటానమస్ హోదా కలిగిన కళాశాలలకు.. ఈ నిబంధనలను మార్గదర్శకంగా తీసుకొని కోర్సు నిర్మాణాలను, సిలబస్‌ను అనుమతించదగిన పరిమితుల్లో మార్చుకునే సౌలభ్యం ఉందన్నారు.

ఆర్25 నిబంధనల్లో ప్రధాన అంశాలివీ..

బీటెక్ ప్రోగ్రామ్‌కు 164 క్రెడిట్‌లు అవసరం. అయితే, విద్యార్థులు తక్కువ-గ్రేడ్ లేదా ఫెయిలైన సబ్జెక్టుల నుంచి 4 క్రెడిట్‌ల వరకు (ల్యాబ్‌లు, సెమినార్‌లు, ప్రాజెక్ట్‌లు లేదా ఇంటర్న్‌షిప్‌లు మినహా) మినహాయింపు పొందవచ్చు. పరిశ్రమ-సంబంధిత నైపుణ్యాల కోసం ప్రత్యేకంగా ల్యాబ్ కోర్సులను ప్రవేశపెడుతున్నారు.

- మల్టిపుల్ ఎగ్జిట్-మల్టిపుల్ ఎంట్రీ (ఎంఈఎంఈ) ఆప్షన్‌లో భాగంగా విద్యార్థులు సెకండియర్ సంవత్సరం తర్వాత అన్ని కోర్సులూ ఉత్తీర్ణులై 2 అదనపు క్రెడిట్లతో బయటకు వెళ్లిపోవచ్చు. అయితే.. ఆరు వారాల వృత్తిపరమైన కోర్సు/ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఎగ్జిట్ కోసం రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ ప్రారంభంలోనే ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఏడాది తర్వాత.. గరిష్ఠంగా ఐదేళ్లలోపు తిరిగి మూడో సంవత్సరంలో చేరడానికి అనుమతిస్తారు.
- విద్యార్థులు ఒక సెమిస్టర్ ముందుగానే మూక్ కోర్సుల కోసం నమోదు చేసుకోవచ్చు. ఒకవేళ మూక్ కోర్సులు పాస్ కాలేని పక్షంలో రెగ్యులర్ సబ్జెక్టులను తీసుకోవచ్చు.
- రెగ్యులర్ ఇంజినీరింగ్ సబ్జెక్టులతో పాటు బీటెక్ విద్యార్థులు మొత్తం 3 క్రెడిట్‌లు కలిగిన నాలుగు తప్పనిసరి సబ్జెక్టులను చదవాల్సి ఉంటుంది. వాటికి ఈ ఏడాది నుంచి క్రెడిట్స్ వర్తింపజేయాలని నిబంధనల్లో పొందుపరిచారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ సబ్జెక్టులకు క్రెడిట్‌లు ఒక్కో కృతి చొప్పున, జెండర్ సెన్సిటైజేషన్, భారత రాజ్యాంగం సబ్జెక్టులకు 0.5 క్రెడిట్‌లు చొప్పున ఇస్తారు.
- అనివార్య పరిస్థితుల కారణంగా విద్యార్థి ఏదైనా మిడ్‌టర్మ్ (ఇంటర్నల్) పరీక్షకు హాజరుకాని పక్షంలో.. కంప్యూటర్ ఆధారిత పరీక్షకు (సీబీటీ) హాజరుకావచ్చు.
- వివిధ కారణాల వలన విద్యాసంవత్సరం కోల్పోయి, తిరిగి ప్రవేశం (రీ-అడ్మిషన్) పొందిన విద్యార్థులు తమ చదువును కొనసాగించేందుకు వీలుగా సమానమైన సబ్జెక్టుల కోసం లుకప్ టేబుల్‌ను బోర్డ్ ఆఫ్ ఛైర్‌పర్సన్లు రూపొందిస్తారు.
- ఇప్పటివరకూ కంప్యూటర్ సైన్స్‌లోనే మైనర్ డిగ్రీలను అందించారు. ఇకపై సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి వాటిలోనూ మైనర్ ప్రోగ్రామ్స్ అందుబాటులోకి రానున్నాయి.
- ఇంటర్న్‌షిప్‌లు, పరీక్షల ప్రణాళిక కోసం ప్రైవేటు కళాశాలలు, జేఎన్‌టీయూ అకడమిక్ క్యాలెండరుకు అనుగుణంగా తమ క్యాలెండరును రూపొందించుకోవాలి.
- స్టార్టప్ సంస్కృతి, వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించడానికి రెండో సంవత్సరంలో ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెనర్‌షిప్ కోర్సును ప్రవేశపెడుతున్నారు.

రాష్ట్రంలో యూకే వర్సిటీల ఆఫ్ క్యాంపస్‌లు

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

యూకేకు చెందిన విశ్వవిద్యాలయాల ఆఫ్-క్యాంపస్‌లను తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నామని తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని సందర్శించిన యూకే తెలుగు రాష్ట్రాల డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ బృందంతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా యూకే-తెలంగాణ వర్సిటీల మధ్య సహకారం, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమం, వర్సిటీలు సంయుక్తంగా అందించే సమీకృత డిగ్రీ కోర్సులు, డ్యుయల్ డిగ్రీ కోర్సులపై వారితో చర్చించారు. కార్యక్రమంలో మండలి వైస్‌ఛైర్మన్ ఎస్.కె.మహమూద్, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కుబేరుల బిల్లు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కలల బిల్లు ఉభయసభల ఆమోదాన్నీ సాధించింది. సెనేట్‌లో ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కీలక ఓటుతో గట్టెక్కిన 'ఒన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్', ప్రతినిధుల సభలో నాలుగు అనుకూల ఓట్లు అదనంగా సాధించింది. బిల్లును వ్యతిరేకిస్తూ హకీం జెఫ్రీస్ లాంటివారు గంటలకొద్దీ ప్రసంగాలు దంచినా, అనవసరపు జాప్యం తప్ప, అంతిమంగా ట్రంప్ కోరుకున్నదే జరిగింది. ఏదో వ్యతిరేకించాలి కదా అన్నట్టుగా డెమోక్రాట్లు వ్యవహరించారే తప్ప, ఈ బిల్లు ఎంత వివక్షాపూరితమైనదో, ప్రజావ్యతిరేకమైనదో తెలియచెప్పే ప్రయత్నం వారు చేయలేదనీ, నిరసనలు ర్యాలీలతో ప్రజాక్షేత్రంలో ఆ పనిచేసివుంటే రిపబ్లికన్లమీద మరింత ఒత్తిడి పెరిగేదని సామ్యవాదులు సణుగుతున్నారు. పైకి శత్రువుల్లాగా కనిపిస్తారు తప్ప ధనికులకు మేలు చేకూర్చే విషయంలో ఈ రెండుపార్టీల మధ్యా పెద్ద తేడా కనిపించదు.

అమెరికా భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేయబోతున్న ఈ బిల్లులోని మంచిచెడులు, పేద, మధ్యతరగతికి ఒనగూరే అపారనష్టం ఇత్యాదివి వెనక్కుపోయి, పార్టీల పరంగానే ఓటింగ్ జరగడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఓ ఇద్దరు తప్ప, బిల్లును గట్టిగా వ్యతిరేకిస్తారనుకున్న కొందరు రిపబ్లికన్లు ఆఖరునిముషంలో ట్రంప్‌కే జై కొట్టారు. బిల్లు సెనేట్ ఆమోదం పొందిన తరువాత కూడా ఆరోగ్యపథకాల్లో కోతలు మరీ హెచ్చుగా ఉన్నాయంటూ అభ్యంతరాలు పెడుతూవచ్చినవారు కూడా ట్రంప్ ప్రత్యక్ష హెచ్చరికలకు, ఆయన అభిమానుల ఆన్‌లైన్ బెదిరింపులకు దిగిరాకతప్పలేదని మీడియా అంటోంది. ఓటింగ్‌కు ముందు ప్రతినిధుల సభ స్పీకర్ తన ప్రసంగంలో కమ్యూనిస్టులను తిట్టిపోసి, భగవంతుడిపట్ల విశ్వాసాన్ని గుర్తుచేసి తనవంతు పాత్ర ప్రశస్తంగా పోషించారు. ఒకప్పటి ఆప్తమిత్రుడు, తన విజయసారథి ఎలాన్ మస్క్‌నే ఈ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడితే దేశంనుంచి గెంటేస్తానన్న ట్రంప్ తన పార్టీవారినంతా ఏకతాటిమీద నడిపించగలిగారు.

వెయ్యిపేజీల ఈ బిగ్ బిల్లును ఎంతమంది ప్రజాసేవకులు పూర్తిగా చదివారో తెలియదు కానీ, అమెరికా చరిత్రలోనే అంతపెద్ద బిల్లుమీద సంతకం చేస్తున్నందుకు ట్రంప్‌మాత్రం తెగముచ్చటపడిపోతున్నారు. అమెరికా పుట్టి 250సంవత్సరాలయిన సందర్భంలోనే ఈ బ్యూటిఫుల్ బిల్లు ఆమోదం పొందడం శుభసూచకమని, ఇక దేశానికి తిరుగు ఉండదనీ, తన ఏలుబడిలో ఆర్థికంగా బలపడుతున్న అమెరికా ఇక రాకెట్ లాగా దూసుకుపోతుందని చెప్పుకొస్తున్నారు. తాను తిరిగి అధికారంలోకి రావడానికి భూరి విరాళాలతో తనకూ పార్టీకీ సహకరించిన తోటి కుబేరులను మూడు ట్రిలియన్ డాలర్ల పన్ను మినహాయింపులతో అతి భారీగా ఆదుకుంటున్నందుకు తెగమురిసిపోతున్నారు. అమెరికా సమాజంలో ఎగువ ఇరవైశాతంమీద తన ఈ ఖరీదైన ప్రేమకారణంగా దేశఖజానాకు వచ్చిపడిన లోటు పూడ్చడానికి అట్టడుగు ఇరవైశాతాన్ని శిక్షిస్తున్నాడాయన. వారికి అందాల్సిన వైద్యానికీ, ఆహారానికీ ట్రిలియన్ డాలర్ల కోతపెడుతున్నారు. ప్రవాసులు పంపే సొమ్ముమీద పన్ను విధించారు. ఒకపక్క స్వయంగా తానే యుద్ధాలు చేస్తూ, మరోపక్క నోబెల్‌శాంతి కోసం అర్రులు చాస్తున్న అమెరికా అధ్యక్షుడు ఈ బిల్లుద్వారా అదనంగా మూడువందల బిలియన్ డాలర్లు సమకూర్చుకొని, ఆయుధాలమీదా, అంతర్గత భద్రతను పరిరక్షించే పేరిట ఉద్యమాల అణచివేతమీదా ఖర్చు చేస్తారు. కూలిపనులు చేసుకోవడానికి వచ్చే వలస కార్మికులను అడ్డుకోవడానికీ, లోపలివారిని బయటకు గెంటేయడానికీ వాడతారు. ఈ 'ఏలియన్స్' ఏరివేతకు వీలుగా సమస్త వ్యవస్థలనూ ఆధునికీకరిస్తారు. కార్మికులకంటే, ఉద్యోగులకంటే కార్పొరేట్ సంస్థలు తక్కువ పన్ను చెల్లించే అమెరికాను చూడాలనుకుంటున్నారు ట్రంప్.

ఘనమైన అమెరికాను గతపాలకులు ముంచేశారని, విదేశాలతో సుంకాలయుద్ధాలనుంచి, స్వదేశంలో ఉద్యోగాల పీకివేతవరకూ తాను చేస్తున్నందంతా దేశాన్ని తిరిగి ఉన్నతంగా నిలబెట్టేందుకేనని ట్రంప్ చెప్పుకుంటారు. అమెరికా అప్పునీ, లోటునీ బూచిగా చూపి, ఖర్చు తగ్గించే పేరిట ఉపాధికీ, సంక్షేమానికీ ఎసరుపెడుతూ వచ్చారు. శుద్ధ దండుగ, వృథా అంటూ తనకు గిట్టని అనేక పథకాలు, కార్యక్రమాలు నిలిపివేసి, విదేశీసాయాలకు కోతవిధించాడు. ఎలాన్‌మస్క్‌ను అదేపని మీద నియమించి, అనంతరం తనకు అడ్డుతగులుతున్నందుకు ఆయననూ గెంటేశారు. సంక్షేమానికి కోత విధించి, ధనికులకు మేతవేసి, రక్షణరంగ బడ్జెట్‌ను ట్రిలియన్ డాలర్లకు పెంచి, దేశాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టేసే డర్టీ బిల్ ఇది.

'సంఘ్' సంకల్పం సాకారమయ్యేనా?

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మనోరథం నెరవేరలేదు. అయితే అది తన లక్ష్య సాధనలో వెనకడుగు వేయడం లేదు. ఒక హిందూ రాష్ట్ర (హిందూ రాజ్యం)ను నెలకొల్పాలనేది దాని ధ్యేయం. పవిత్ర రోమన్ సామ్రాజ్యం (క్రీ.శ.800–1800), ఇస్లామిక్ ఖలీఫా (క్రీ.శ. 632–1258) స్ఫూర్తితో హిందూ రాష్ట్ర భావన రూపుదిద్దుకున్నది. ఈ దేశ పాలన హిందూ ధర్మ గ్రంథాల ప్రకారం ఉండాలని ఆ భావన నిర్దేశిస్తుంది. వంద సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు భారత్‌ను హిందూ రాజ్యంగా పునః స్థాపించడం ఒక పరమ లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో సంఘ్ అప్పుడప్పుడూ వెనక్కు తగ్గినట్టు కనిపించినప్పటికీ దాని నిర్ణయం మారలేదు. హిందూ రాజ్య సంస్థాపనే దాని దృఢ సంకల్పం. సంకల్ప సాధనకు సరైన సమయం కోసం వేచి ఉన్నది. సంఘ్ హిందూ రాష్ట్ర భావనకు అనేక ఉప లక్ష్యాలు ఉన్నాయి. అవి: రాజ్యాంగ అధికరణ 370 రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణం, వారణాసి, మధుర మొదలైన పవిత్ర ప్రదేశాలపై హిందువులకు సంపూర్ణ హక్కు, బాబాసాహెబ్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ప్రాతిపదికగా ఉండే రాజ్యాంగాన్ని తీసుకురావడం మొదలైనవి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆధునిక జాతి–రాజ్యం (నేషన్–స్టేట్)కు పునాది పౌరసత్వ భావన హిందూ జాతి లేదా రాజ్యంకు మూల స్తంభం హిందూ మతం. 'గురూజీ'గా సంస్మృతుడవుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ద్వితీయ సర్ సంఘ్‌చాలక్ (1940–73) ఎమ్ఎస్ గోల్వాల్కర్ తన పుస్తకం 'We, or Our Nationhood Defined'లో ఇలా రాశారు: 'హిందుస్థాన్‌లోని విదేశీ జాతులవారు అందరూ విధిగా హిందూ సంస్కృతిని అనుసరించాలి, హిందూ మతాన్ని గౌరవించాలి. హిందూ జాతి సంస్కృతిని మినహా మరే జాతి, సంస్కృతిని ఎట్టి పరిస్థితులలోను కీర్తించకూడదు. ప్రతి విదేశీ జాతి తన ప్రత్యేక అస్తిత్వాన్ని త్యజించి హిందూ జాతిలో సంలీనమవ్వాలి. హిందూ మతస్థులకు విధేయంగా ఉండి తీరాలి. దేనిపైన ఎలాంటి హక్కులు కోరకూడదు. విదేశీ జాతులవారు ఈ దేశంలో ప్రత్యేక అధికారాలు, సదుపాయాలకు అనర్హులు. పౌర హక్కులతో సహా ఏ విషయంలోనూ ప్రాధాన్యాన్ని ఆశించకూడదు, ఇవ్వడం జరగదు'.

సంఘీయులకు గోల్వాల్కర్ పరమ పూజనీయుడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆలోచనా స్రవంతికి ఆయనే గంగోత్రి. హిందూ రాష్ట్ర విషయమై ఆరెస్సెస్ తన భావాలు, దృక్పథాన్ని మార్చుకున్నదని అనేందుకు ఎటువంటి సాక్ష్యాధారాలు లేవు. 'జాతీయ పౌర పట్టిక' (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ – ఎన్ఆర్‌సీ), 'పౌరసత్వ (సవరణ) చట్టం' (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ ఆక్ట్ – సీఏఏ)ను సంఘ్ ఘంటాపథంగా సమర్థించింది, సంపూర్ణ మద్దతునిచ్చింది. 'చట్టవిరుద్ధ' వలసకారులను (ముఖ్యంగా బంగ్లాదేశీయులు, రోహింజ్యాలు) దేశం నుంచి బహిష్కరించేందుకు లేదా బలవంతంగా వారి వారి స్వదేశాలకు పంపించివేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఆరెస్సెస్ మద్దతునిస్తోంది (జాతీయ పౌర పట్టిక అమలును ప్రభుత్వం నిలిపివేసింది. ఆ చట్టం ఉద్దేశించని ఫలితాలకు – వేలాది హిందువులను పౌరులు కాని వారుగా గుర్తింపవలసిరావడం– కారణమవడంతో ఆ ప్రక్రియను ఆపివేసింది).

2019లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రెండో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెన్వెంటనే జమ్మూ–కశ్మీర్ రాష్ట్రానికి భారత రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేశారు. ఆ ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370ను ఉపసంహరించేందుకు అదే అధికరణలోని 370(1), (d), (3) సెక్షన్లను ఉపయోగించుకున్నారు. మృదువుగా చెప్పాలంటే ఇది చాలా విడ్డూరమైన విషయం, విపరీతమైన చర్య. దీని రాజ్యాంగబద్ధత సందేహాస్పదమైనది. రాజ్యాంగ సవరణకు అధికరణ 368 నిర్దేశించిన పద్ధతిని అనుసరించకుండా చేసిన సవరణ రాజ్యాంగ విరుద్ధమైనదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే అధికరణ 370(1), (d) కింద రాజ్యాంగ నిబంధనలు అన్నిటినీ జమ్మూ–కశ్మీర్‌కు వర్తింపచేసేందుకు రాష్ట్రపతి తన అధికారాలను ఉపయోగించడం అధికరణ 370 రద్దుతో సమానమని సుప్రీంకోర్టు సమర్థించింది. తద్వారా మోదీ ప్రభుత్వానికి ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడకుండా సర్వోన్నత న్యాయస్థానం నివారించగలిగింది. అయితే అనేక ముఖ్య ప్రశ్నలకు సుప్రీంకోర్టు తీర్పులో సమాధానాలు లేవు. దీంతో అధికరణ 370 రద్దుకు సంబంధించిన చట్టపరమైన సమస్యలో ఓడిపోయినప్పటికీ కశ్మీర్ విషయంలో ఏ ప్రభుత్వమూ తీసుకోలేకపోయిన సాహసోపేత నిర్ణయం తాము విజయవంతంగా తీసుకోగలిగామని మోదీ ప్రభుత్వం చెప్పుకోగలిగింది.

తన పదేళ్ల పాలన దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి పరిచిందని, అమృత్ కాల్ (స్వర్ణయుగం)లోకి దేశం ప్రవేశించిందనే నిండు విశ్వాసంతో 2024 లోక్‌సభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీకి 400 స్థానాలను గెలుచుకోవడాన్ని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఎట్టి పరిస్థితులలోను 400 స్థానాలను గెలుచుకుంటామని ఆయన స్పష్టంగా పదే పదే ప్రకటించారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి భాగస్వామ్య పార్టీలు మొక్కవోని దీక్షతో 'రాజ్యాంగాన్ని సంరక్షించాలి' అన్న నినాదంతో ఆ ఎన్నికల పోరులో మోదీ పార్టీని ఢీకొన్నాయి. 'ఇండియా' కూటమి నినాదం బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఓటు వేస్తున్న ఓటర్లను కూడా బాగా ప్రభావితం చేసింది. ఫలితంగా ఆ ఓటర్లు గణనీయమైన సంఖ్యలో 'ఇండియా' కూటమికి ఓటు వేశారు. దీంతో భారతీయ జనతా పార్టీకి లభించిన సీట్ల సంఖ్య 240కి పరిమితమయింది. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీని మోదీ సాధించలేక పోయారు. దీంతో రాజ్యాంగానికి తాము సంకల్పించిన రీతిలో సవరణలు చేసేందుకు మోదీ ప్రభుత్వానికి స్పష్టమైన అవరోధాలు నెలకొన్నాయి. మోదీ సర్కార్ ఇప్పటి వరకు ఆ అవరోధాలను అధిగమించలేకపోయింది.



రాజ్యాంగ ప్రవేశికలోని 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించాలన్న హోసబలె డిమాండ్‌కు ఎలాంటి రాజ్యాంగ సూత్రం కాని, సామాజిక అవసరం కానీ ఆధారం కానేకాదు. మతతత్వశక్తులు రగిలించిన మంటలకు ఆజ్యం పోయడమే ఆ డిమాండ్ లక్ష్యం. తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యు), అన్నాడీఎంకే, మొదలైన రాజకీయ పక్షాలు ఆరెస్సెస్ / బీజేపీకి మద్దతు నివ్వడం తమ ప్రధాన ఆశయాలకు నమ్మక ద్రోహం చేయడమే అవుతుంది. తమకు తప్పక విజయం లభించే ఒక పెద్ద పోరాటానికి 'ఇండియా' సంసిద్ధమవ్వాలి.

ఈ ప్రతికూల పరిస్థితులు ఏవీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను నిరుత్సాహపరచలేదు. తన లక్ష్య సాధనకు అది తనదైన రీతిలో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగానే కుహనా ప్రజాస్వామిక భావన అయిన 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' (వన్ నేషన్–వన్ ఎలెక్షన్–ఓఎన్‌ఓఈ)ను అమలుపరిచేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకు ముందుగా నిర్ణయించిన ప్రకారం ఒక నివేదికను సంసిద్ధపరిచారు. దానిపై దేశ ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు ఒక సంయుక్త పార్లమెంటరీ సంఘం' (జేపీసీ) నేర్పాటు చేశారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'కు సంబంధించిన బిల్లులకు పార్లమెంటు ఆమోదం పొందగలిగే దాకా ఆ జేపీసీ దేశ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూనే ఉంటుంది.

హిందూరాష్ట్ర లక్ష్య సాధనకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మరో అస్త్రాన్ని ప్రయోగించింది. రాజ్యాంగపీఠికలో ఎమర్జెన్సీ కాలంలో అదనంగా చేర్చిన 'సెక్యులర్, 'సోషలిస్ట్' అనే పదాలు రాజ్యాంగ విరుద్ధమైనవని, వాటిని రాజ్యాంగ ప్రవేశిక నుంచి తొలగించాలని సంఘ్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలె డిమాండ్ చేశారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఈ డిమాండ్‌ను తీవ్రంగా ఖండించాయి. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆ రెండు పదాలు 'నొప్పి సలుపుతున్న గాయాలు'గా వ్యాఖ్యానించడం ద్వారా హోసబలె డిమాండ్‌కు ఒక మద్దతు కల్పించారు. సంఘ్ ప్రధాన కార్యదర్శి డిమాండ్ తీవ్ర చర్చకు దారితీయగా రాజ్యాంగ పదవిలో ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ ఆ చర్చలో పాల్గొనడం పలువురిని విస్మయపరిచింది. అనేక అనుమానాలకు ఆస్కారమిచ్చింది.

రాజ్యాంగ మున్నుడిలో 'సెక్యులర్' అనే పదం ఉండడం చాలా అసంగత విషయంగా హిందూరాష్ట్ర మద్దతుదారులు భావిస్తున్నారు. అయితే అనేక భాషలతో, బహు మతాలతో, వైవిధ్య సంపన్న సంస్కృతులతో వర్ధిల్లుతున్న ఒక ప్రజాస్వామిక దేశం 'సెక్యులర్' సమాజం కాకుండా మరేమవుతుంది? ఫ్రెంచ్ పౌరులలో అత్యధికులు కేథలిక్ క్రైస్తవులు. అయినప్పటికీ వారు 'సెక్యులర్' ఆదర్శాలకు సంపూర్ణంగా నిబద్ధులు. సంఘ్‌కు ఆక్షేపణీయంగా ఉన్న మరో పదం 'సోషలిస్ట్'కు ఒక స్థిరమైన అర్థం లేదు. సంక్షేమ రాజ్య భావనను అభివర్ణించేందుకు ఆ పదాన్ని తరచు ఉపయోగిస్తుంటారు. భారత్ ఒక సంక్షేమ రాజ్యం అన్న సత్యాన్ని భారతీయ జనతా పార్టీ నిరాకరించలేదు. రాజ్యాంగ మున్నుడిలో 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలను అదనంగా చేర్చడం వల్ల రాజ్యాంగ మౌలిక నిర్మాణ ప్రాతిపదికను మార్చివేయలేదు. నిజానికి 'లౌకికవాదం' అనేది భారత రాజ్యాంగ మౌలిక లక్షణమని 1973లో సుప్రీంకోర్టు ఒక తీర్పులో స్పష్టం చేసింది 'సోషలిజం' ఆదర్శాలు ఆదేశిక సూత్రాల (అధికరణలు 36, 51)లో పరిపూర్ణంగా ప్రతిఫలించి ఉన్నాయని దేశ సర్వోన్నత న్యాయస్థానం 1980లో వెలువరించిన మరో తీర్పులో పేర్కొంది.

సంఘ్ ప్రధాన కార్యదర్శి హోసబలె డిమాండ్‌కు ఆధారమేమిటి? ఎలాంటి రాజ్యాంగ సూత్రంకాని, సామాజిక అవసరం కానీ కానేకాదు. మతతత్వశక్తులు రగిలించిన మంటలకు ఆజ్యం పోయడమే ఆ డిమాండ్ లక్ష్యం. తెలుగుదేశం పార్టీ, జనతాదళ్(యు), అన్నాడీఎంకే, ఎల్‌జేపీ, జనతాదళ్(ఎస్) మొదలైన రాజకీయ పక్షాలు ఆరెస్సెస్ / బీజేపీకి మద్దతునివ్వడం తమ ప్రధాన ఆశయాలకు నమ్మకద్రోహం చేయడమే అవుతుంది. 'ఇండియా' కూటమి పక్షాలు ఒక పెద్ద పోరాటానికి సంసిద్ధమవ్వాలి. ఆ పోరులో అవి తప్పక విజయం సాధిస్తాయి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఈదుమూడిలో వర్గీకరణ విజయోత్సవం

ఈ ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాలలో, దేశంలోనూ కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాలు జరిగాయి. ఈ ఏడాదికి వర్గీకరణ నామ సంవత్సరంగా ప్రాధాన్యం ఉంది. అంతేకాదు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, ఈదుమూడి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) స్థాపితమై ఈ నెల ఏడో తేదీకి ముప్పై ఒక్క సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌లోని వివిధ గ్రూపులు, మాదిగ సంఘాలు, మాదిగ దండోరా ఉద్యమ సీనియర్ నాయకులు, కార్యకర్తలు జూలై ఏడున ఈదుమూడి గ్రామం వేదికగా జాతీయ స్థాయి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మహోత్సవాన్ని జరపాలని తలపెట్టారు. ఆ రోజు ఉదయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వర్గీకరణ ఉద్యమ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమాభిమానులు పెద్ద సంఖ్యలో ఈదుమూడి గ్రామానికి చేరుకోనున్నారు.



వేలాది మాదిగ ఉద్యమ కార్యకర్తలు కనీ వినీ ఎరుగని స్థాయిలో దండోరా మహోద్యమాన్ని నిర్మించారు. దీనితో పౌర సమాజం మాదిగల న్యాయమైన ఉద్యమానికి సంఘీభావంగా నిలబడింది. సమాజంలోని ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, చివరికి అత్యున్నత న్యాయవ్యవస్థ కూడా మాదిగలకు న్యాయం చెయ్యాలని సంకల్పించాయి.

1994 జూలై ఏడో తేదీన ఎమ్మార్పీఎస్ ప్రారంభించిన నాడు, ఐదేళ్లలో రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ (వర్గీకరణ) సాధించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే, ప్రారంభించిన మూడేళ్లలోనే తన లక్ష్యాన్ని ఎమ్మార్పీఎస్ చేరుకున్నది. 1997 జూన్ ఆరో తేదీన హైదరాబాద్ అసెంబ్లీ దిగ్బంధనం సందర్భంగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 68, 69 జీవోలను విడుదల చేసింది. కాగా, జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవోలు విడుదల చెయ్యడం... అధికరణం 338 ప్రకారం రాజ్యాంగ విరుద్ధమని, మాల కులస్తులలో వర్గీకరణ వ్యతిరేకులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఈ జీవోలను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో నాటి చంద్రబాబు ప్రభుత్వం వర్గీకరణ పరిరక్షణ కొరకు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది.

అయితే, ఏక నాయకత్వం పేరుతో చెలామణిలోకి వచ్చిన మాదిగ నాయకుడు చేసిన డిమాండ్ మేరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నది. ఆనాడు ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకునేలా ఏక నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఉండకపోతే– రాష్ట్రాలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరణ చేసి తీరాల్సిందేనని 2024 ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు... పాతికేళ్ల క్రితమే వచ్చి ఉండేది. దానివల్ల వర్గీకరణ సమస్య అప్పట్లోనే పరిష్కారమై ఉండేది. 'ఏక నాయకత్వం' ఏకపక్ష విధానాల వల్ల తదుపరి 25 ఏళ్లకు పైగా మాదిగ దండోరా ఉద్యమం సుదీర్ఘ సాగతీతకు లోనయ్యింది. కమ్యూనిటీకి, అణగారిన కులాలు, జాతులకు ఈ లోగా అపార నష్టం జరిగిపోయింది.

అయినప్పటికీ, వేలాది మాదిగ ఉద్యమ కార్యకర్తలు, నాయకులు చదువులు, వృత్తులు, ఉద్యోగాలను, వారి ఆదాయ మార్గాలను, కుటుంబాలను వదిలిపెట్టి, ఎంతో పట్టుదలతో, దీక్షతో గ్రామాల్లోని ప్రతీ మాదిగ పల్లెకూ విద్య, ఉద్యోగ వర్గీకరణ హక్కుల సాధనా సందేశాన్ని తీసుకెళ్లారు. లక్షలాది మందిని కూడగట్టారు. కనీ వినీ ఎరుగని స్థాయిలో దండోరా మహోద్యమాన్ని నిర్మించారు. దీనితో పౌర సమాజం మాదిగల న్యాయమైన ఉద్యమానికి సంఘీభావంగా నిలబడింది. సమాజంలోని ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చివరికి అత్యున్నత న్యాయవ్యవస్థ కూడా మాదిగలకు న్యాయం చెయ్యాలని సంకల్పించాయి. ఎట్టకేలకు సుదీర్ఘమైన ఉద్యమంతో, రాజ్యాంగ సంరక్షణల్లో తమ భాగస్వామ్య హక్కులను పొందే లక్ష్యాన్ని ఈ ఏడాది నెరవేర్చుకోగలిగారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆర్డినెన్సు, చట్టం, జీవోలు విద్య, ఉద్యోగ అవకాశాల ఆస్తి పంపక పత్రాలు. వీటి సాధన వెనుక, పది మంది కార్యకర్తల, నాయకుల ప్రాణత్యాగాలు ఉన్నాయి. వేలాది మంది కార్యకర్తలు, నాయకులు జైళ్ల పాలై, కేసుల పాలై, కుటుంబాలు ఛిద్రమై, ఆర్థికంగా దెబ్బతిని, అనారోగ్యాల పాలై, యవ్వనాలను త్యాగం చేసి, ఉద్యమించిన చరిత్ర ఉంది. ఎంతో సంతోషకరమైన, ఉద్వేగభరితమైన ఈ వర్గీకరణ విజయోత్సవ ఆత్మీయ కలయికకు రెండు రాష్ట్రాల నుంచి మాదిగ, మాదిగ అనుబంధ కులాల కార్యకర్తలు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో ఈదుమూడికి తరలి రావాలి. మాదిగ, మాదిగ అనుబంధ కులాల సమగ్ర అభివృద్ధికి, రాజ్యాధికార సాధన కోసం భవిష్యత్తులో జరిగే అన్ని కార్యక్రమాలలో సహకారంతో, సమన్వయంతో కలిసి ముందుకు సాగుదాం. ఈదుమూడిలో జూలై ఏడో తేదీన జరగనున్న 'ఎస్సీ వర్గీకరణ జాతీయ విజయోత్సవం' సందర్భంగా మాదిగ ఉద్యమానికి అండగా నిలిచిన, పౌర సమాజానికి, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, రాజకీయ పార్టీలు, సుప్రీంకోర్టుకు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• కృపాకర్ మాదిగ

వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

మహబూబ్‌నగర్ భవిష్యత్‌పై సదస్సు

తరాలు మారినాయి కానీ మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివాసుల, దళితుల, నిరుపేదల జీవన పరిస్థితులు మారలేదు. సహజవనరుల దోపిడీ తరలింపు ఆగలేదు. గుంపు వలసలు స్వతంత్ర వలసలైనాయి. 78 ఏండ్ల దేశ పాలన, 58 ఏండ్ల ఆంధ్ర ప్రదేశ్ పాలన, 11 ఏండ్ల తెలంగాణ పాలన మహబూబ్‌నగర్ జిల్లాను అభివృద్ధి పేరుతో వివక్షకు, పక్షపాతానికి గురిచేశాయి. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో కాలుష్యకారక కంపెనీలు జిల్లా వనరులను దురాక్రమిస్తున్నాయి. ఈ పరిస్థితులను మార్చాలనే డిమాండ్‌తో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేటి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు జరుగనున్నది. మూడు సెషన్లలో సాగే ఈ సభలో ప్రొ. జి. హరగోపాల్, రహమాన్, రాంచంద్రయ్య, డి. చంద్రశేఖర్, ప్రొ. డి.ఎన్, డా. బాబురావు, ప్రొ. కె. లక్ష్మీనారాయణ, కె. శ్రీనివాస్, ఎన్. వేణుగోపాల్, రాజేంద్రబాబు అర్విణి, ఎ. తిమ్మప్ప, ఎం. వెంకట్రాములు, కె. రవీంద్రనాథ్; ప్రొ. లక్ష్మణ్ గడ్డం, దొంతుల లక్ష్మీ నారాయణ, బి. జ్యోతి, డా. జి. విజయ్, చంద్రశేఖర శర్మ, ఎం.డి. ఇక్బాల్ పాష, జి. వెంకటేష్ గౌడ్, కె. వెంకటేశ్వర్లు; ఎం. కోదండరాం, కూనంనేని సాంబశివరావు, జాన్‌వెస్లీ, కె.జి. రాంచందర్, కె. గోవర్ధన్, ఎం. రాఘవాచారి పాల్గొంటారు.

– పాలమూరు అధ్యయన వేదిక

హౌస్ ఓనర్‌షిప్ స్మార్ట్‌కార్డు అవసరం

గ్రామ పంచాయతీల్లో సాధారణంగా ఇంటి నెంబర్‌తోనే యజమానులు ప్రతి సంవత్సరం ఆస్తి పన్ను చెల్లిస్తుంటారు. మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లలో కాస్త భిన్నంగా PTIN (Property Tax Identification Number)తో ఆస్తిపన్ను చెల్లిస్తారు. ఈ విధానం మారాల్సిన అవసరముంది. ఇల్లు, ఇంటి యజమానికి సంబంధించిన పూర్తి వివరాలతో 'హౌస్ ఓనర్‌షిప్ స్మార్ట్‌కార్డు'ను తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఇది బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా ఉండాలి. లావాదేవీలు జరిగిన ప్రతిసారీ సంబంధిత పత్రాలను సమర్పించనవసరం లేకుండా ఆ కార్డును గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖతో అనుసంధానించాలి. ఇల్లు, భూ క్రయవిక్రయాలు జరిగినప్పుడు, యాజమాన్యపు హక్కులను బదిలీ చేసినప్పుడు ఎలాంటి అవరోధాలు లేకుండా లావాదేవీలు జరుపుకోవడానికి వీలుగా ఈ కార్డును ప్రవేశపెట్టాలి. మన నిత్య జీవితంలో ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్... లాగా కొత్తగా హౌస్ ఓనర్‌షిప్ స్మార్ట్ కార్డులను రూపొందించాలి.

– దండంరాజు రాంచందర్‌రావు

సమస్యల సుడిలో సంపద సృష్టికర్తలు

ఇటీవల దూరదర్శన్ సందేశంలో ప్రధాని నరేంద్ర మోదీ తమ పదకొండేళ్ల పాలన శ్రామికుల సంక్షేమం చుట్టూ సాగిందని, ఉపాధి కల్పన, సాంఘిక సంక్షేమంలో గణనీయమైన వృద్ధి సాధించామని పేర్కొన్నారు. అదే సందర్భంలో కార్మికుల సాధికారత, సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కూడా తెలిపారు. కానీ వాస్తవమేమిటంటే మోదీ ప్రభుత్వ విధానాలు దీనికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి.

వీరి విధానాల వల్ల పేదరికం ఎంతగా పెరిగిందంటే దేశంలో ఐదేళ్ల లోపు పిల్లలలో 36 శాతం మంది ఉండవలసిన దానికంటే తక్కువ బరువు ఉన్నారు. ఇది పౌష్టికాహార లోపానికి సూచిక. అలాగే 15–49 మధ్య వయసుగల మహిళలలో రక్తహీనత 2015–16లో 53 శాతం నుంచి 2019–20కి 57.2 శాతానికి పెరిగింది. ఇదే వయస్సు గర్భిణులలో రక్తహీనత 50.4 శాతం నుంచి 52.2 శాతానికి పెరిగింది. ఒక పరిశోధన ప్రకారం 2023–24లో గ్రామీణ భారతంలో 40 శాతం మంది రెండుపూటలా భోజనం కూడా తీసుకోలేకపోతున్నారు. ఈ గణాంకాలన్నీ దేశంలో పెరుగుతున్న పేదరికానికి చిహ్నాలు.

అదే సందర్భంలో దేశంలోని కార్పొరేట్ సంస్థల ఆదాయాలు మాత్రం ఎలాంటి హద్దూ లేకుండా పెరిగిపోతున్నాయి. సంపద కేంద్రీకృతమవుతోంది. ప్రభుత్వరంగ సంస్థలను, ప్రకృతి వనరులను మోదీ ప్రభుత్వం కారు చవకగా వీరికి ధారాదత్తం చేస్తోంది. ఫలితంగా దేశంలో శత కోటీశ్వరులు సంఖ్య 2014లో వంద నుంచి 2024 నాటికి రెండు వందలకు పెరిగింది. వంద మంది శత కోటీశ్వరుల ఆస్తి 85 లక్షల కోట్ల రూపాయలకు పైగా చేరింది. మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు ఇది నిదర్శనం.


దేశంలో నేటి ఈ ఆర్థిక అసమానతలకు కారణం ప్రభుత్వ విధానాలే. ప్రభుత్వ పన్నుల విధానం క్రమేణా కార్పొరేట్ల నుంచి ప్రజలపై భారాలు వేసే దిశగా మారింది. మొత్తం రెవిన్యూ పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా 2014–15లో 34.5 శాతం ఉండగా, 2024–25 కల్లా అది 27.2 శాతానికి తగ్గిపోయింది. దీనికి తోడు ఈ పదకొండేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం 16.61 లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ సంస్థల బ్యాంకుల రుణాలను మాఫీ చేసింది.

ఇదే సమయంలో సంపద సృష్టికర్తలయిన శ్రామికుల కష్టాలు మరింతగా పెరిగాయి. సంఘటిత రంగంలో వేతన వృద్ధి ముందు ఐదేళ్లలో 10.1 శాతం ఉండగా, 2014–20 మధ్య ఆరు శాతానికి పడిపోయింది. ధరల పెరుగుదల వల్ల నిజ వేతనాలు పడిపోతున్నాయి. నికర జోడింపు విలువలో కార్మికుల వాటా 2020లో 18.9 శాతం నుంచి 2023 నాటికి 15.9 శాతానికి తగ్గిపోయింది. ఇదే కాలంలో కార్పొరేట్ల లాభాల వాటా 38.7 శాతం నుంచి 51.9 శాతానికి పెరిగింది.

కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 1.45 లక్షల కోట్ల రూపాయలను నష్టపోతోంది. దేశంలో ఎక్కడా కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనాల సవరణ కానీ, చెల్లింపు కానీ జరగడం లేదు. అందువల్ల ప్రధాని పేర్కొన్నట్లు ప్రభుత్వ విధానం కార్మికులకు కాకుండా, దానికి భిన్నంగా కార్పొరేట్లకు అనుకూలంగా మాత్రమే ఉంది. తమ విధానాలు ఇలా ఉండగా ప్రధాని వేరే విధంగా మాట్లాడడం సహేతుకం కాదు.

ప్రభుత్వం నిజంగా కార్మిక సంక్షేమానికి నిధులు రాబట్టాలంటే దానికి అనేక మార్గాలున్నాయి. ఒక మార్గం ప్రభుత్వ బ్యాంకులకు కార్పొరేట్ సంస్థలు బకాయిపడ్డ రుణాలను వసూలు చేయడం. ప్రభుత్వ బ్యాంకులు 4,10,758 కోట్ల రూపాయల బకాయి కోసం 16,420 నోటీసులు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఎగవేతదారులపై క్రిమినల్ కేసులు పెట్టి రుణాలు వసూలు చేయడానికి బదులు, ఆశ్చర్యకరంగా వాటిని ఒక్క కలం పోటుతో రద్దు చేసేసింది.

కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 1.45 లక్షల కోట్ల రూపాయలను నష్టపోతోంది. దేశంలో ఎక్కడా కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనాల సవరణ కానీ, చెల్లింపు కానీ జరగడం లేదు. అందువల్ల ప్రధాని పేర్కొన్నట్లు ప్రభుత్వ విధానం కార్మికులకు కాకుండా, దానికి భిన్నంగా కార్పొరేట్లకు అనుకూలంగా మాత్రమే ఉంది.



కార్మికులపై ఈ ఆర్థిక భారాలు చాలవన్నట్లు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను హరించేలా మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను చేసింది. రోజుకు 8 పని గంటల స్థానంలో 12 గంటలు, అంతకంటే ఎక్కువ పని; సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కులు సహా అనేక అంశాలను సమూలంగా మార్చివేసింది. కార్మిక సంఘాల నుంచి వస్తున్న ప్రతిఘటనతో దేశవ్యాప్తంగా ఒకేసారి వీటి అమలుకు మోదీ ప్రభుత్వం సంశయిస్తున్నా, తమ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న వివిధ రాష్ట్రాలలో వీటి అమలు ఇప్పటికే ప్రారంభమయింది. వేతనాలు పెరగక పోవడం, పని గంటలు పెరగడం, హక్కులు కోల్పోవడం వంటి సుడిగుండంలో నేడు దేశంలోని శ్రామికులున్నారు.

మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అంటే ఈ పదకొండేళ్లలో 22 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించవలసి ఉంది. కానీ దీనికి భిన్నంగా ఉన్న ఉద్యోగాలే కోల్పోయే స్థితి ముఖ్యంగా నేడు దేశంలోని ప్రభుత్వ సంస్థల్లో నెలకొని ఉంది. కేంద్ర ప్రభుత్వ స్వంత నివేదికల ప్రకారమే ప్రభుత్వరంగ పరిశ్రమలలో ఉద్యోగుల సంఖ్య 2013లో 17.3 లక్షలు ఉండగా 2022 నాటికి ఈ సంఖ్య 14.6 లక్షలకు పడిపోయింది. అదే కాలంలో ఎటువంటి ఉద్యోగ భద్రత లేని కాంట్రాక్టు కార్మికుల సంఖ్య మాత్రం 19 శాతం నుంచి 42.5 శాతానికి పెరిగింది. ప్రభుత్వ బ్యాంకులలో 2014లో 8.5 లక్షల ఉద్యోగులు ఉండగా, 2023లో 7.5 లక్షల మందికి తగ్గిపోయారు.

ఈ విధానాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో ఉపాధి ప్రపంచంలోనే అతి తక్కువగా మన దేశంలోనే ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదిక ప్రకారం మన దేశంలో మొత్తం ఉద్యోగులలో ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు 3.8 శాతం ఉండగా, బ్రెజిల్‌లో 12.3 శాతం, అమెరికాలో 13.3 శాతం, అర్జెంటీనాలో 16.9 శాతం, బ్రిటన్‌లో 21.5 శాతం, చైనాలో 28 శాతం, రష్యాలో 40.6 శాతం, క్యూబాలో 77 శాతం ప్రభుత్వ సంస్థల ఉద్యోగులున్నారు. దీనివల్ల కార్మికుల ఆదాయాలు పడిపోవడమే కాకుండా, రిజర్వేషన్లు తగ్గి, సామాజిక న్యాయం కూడా దెబ్బతింటోంది. దేశం గరిష్ఠ స్థాయి నిరుద్యోగాన్ని ఎదుర్కొంటోంది. దీనివల్ల పుష్కలంగా ఉన్న యువ మానవ వనరులను సద్వినియోగం చేసుకునే స్థితి లేకపోవడం దేశ భవిష్యత్తుకు హానికరం. నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థ, విశ్వ గురు అని ఎన్ని కితాబులు ఇచ్చుకున్నా, ఈ వాస్తవాలను కాదనలేం.

అందువల్ల మోదీ ప్రభుత్వ ఆర్భాట వాగ్దానాలు, అవాస్తవ ప్రకటనలే తప్ప, ఆచరణలో శ్రామికులు బ్రిటిష్ ఇండియాలో కూడా లేనంతగా ఆర్థిక అసమానతలు, భారాలను మోయాల్సి వస్తోంది. సంపద సృష్టికర్తలు సుఖంగా లేని ఏ సమాజమూ దీర్ఘకాలంలో సురక్షితంగా ఉండలేదు. దీనికి మన దేశం మినహాయింపేమీ కాదు. ఈ నేపథ్యంలోనే దేశంలోని రైతాంగ, వ్యవసాయ కార్మికవర్గ సమస్యలను కూడా ఎంతో బాధ్యతాయుతంగా జోడించి, జూలై 9న అఖిల భారత సమ్మెకు కార్మికవర్గం పూనుకుంది. ఇదో దేశభక్తియుత పోరాటం.

■ ఎ. అజశర్మ

ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక


దొడ్డి కొమురయ్య స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నారాయణ, విమలక్క

కార్పొరేట్ కోసమే 'కగార్'

- ఎన్‌కౌంటర్లతో ప్రజాపోరాటాలను ఆపలేరు
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ
- కడవెండిలో దొడ్డి కొమురయ్య వర్ధంతి

దేవరుప్పుల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారా నిజాం పాలనను తరిమికొట్టామని, ప్రజలు తలుచుకుంటే ప్రధాని మోదీ, కేంద్రం హోం మంత్రి అమిత్‌షా లాంటి వాళ్లు ఎంత అంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి ఆర్.నారాయణ ధ్వజమెత్తారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. డీకే భవనంలో జరిగిన వర్ధంతి సభలో నారాయణ మాట్లాడుతూ నిజాం సంస్థానంకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించిన 4వేల మందిని పొట్టన బెట్టుకున్నారన్నారు. ఎన్నో పోరాటాలు చేసి 10 లక్షల ఎకరాల భూ పంపిణీ చేసిన చరిత్ర ఎర్రజెండాలదని కొనియాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం అమాయక ప్రజలు, తుపాకి పట్టారని నక్సలైట్లను ఎన్‌కౌంటర్లలో హతమార్చుతోందని నారాయణ ఆరోపించారు. అడవి సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా యత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్రానికి సమాజాన్ని మార్చే ఉద్దేశం లేదని, హింసాకాండను కొనసాగిస్తున్నారని ఆరోపించారు.

ఎర్రజెండాలన్నీ ఏకం కావాలి

నెత్తుటి ఏరులు పారకుండా మళ్లీ ఎర్రజెండాలు ఏకం కావాలని, తెలంగాణ సాధించుకున్న తృప్తి మాత్రమే మిగిలిందని, ఎజెండా మాత్రం అక్కడే ఉందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఆరోపించారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సభలో ఆమె మాట్లాడుతూ హింసకు పునాది వేసింది పాలకులేననీ, వారు మారాలని, వారిలో (మిగతా 6వ పేజీలో)

రోగుల పట్ల శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- కడిపికొండ పీహెచ్‌సీ తనిఖీ


కడిపికొండ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

వరంగల్ మెడికల్/మడికొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. శుక్రవారం కాజీపేట మండలం కడిపికొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలోని అవుట్ పేషంట్ వివరాల నమోదు రిజిస్టర్, మందుల నిల్వల గది, కార్యాలయ, లాబోరేటరీ, రికార్డు, ఇన్ పేషంట్ గదులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంత మంది గర్భిణులు వస్తున్నారు..? వైద్యులు, ఆశా కార్యకర్తలు గర్భిణుల గురించి పర్యవేక్షణ చేసున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. ఓపీ నమోదు, ఈ-ఔషధి పోర్టల్‌లో పీహెచ్‌సీకి కావాల్సిన మందులను ఎలా నమోదు చేస్తున్నారో ఇండెంట్ నమోదును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భిణులకు వైద్య సేవలు అందే విధంగా చూడాలన్నారు. గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేలా సిబ్బంది, ఆశా కార్యకర్తలు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, తహసీల్దార్ బావుసింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విభేదాలు సమసేనా..? 'చేతులు' కలిసేనా!?

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఫిర్యాదుపై చర్చకు రావాలన్న మల్లు రవి 6

- ఫిర్యాదులోనే అంశాలను పొందుపర్చామని తేల్చిచెప్పిన ఎమ్మెల్యేలు
- నేడు క్రమశిక్షణ సంఘానికి కొండా మురళి వివరణ ఇచ్చే అవకాశం

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

వరంగల్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపోసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

05, 06, 07 తేదీల్లో వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును. ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485** ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిమిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంలో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.



ఎన్ఎంసీ ముడుపుల ప్రకంపనలు

- ఫాదర్ కొలంబో వైద్య కళాశాల ట్రస్టీ జోసెఫ్‌పై సీబీఐ కేసు
- అనుమతుల కోసం రూ.66 లక్షలు లంచంగా ఇచ్చినట్టు అభియోగం
- మౌలిక వసతులు లేకున్నా కళాశాల నిర్వహణ
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

వరంగల్ మెడికల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్య కౌన్సిల్ (ఎన్ఎంసీ) అధికారులకు ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలు ముడుపులు సమర్పించడంపై సీబీఐ నమోదు చేసిన కేసు ప్రకంపనలు వరంగల్‌ను తాకాయి. నగరంలోని హంటర్‌రోడ్డులో గల ఫాదర్ కొలంబో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ట్రస్టీగా వ్యవహరిస్తున్న ఫాదర్ జోసెఫ్ కొమ్మారెడ్డి... ఎన్ఎంసీ అధికారులకు లక్షలాది రూపాయల ముడుపులు చెల్లించినట్లు సీబీఐ కేసు నమోదు చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసు... తెలుగు రాష్ట్రాల్లో కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వైద్య కళాశాలలకు అనుమతి ఇచ్చే సమయంలో ఎన్ఎంసీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా మౌలిక సదుపాయాలు, లేబరోటరీలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పడకలు ఉన్నాయా లేవా అన్న అంశాన్ని పరిశీలిస్తారు. ఈ అధికారుల బృందం ఇచ్చే నివేదిక ఆధారంగానే ఆయా కళాశాలలకు గుర్తింపు లభిస్తుంది. ఈ గుర్తింపు ఆధారంగా ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుమతి ఇస్తారు. అయితే సౌకర్యాలు లేనప్పటికీ ఉన్నట్లు ధృవీకరించేందుకే ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలు లంచం ఎర చూపినట్లు స్పష్టమవుతోంది. రెండు విడతల్లో మొత్తం రూ.66లక్షలు ఎన్ఎంసీ అధికారులకు ముడుపులు చెల్లించి ఫాదర్ కొలంబో వైద్య కళాశాల ఎన్ఎంసీ గుర్తింపు పొందినట్లు తెలుస్తోంది. సిబ్బంది, ల్యాబ్ కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ తప్పుడు ధృవీకరణలతో వైద్య కళాశాల అనుమతి పొందినట్టు తెలిసింది. ఎన్ఎంసీ ముడుపుల బాగోతంపై దేశవ్యాప్తంగా సీబీఐ 36 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఆరుగురు ఏపీ, తెలంగాణకు చెందిన వారు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్ఎంసీ అధికారులు లంచాల స్వీకరణ కోసం పలు ప్రాంతాల్లో తమ అనుకూల వ్యక్తుల సహాయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి అనంతపురం కదిరి ప్రాంతానికి చెందిన డాక్టర్ హరిప్రసాద్, హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీకి చెందిన డాక్టర్ అంకం రాంబాబు, విశాఖపట్నం అక్కయ్యపాలెంకు చెందిన డాక్టర్ కిశోర్‌లు మెడికల్ కాలేజీల నుంచి ముడుపులు వసూలు చేసి ఢిల్లీలోని ఎన్ఎంసీ సభ్యులు డాక్టర్ వీరేంద్ర కుమార్‌కు పంపినట్లు సీబీఐ కేసులో ప్రస్తావించినట్లు సమాచారం. వీరిలో హరిప్రసాద్ పలు ప్రయివేట్ వైద్య కళాశాలలకు కన్సల్టెన్సీగా వ్యవహరిస్తుంటారని తెలిసింది. తనిఖీల సమయంలో డమ్మీ ఫ్యాకల్టీలను ఏర్పాటు చేయడం, ఎన్ఎంసీ లైసెన్సుల పునరుద్ధరణ కోసం లేఖలు తేవడం లాంటి పనుల కోసం లంచాలు వసూలు చేయడంలో వీరు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఇదిలావుండగా, నగరంలోని ఫాదర్ కొలంబో వైద్యకళాశాల ట్రస్టీ ఫాదర్ జోసెఫ్ కొమ్మారెడ్డిపై సీబీఐ కేసు నమోదు కావడం వైద్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కఠిన సాధనతో ఎంబీబీఎస్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఫాదర్ కొలంబో మెడికల్ కళాశాలలో చేరారు. ప్రస్తుతం ఈ కళాశాల అనుమతుల విషయంలో వివాదాలు తలెత్తడంతో వైద్య విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. సీబీఐ విచారణతోపాటు ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ ఈ కళాశాల గుర్తింపు రద్దు చేస్తే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందని ఆవేదన వ్యక్తం అవుతోంది. 2023లో ప్రారంభమైన ఈ కళాశాలలో ప్రస్తుతం ఎంబీబీఎస్ రెండు బ్యాచ్‌లకు సంబంధించి 300 మంది విద్యనభ్యసిస్తున్నారు. 2025-26 బ్యాచ్ ప్రవేశాలు ఇంకా ప్రారంభం కాలేదు.

కేయూ భూములను కాపాడుకుంటాం..

- ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 15 ఎకరాల కేటాయింపు సరికాదు
- విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరిక
- పాలక మండలి దిష్టిబొమ్మతో శవయాత్ర
- క్యాంపస్‌లో ఉద్రిక్తత

కేయూ క్యాంపస్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూముల రగడ ఉద్రిక్తతకు దారితీసింది. విద్యార్థులు శుక్రవారం కేయూ క్యాంపస్‌లోని ఇంగ్లీష్ విభాగం నుంచి పరిపాలన భవనం వరకు పాలక మండలి సభ్యుల దిష్టిబొమ్మతో శవయాత్ర ఊరేగింపు చేపట్టారు.ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ, ఏఐఎఫ్‌డీఎస్, పీడీఎస్‌యూ, ఎస్ఎస్‌యూ, డీఎస్ఏ, ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘాల నేతృత్వంలో జరిగిన నిరసనతో క్యాంపస్ హోరెత్తింది. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్, బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్‌లు మాట్లాడారు. కేయూ క్యాంపస్ భూముల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు 15 ఎకరాల భూమిని కేటాయించడాన్ని వ్యతిరేకించారు. గతంలో వర్సిటీ భూములను కొందరు కబ్జాదారులు ఆక్రమించినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. క్యాంపస్‌లో భూమిని సీఆర్‌పీఎఫ్ పోలీసులకు కేటాయించారని మండిపడ్డారు. స్కూల్‌ను వర్సిటీ బయట నిర్మించాలని అన్నారు. వర్సిటీ భూములను కాపాడుకునేందుకు ఎంతకైనా తెగిస్తామని హెచ్చరించారు. పోలీసులతో విద్యార్థుల ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. భూములను కాపాడుకునేందుకు విద్యార్థి సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంల్ జిల్లా కార్యదర్శి మద్రి మహేశ్, స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, డీఎస్సీ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్ కుమార్, గణేశ్, ఏడీఎస్ఓ నేత గణేశ్ పాల్గొన్నారు.



పాలక మండలి సభ్యుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

అడ్డుకున్న పోలీసులు

పాలక మండలి సభ్యుల దిష్టిబొమ్మలతో శవయాత్ర, ఊరేగింపుతో క్యాంపస్‌లో ఉద్రికత్త నెలకొంది. విద్యార్థుల నిరసన, ఆందోళనలను పోలీసులు అడ్డుకున్నారు. శవయాత్రతో పరిపాలన భవనంలోకి దూసుకువచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వర్సిటీ క్యాంపస్‌లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి తర్వాత వదిలివేశారు.



దీప్తా, కుల సుందరిగా భద్రకాళి

వరంగల్ కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం తొమ్మిదో రోజు ఉత్సవమూర్తిని ఇచ్ఛాశక్తి కాళీక్రమాన్ని అనుసరించి దీప్తా అమ్మవారిగా.. శోడషీక్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని కుల సుందరిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. అమ్మవారిని ఆరాధించి ధ్యానిస్తే జ్ఞానం లభిస్తుందని అర్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. భక్తులతో దేవాలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు వీరన్న, సతీష్, మయూరి, సుగుణ, స్రవంతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెరవేరని కొలువు కల

ఉరేసుకుని యువతి ఆత్మహత్య


ప్రత్యూష(ఫైల్)

శాయంపేట, జూలై4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగం రావడంలేదని ఓ యువతి మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పెద్ద కోడెపాకకు చెందిన రావుల రమేష్-సునితలు కూలీ పనులు చూస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు కాగా, పెద్దకూతురికి వివాహం అయింది. వివాహితుడై కొడుకు ప్రవీణ్ రైల్వేలో పనిచేస్తున్నాడు. చిన్న కూతురైన రావుల ప్రత్యూష(24) బీటెక్ పూర్తి చేసి, రెండేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలు రాసింది. తక్కువ మార్కులలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేకపోవడంతో కుటుంబసభ్యులతో చెబుతూ తరచూ బాధపడేది. ఈ నేపథ్యంలో శుక్రవారం రమేష్.. తన భార్యతో కలిసి కూలీ పనులకు వెళ్లాడు. దీంతో ఉద్యోగం రావడంలేదని మనస్థాపంతో ఇంట్లో ఉన్న ప్రత్యూష ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన ప్రత్యూష అమ్మమ్మ లక్ష్మీ స్థానికులను పిలవగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ తెలిపారు.


సేజీతండా వద్ద లారీలకు అంటుకున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తెల్లవారుజామున తెల్లారిన బతుకులు

- రెండు లారీల ఢీ.. మంటలు చెలరేగి ముగ్గురి సజీవ దహనం
- మరిపెడ మండలం సేజీతండా వద్ద ఘటన
- మృతుల్లో ఇద్దరు రాజస్థాన్ వాసులు
- తండ్రి కళ్లెదుటే బూడిదైన కొడుకు
- మరో మృతుడు వర్ధన్నపేట మండలం రాంధాన్ తండా వాసి

6

పెరుగుతూ తగ్గుతున్న గోదావరి

- తుపాకులగూడెం వద్ద పరవళ్లు
- సమ్మక్క సాగర్ బ్యారేజీలోని 25 గేట్లు ఓపెన్
- దేవాదులలో మరో మోటారు ఆన్

కన్నాయిగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న గోదావరి పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడుతోంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీగా పెరుగుతూ వచ్చిన గోదావరి శుక్రవారం మధ్యాహ్నం నుంచి స్వల్పంగా తగ్గుముఖం పట్టి ప్రవహిస్తూ ఉంది. ఎగువ నుంచి 1,19,200 క్యూ సెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో సమ్మక్క సాగర్ బ్యారేజీలోని 25 గేట్లు ఎత్తి దిగువకు 1,52,000 క్యూ సెక్కుల వరద నీటిని వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.388 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 78.90 మీటర్ల నీటి మట్టం నమోదయినట్లు నీటిపారుదల ఏఈ సాయిరాం తెలిపారు.

దేవాదులలో మరో మోటారు ఆన్

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో శుక్రవారం మరో మోటారును ఆన్ చేశారు. గురువారం వరకు ఫేజ్- 2 లో రెండు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసిన ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం ఫేజ్ 1 లో మరో మోటారు ఆన్ చేసి మొత్తం మూడు మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్నారు. ఫేజ్ 1 లో ఒక మోటారు, ఫేజ్ 2 లో రెండు మోటార్లు మొత్తం మూడు మోటార్ల ద్వారా 671 క్యూ సెక్కుల నీటిని భూపాలపల్లి జిల్లా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తున్నారు. దేవాదుల ఇన్‌టెక్‌వెల్ వద్ద 80.70 మీటర్ల నీటి మట్టం నమోదు అయినట్లు డీఈఈ శరత్ బాబు తెలిపారు.


తుపాకులగూడెం బ్యారేజీలోకి చేరుతున్న వరద నీరు

మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి

మహదేవపూర్ రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద తాకిడి పెరుగుతోంది. గురువారం వరకు 70వేల క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో శుక్రవారం 84,500 క్యూసెక్కులుగా నమోదయింది. దీంతో బ్యారేజీ గేట్లన్ని ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 2.10మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

రేపు తొలి ఏకాదశి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భగవద్గీత పారాయణాలు
- తొలి పండుగగా ఇంటింటా వేడుకలు



వరంగల్ కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. ఏడాదిలో పండుగలు ఈ ఏకాదశి నుంచే ప్రారంభమవుతాయి. 24 ఏకాదశిలలో ఆషాఢ మాసం ఆదివారం రోజు వచ్చే ఈ ఏకాదశిని శయన ఏకాదశిగా పిలుస్తారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి రోజు నుంచి శ్రీమహావిష్ణువు నాలుగు నెలల పాటు యోగా నిద్రలో ఉంటారని పండితులు చెబుతున్నారు. ఈ పర్వదినం సందర్భంగా భక్తులు ఉపవాస దీక్ష చేపడుతారు. వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక హోమం, అభిషేకాలు, అలంకరణలు, నైవేద్య భోగాలు నిర్వహిస్తారు. సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణం, భగవద్గీత పారాయణం నిర్వహిస్తారు. వరంగల్ నగరంలోని బట్టల బజార్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, జేపీఎన్ రోడ్డులోని గీతాభవన్, పోతన రోడ్డులోని శ్రీమురళీకృష్ణ మందిరం, ములుగు రోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, ఇస్కాన్ టెంపుల్, శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయం, భద్రకాళి ఆలయంతోపాటు సేవాశ్రమంలో భగవద్గీత పారాయణాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

కంచంలో బొక్క కొట్టాల్సిందే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి ఏకాదశిని అత్యంత వైభవంగా జరుపుకుంటారు. బంధుమిత్రులను ఆహ్వానించి విందు చేసుకుంటారు. ముఖ్యంగా కొందరు మాంసాహారాన్ని భుజిస్తారు. ఈ రోజున కంచంలో బొక్క కొడితే కాశీలో గంట మోగుతుందని పూర్వీకులు చెబుతారు.

విభేదాలు సమసేనా..? 'చేతులు' కలిసేనా!?

- కొండా మురళి ఫిర్యాదుపై చర్చకు రావాలన్న మల్లు రవి
- ఫిర్యాదులోనే అంశాలను పొందుపర్చామని తేల్చిచెప్పిన ఎమ్మెల్యేలు
- హైదరాబాద్ సభ వేదికగా బుజ్జగించే ప్రయత్నాలు

వరంగల్, జూలై 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓరుగల్లు ఎమ్మెల్యేలు, మంత్రి కొండా దంపతుల మధ్య నెలకొన్న విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో పాల్గొన్న ఎమ్మెల్యేలను బుజ్జగించే ప్రయత్నాలు జరిగినట్లుగా సమాచారం. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని గాంధీభవన్ వద్ద చూడగానే, తమ కార్యాలయానికి రావాలని కబురు పంపించారు. నాయిని 20నిమిషాల పాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై ఇచ్చిన ఫిర్యాదు చర్చించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలన్నీ కూడా మీడియాలో వచ్చాయని, ఫిర్యాదుతో పాటు పేపర్ కటింగులు, మీడియాలో ప్రసారమైన వీడియో క్లిప్పింగులను జత చేశామని నాయిని వివరించారు. ఆ తరువాత సభ వేదిక వద్ద ఉన్న వరంగల్‌కు చెందిన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులను మల్లు రవి పలకరించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై ఇచ్చిన ఫిర్యాదుపై చర్చించేందుకు తన కార్యాలయానికి రావాలని కోరారు. అయితే ఫిర్యాదు అన్ని అంశాలను పొందపర్చామని, ఇక తాము చెప్పటానికి వేరే ఏమీలేవని ఎమ్మెల్యేలు తేల్చి చెప్పారని సమాచారం. మీరు ఏం చర్యలు తీసుకుంటారో తీసుకోండి.. మీ నిర్ణయం తరువాత మా అభిప్రాయాలు చెప్పుతామని స్పష్టం చేసినట్లుగా తెలిసింది. అయితే కూర్చొని మాట్లాడుకుంటే సమస్య కొలిక్కి వస్తుందని, ఒకసారి ఆలోచించండని మల్లు రవి కోరినట్లుగా సమాచారం. దీనిపై ఎవరూ స్పందించకపోవటంతో మల్లు రవి వేదికపైకి వెళ్లిపోయినట్లుగా తెలిసింది. దీంతో మంత్రి కొండా దంపతులు, ఎమ్మెల్యేల మధ్య నెలకొన్న విభేదాలను పరిష్కరించేందుకు అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందనే చర్చ జరుగుతోంది.

నేడు క్రమశిక్షణ సంఘం వద్దకు కొండా..?

ఐదుగురు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ ఇచ్చిన ఫిర్యాదుపై జూన్ 31న కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై ఈ నెల 5వ తేదీ శనివారంలోగా వివరణ ఇవ్వాలని కోరారు. అయితే శుక్రవారమే ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌ను కొండా దంపతులు కలిసి 16పేజీలతో కూడిన నివేదికను అందించారు. తమను వరంగల్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీలు, ఇన్‌చార్జి మంత్రితో పాటు పలువురు నేతలు చేస్తున్న ఇబ్బందులపై వివరణ ఇచ్చారు. అలాగే శనివారం క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు మల్లు రవిని కలిసి కొండా దంపతులు వివరణ ఇచ్చే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. క్రమశిక్షణ సంఘం ఇచ్చిన షోకాజ్ నోటీసుకు శనివారం చివరి రోజు కావటంతో కొండా దంపతులు మీనాక్షినటరాజన్‌కు ఇచ్చిన నివేదిక అంశాలతో క్రమశిక్షణ సంఘానికి కూడా నివేదిక రూపంలో వివరణ ఇవ్వనున్నట్లుగా సమాచారం.

కాగా, కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం రెండు వర్గాలను శాంతింప చేసే మార్గంపై అన్వేషిస్తుందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. మొత్తానికి ఓరుగల్లు కాంగ్రెస్ నేతల సయోధ్యకు అధిష్ఠానం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా, లేక విభేదాలు మరింత పెరుగుతాయా.. అనే ఆసక్తి కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొంది.

వందేభారత్ రైళ్లలో అదనపు చైర్ కార్ కోచ్‌లు

నేటి నుంచి అందుబాటులోకి..

గిర్మాజిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు మరింత వెసులుబాటు కల్పిస్తూ దక్షిణమధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. వరంగల్ మీదుగా సికింద్రాబాద్- విశాఖపట్టణం మధ్య ప్రతీ రోజు (గురువారం మినహా) రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ రైళ్ల (20707/20708)లో అదనంగా 4 చైర్ కార్ కోచ్‌లు పెంచింది. శనివారం నుంచి ఇవి ప్రయాణికులకు అదుబాటులోకి వస్తున్నాయి. ప్రస్తుతం వందేభారత్ రైళ్లలో ఏసీ 14 చైర్ కార్ కోచ్‌లు, 2 ఎగ్జిక్యూటివ్ కోచ్‌లు ఉన్నాయి. అయితే అవి సరిపోకపోవడంతో ప్రయాణికుల డిమాండ్ మేరకు రైల్వే అధికారులు మరో నాలుగు చైర్‌కార్ కోచ్‌లు పెంచారు. దీంతో వాటి సంఖ్య 18కి పెరిగింది. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని దక్షిణమధ్య రైల్వేముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

జాతీయ పోలీసు డ్యూటీ మీట్‌లో సత్తా చాటాలి

- భద్రాద్రి జోనల్ డ్యూటీ మీట్ ముగింపులో సీపీ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో పతకాలు సాధించిన కమిషనరేట్ పోలీసు అధికారులు

వరంగల్ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో సత్తా చాటాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. మూడు రోజుల భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా శుక్రవారం కమిషనరేట్ కార్యాలయం ఆవరణంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి సీపీ హాజరై మాట్లాడారు. ఇలాంటి పోలీస్ డ్యూటీమీట్‌ల ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. జోనల్ స్థాయిలో కనబరిచినట్లగానే రాష్ట్ర, జాతీయ స్థాయిలో అధికారులు తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. పోటీలను విజయవంతంగా ముగించడంలో కృషిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ 15 గోల్డ్ మెడల్స్‌తో పాటు ఇతర పతకాలు 16 కైవసం చేసుకోగా, భద్రాద్రి కొత్తగూడెం 19, మహబూబాబాద్ 17, ఖమ్మం 5 పతకాలు కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో డీసీపీ షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అంకిత్‌కుమార్, డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు, బోనాల కిషన్, వరంగల్ ఏఎస్పీ శుభం, ఏసీపీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

భయబ్రాంతుల్లో ములుగు జిల్లా ప్రజలు

- 7న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లాలో సిటీ పోలీసు యాక్ట్ అమలు చేయడమంటే.. అక్కడి ప్రజలపై ఎమర్జెన్సీని విధించడమేనని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ములుగు జిల్లాలో సామాన్య ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నార ని, ప్రశ్నిస్తున్న వారిపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ ఈనెల 7న బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి మంత్రి సీతక్క ములుగు జిల్లా పరిధిలో సిటీ పోలీసు యాక్ట్ అమలు చేయిస్తున్నారన్నారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినప్పటికీ ములుగు జిల్లా ప్రజల స్వేచ్ఛ కోసం బీఆర్ఎస్ పార్టీ శాంతియుతంగా ప్రజా నిరసన కార్యక్రమం చేపడుతుందన్నారు. ములుగు జిల్లాలో ప్రజలకు స్వేచ్ఛ లేదని, తమ హక్కుల కోసం అడవిలో జీవించే ఆదివాసీల ఇళ్లను కూల్చడం, వారిపై అక్రమ కేసులు పెట్టడం నిత్యకృత్యంగా మారిందని పెద్ది ఆవేదన వ్యక్తం చేశారు. ములుగు నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ముఠాగా ఏర్పడి సామాన్య ప్రజలను వేధిస్తూ సంక్షేమ పథకాలు అనర్హులకు ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు జిల్లాలో ముగ్గురు బలిదానం చేసుకున్నారని పేర్కొన్నారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో ఈనెల 7న జరిగే ప్రజా నిరసన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా శతఘటాభిషేకం



ఘటాలతో రుద్రేశ్వరుడికి అభిషేకం చేస్తున్న ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, భక్తులు

హనుమకొండ కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వర స్వామి వారికి శుక్రవారం శతఘటాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు దండిగా పండాలని, సాగునీటికి, తాగునీటికి లోటు ఉండకూడదని కోరుతూ నిర్వహించిన ఈపూజలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఘటాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. తొలుత ఉత్తిష్ఠ గణపతి ఆరాధన అనంతరం ఆలయ నాట్యమండపంలో 108 ఘటాలను (కుండలను) ధాన్యం పోసి ప్రతిష్ఠించారు. పుణ్యావాచనం తర్వాత ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ సంకల్పాన్ని పఠించారు. రుశ్యశృంగ పూజ, 60 వారణాలతో కలశ పూజ నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. తొలుత ఉపేంద్రశర్మ ఘటాన్ని తలపై ఎత్తుకొని ముందు నడవగా వందలాది మంది భక్తులు ఆయనను అనుసరించారు. జలం, అగ్ని, వాయు, భూమి, ఆకాశానికి అధిపతి అయిన ఆది దంపతులను స్మరిస్తూ ఒకరి తర్వాత ఒకరు ఘటాల్లోని జలంతో అభిషేకం చేశారు. గంగను భూమి మీదకు విడువయ్యా అంటూ శివనామ స్మరణ చేశారు. శివ భక్తులైన హైదరాబాద్‌కు చెందిన సాయినాథ్ దంపతులు అమర్‌నాథ్ యాత్రికులను, ఉగ్రదాడులను రక్షించాలని కోరుతూ అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు గంగు మణికంఠ శర్మ, ఆలయ నిర్వహణాధికారి అనిల్ కుమార్, ఆలయ సిబ్బంది మధుకర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లవారుజామున తెల్లారిన బతుకులు

- రెండు లారీలు ఢీ... మంటలు చెలరేగి ముగ్గురి సజీవ దహనం
- మరిపెడ మండలం స్టేజీతండా వద్ద ఘటన





ఘటనా స్థలం వద్ద సీఐ రాజ్‌కుమార్, ఎస్సైలు సతీష్, సంతోష్

మరిపెడ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం స్టేజీతండా సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున(3.45 గంటలకు) 563 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో మంటలు చెలరేగి, డ్రైవర్లు, ఒక క్లీనర్ ఆ మంటల్లో సజీవ దహనమయ్యారు. మృతుల్లో రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్‌కు చెందిన లారీడ్రైవర్, క్లీనర్ ఉండగా.. మరొక లారీడ్రైవర్ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్‌తండాకు చెందిన వానిగా గుర్తించారు. మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ నుంచి చేపల దాణాతో బయలుదేరిన లారీ గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు వెళ్తోంది. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడుతో మరో లారీ ఏపీ రాష్ట్రం కాకినాడకు వైపు వెళ్తోంది. ఈ రెండు లారీలు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం స్టేజీ తండా సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై తెల్లవారుజామున ఎదురెదురుగా అతివేగంతో ఢీకొన్నాయి. దీంతో చేపల దాణాతో వెళ్లే లారీ డీజిల్ ట్యాంక్‌కు గ్రానైట్ రాయి తగిలి పగలడంతో రెండు లారీల క్యాబిన్లలో మంటలు చెలరేగాయి. చేపల దాణాతో వెళ్తున్న లారీ డ్రైవర్ రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్‌కు చెందిన సర్వణ్‌రాం(21), క్లీనర్ భర్కత్‌ఖాన్(24), గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీడ్రైవర్ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్ తండాకు చెందిన గుగులోతు గణేష్(30) ఆ మంటల్లో సజీవ దహనమయ్యారు. ముగ్గురి శరీరాలు కాలి బూడిదయ్యాయి.

సమాచారం అందుకున్న మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు బొలగాని సతీష్‌గౌడ్, సంతోష్, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. లారీ క్యాబిన్లలో చిక్కుకుని సజీవ దహనమైన మూడు మృతదేహాలను రెండు జేసీబీల సహాయంతో వెలికి తీసి, స్టేజీ తండా వద్దనే పోస్టుమార్టం నిర్వహించి ఛిద్రమైన శరీరాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు గణేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజస్థాన్‌కు చెందిన భర్కత్‌ఖాన్‌కు ఇటీవలే వివాహం అయినట్లు తెలుస్తోంది. డ్రైవర్ సర్వణ్‌రాం అవివాహితుడు కాగా, అతడికి తల్లిదండ్రులు ఉన్నారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



లారీని రోడ్డు పక్కకు జరుపుతున్న జేసీబీలు

తండ్రి కళ్లెదుటే...

డ్రైవర్ స్వరణ్‌రాం తన తండ్రి కళ్లెదుటే సజీవ దహనమయ్యాడు. స్వరణ్‌రాం లారీ ముందు వెళ్తుండగా, వెనకాల మరో లారీలో అతడి తండ్రి రాజురాం డ్రైవర్‌గా ఉన్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే రాజురాం లారీని ఆపి సంఘటన స్థలానికి వచ్చాడు. అయితే అప్పటికే లారీ క్యాబిన్‌లో చెలరేగిన మంటల్లో కొడుకు స్వరణ్‌రాం చిక్కుకుని కేకలు వేయడాన్ని గమనించాడు. తాను నిస్సహాయ స్థితిలో ఉండగా.. తన కొడుకు తన కళ్లెదుటే సజీవ దహనమయ్యాడని కన్నీరుమున్నీరుగా విలపించాడు.

రాంధాన్ తండాలో విషాదం



గణేశ్ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంధాన్ తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం స్టేజీతండా సమీపంలో రెండు లారీలు ఢీకొని మంటలుచెలరేగి ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ సజీవ దహనం కాగా, అందులో లారీడ్రైవర్ రాంధాన్ తండాకు చెందిన గుగులోతు గణేశ్(28)గా పోలీసులు గుర్తించారు. దీంతో తండాలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహం చాలా వరకు కాలిపోవడంతో గుర్తించలేని పరిస్థితిలో ఉంది. గణేశ్‌కు భార్య అనసూర్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సీఐ నోముల ప్రభాకర్‌రెడ్డికి అతి ఉత్కృష్ట సేవా పతకం



వరంగల్ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలందించినందుకు వరంగల్ సీఐడీ విభాగంలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న నోముల ప్రభాకర్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి అతి ఉత్కృష్ట పతకాన్ని ప్రకటించింది. గతంలో ప్రభాకర్‌రెడ్డి ఇండియన్ పోలీస్ సేవా పతకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు పతకాలు పొందారు. గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ధర్మసాగర్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డిని పోలీస్ అధికారులతో పాటు మండల ప్రజలు, పలువురు అభినందించారు.

బంధన్ ఆస్పత్రికి నోటీసులు

వరంగల్ మెడికల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని బంధన్ హాస్పిటల్‌కు డీఎంహెచ్‌వో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రయివేట్ ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరారు. షోకాజ్ నోటీసుల ప్రకారం.. వరంగల్‌కు చెందిన ఎల్.కృష్ణకు కిందటేడు ఫిబ్రవరి 12న బంధన్ ఆస్పత్రిలో వైద్యులు డాక్టర్ నళిన్ కృష్ణ అపెండిక్స్ ఆపరేషన్ చేశారు. అయితే తనకు తనకు చికిత్స సరిగా జరగలేదని, పోస్ట్ ఆఫ్ కేర్‌లో తీవ్రనిర్లక్ష్యం జరిగిందని పేర్కొన్నాడు. ఈ క్రమంలో తాను ప్రాణాపాయ స్థితికి వెళ్లినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందగా సుమారు రూ.14లక్షల వరకు ఖర్చు అయినట్లు బాధితుడు వెల్లడించారు. కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు బంధన్, మెడికవర్ ఆస్పత్రుల నుంచి డీఎంహెచ్‌వో కేస్ షీట్లను సేకరించి ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పంపించారు. ఎంజీఎంలో వైద్య నిపుణులు వాటిని పరిశీలించి బంధన్ హాస్పిటల్‌లో నిర్లక్ష్యం జరిగినట్లు నివేదికను సమర్పించారు. డాక్టర్ నళిన్‌కృష్ణ, డాక్టర్ ప్రణీత్‌రాజ్ బంధన్‌ఆస్పత్రిలో కన్సల్టెంట్ డాక్టర్లు కానప్పటికీ వారి చేత శస్త్రచికిత్స చేయించినట్లు తెలిపారు. ఈ మేరకు బంధన్ హాస్పిటల్ రిజిస్ట్రేషన్‌ను తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 2010, 2011 ప్రకారం ఎందుకు సస్పెండ్ లేదా క్యాన్సిల్ చేయకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆస్పత్రి యాజమాన్యానికి డీఎంహెచ్‌వో నోటీసులు జారీ చేశారు.

కేయూలో స్నాతకోత్సవ రిహార్సల్ సందడి

- వీసీ, రిజిస్ట్రార్‌లతో పాటు పాలక మండలి సభ్యుల హాజరు
- 7న జరిగే కాన్వకేషన్ లోటుపాట్లపై సమీక్ష



స్నాతకోత్సవ రిహార్సల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం సందడి నెలకొంది. వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంల నేతృత్వంలో కాన్వకేషన్ స్టీరింగ్ కమిటీ బాధ్యులు, సబ్ కమిటీ బాధ్యులు జూలై 7న కేయూ 23వ స్నాతకోత్సవ రిహార్సల్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు స్వయంగా స్నాతకోత్సవాన్ని తలపించేలా రిహార్సల్ చేపట్టారు. అకడమిక్ సెనెట్ పొజిషన్, విద్యార్థులకు పీహెచ్‌డీ డిగ్రీల ప్రదానం, బంగారుపతకాలు అందచేసే క్రమంలో ఏర్పడుతున్న లోపాలను పరిశీలించారు. ఆడిటోరియం వేదికపై అధ్యాపకులను సమన్వయం చేశారు. పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ సుకుమారి, డాక్టర్ మ ల్లం నవీన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ చిర్ర రాజు, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ మంచాల సదానందం, ప్రొఫెసర్ హన్మంతు, రామనాథ్‌కిషన్‌లతో పాటు ఇతర ప్రొఫెసర్లు అకడమిక్ సెనెట్ సభ్యుల మార్చ్‌ఫాస్ట్, డీన్ల పీహెచ్‌డీ అవార్డుల ప్రదానం, గోల్డ్‌మెడల్స్ రిహార్సల్‌ను నిర్వహించారు. రిహార్సల్‌లో తలెత్తిన లోటుపాట్లను గ్రహించి సరిదిద్దుకోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సూచించారు. ఈ కార్యక్రమంలో కాన్వకేషన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఏఆర్‌లు డాక్టర్ కోలా శంకర్, పంజాల శ్రీధర్‌లతో పాటు ఇతర విభాగాల ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

6న కేయూకు సెలవు లేదు..

కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం దృష్ట్యా జూలై 6న ఆదివారం కాకతీయ యూనివర్సిటీకి సెలవును రద్దు చేసి యథావిధిగా పనిదినంగా కొనసాగిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 7న కేయూ ఆడిటోరియంలో నిర్వహించే స్నాతకోత్సవ సంబురాల దృష్ట్యా సెలవును రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. ఆదివారానికి బదులుగా అక్టోబరు 4న రెండో శనివారం సెలవును ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు విధులకు రావాలని కోరారు.

కార్పొరేట్ కోసమే 'కగార్'

(5వ పేజీ తరువాయి)

మార్పు రావాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నిస్తే, తిరగబడితే నక్సలైట్లు, ద్రోహులు అంటున్నారన్నారు. దోపిడీ పీడన లేకుండా చేస్తే నక్సలిజం వచ్చేదే కాదని ఆమె అభిప్రాయపడ్డారు.

భారీ ర్యాలీ..

దొడ్డి కొమురయ్య వర్థంతి సందర్భంగా కడవెండి ఎర్రజెండాల ర్యాలీలతో ఎరుపెక్కింది. గ్రామంలో సీపీఐ జెండాను ఆవిష్కరించిన నారాయణ, అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, రాష్ట్ర సమితీ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, పీపుల్స్‌వార్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ప్రతినిధులు సొప్పరి సోమయ్య, బిల్లా తిరుపతిరెడ్డి, మోడె శ్రీశైలం, ఆకుల శ్రీనివాస్, నల్ల అరుణ, దొడ్డి భిక్షపతి, జీడి ఎల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన పెద్ది శ్రీను ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటికొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్టు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.



గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?

ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో చైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేధాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు.



జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హై కోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, అర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/దోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువ నున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలోమీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

మూడో బిడ్డను కంటే రూ.12 లక్షలు!

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులకు 50 వేల యువాన్లు (దాదాపు రూ.6 లక్షలు), మూడో బిడ్డను కన్న వారికి ఏకంగా లక్ష యువాన్లు (రూ.12 లక్షలు) ఇస్తామంటూ చైనాలో ఓ రాష్ట్రమైన ఇన్నర్ మంగోలియా ప్రభుత్వం ప్రకటించటం అక్కడి పరిస్థితులను తేటతెల్లం చేస్తోంది. ఇదే బాటలో పలు స్థానిక ప్రభుత్వాలు నడుస్తున్నాయి. పిల్లల్ని కనే జంటలకు నగదు ప్రోత్సాహకాలు, గృహ నిర్మాణానికి సబ్సిడీలను ప్రకటించాయి. తాజాగా, అక్కడి కేంద్ర ప్రభుత్వం కూడా ఈ దిశగా యోచిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పుట్టే ప్రతీ శిశువుకూ ఏటా 3,600 యువాన్ల (దాదాపు రూ.43 వేలు) చొప్పున మూడేళ్ల పాటు ఆ శిశువు తల్లిదండ్రులకు ఇచ్చే పథకంపై కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఈ ఏడాది జనవరి 1వ తేదీన, ఆ తర్వాత పుట్టిన శిశువులకు దీనిని వర్తింపజేయనున్నట్లు పేర్కొన్నాయి. జననాలు తగ్గటంతో చైనాలో వృద్ధుల సంఖ్య పెరిగిపోతోంది. ఉద్యోగాలు, పనులు చేయగల వయస్కుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాకు ఇది తీవ్ర నష్టదాయక పరిణామం. ఇదే పరిస్థితి కొనసాగితే.. 2100 నాటికి చైనా జనాభా ఏకంగా 80 కోట్లకు పడిపోతుందని ఐక్యరాజ్యసమితి జనాభా అంచనాల విభాగం లెక్కగట్టింది.

కాస్త 'జాగ్రత్త'గా మాట్లాడండి!

- దలైలామా వారసుడి ఎంపికపై కేంద్ర మంత్రి రిజిజు వ్యాఖ్యలకు చైనా స్పందన

బీజింగ్, జూలై 4: టిబెట్ అత్యున్నత బౌద్ధ గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. టిబెట్ సంబంధిత అంశాలతో తమ దేశ అంతర్గత వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దని పేర్కొంది. మాటల్లో, చర్యల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. 14వ దలైలామా చైనా వ్యతిరేక స్వభావాన్ని భారత్ గుర్తించాలని, అదేవిధంగా జిజాంగ్ (టిబెట్) సంబంధిత అంశాల్లో తమ వైఖరిని గౌరవించాలని పేర్కొంది. దలైలామా వారసుడి ఎంపిక విషయంలో గత రెండు రోజులుగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. తదుపరి దలైలామాను ఎన్నుకొనే అధికారం ప్రస్తుత దలైలామా లేదా సంబంధిత సంస్థ చేతుల్లోనే ఉందని, ఈ విషయంలో మరెవరూ జోక్యం చేసుకోలేరని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం నొక్కిచెప్పారు.

తాలిబన్ సర్కారును గుర్తించిన రష్యా

మాస్కో, జూలై 4: అఫ్గానిస్థాన్‌లో అధికారం చేపట్టిన నాలుగేళ్ల తర్వాత తాలిబన్ సర్కారుకు గొప్ప విజయం దక్కింది. తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తిస్తున్నట్లు రష్యా తాజాగా ప్రకటించింది. ఇప్పటివరకు తాలిబన్ సర్కారును అధికారికంగా ఏ దేశం గుర్తించకపోవడంతో అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారింది. తాలిబన్లు నియమించిన అఫ్గాన్ రాయబారి గుల్ హసన్ హసన్‌ను అనుమతిస్తూ అర్హత పత్రాలు అందజేసినట్లు రష్యా విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ఇస్లామిక్ ఎమిరేట్స్ అఫ్గాన్ సర్కారుకు అధికారిక గుర్తింపు లభించడంతో ఇరు దేశాల మధ్య వివిధ రంగాల్లో నిర్మాణాత్మక ద్వైపాక్షిక సహకారం పెరుగుతుందని విశ్వసిస్తున్నాం' అని పేర్కొంది.

నవ భారతంలో అవకాశాలకు హద్దే లేదు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమానికి ఆ దేశ ప్రధాని కమ్లా పెర్సాద్, కేబినెట్ మంత్రులు, శాసనసభ్యులు తదితరులు 4000 మందికిపైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. భారత్ నేడు అవకాశాల గని అని, అభివృద్ధి ఫలాలు అర్హులకు అందుతున్నాయని వారికి వివరించారు. ప్రధాని తన ప్రసంగంలో అక్కడ స్థిర పడిన భారత సంతతి ప్రజలను ప్రశంసలతో ముంచెత్తారు. అయోధ్య ఆలయ నమూనాను, సరయు నది జలాలను, కుంభమేళా సందర్భంగా సేకరించిన గంగా జలాలను వారి కోసం తీసుకువచ్చినట్లు చెప్పారు. భారత్‌లో డిజిటల్ చెల్లింపులను యూపీఐ విప్లవాత్మకం చేసిందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో జరిగే డిజిటల్ లావాదేవీల్లో సగం భారత్‌లోనే జరుగుతున్నాయన్నారు. ట్రినిడాడ్, టుబాగోలో తొలిసారిగా ఈ వ్యవస్థను ప్రవేశ పెడుతున్నందుకు అభినందనలు తెలిపారు. కాగా ట్రినిడాడ్ టుబాగోలోని కూవాలో మాట్లాడుతూ.. బిహార్ రాష్ట్రంతో అక్కడి వారికి ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేశారు. ఇక్కడున్న పలువురి పూర్వీకులు బిహార్ వారే అన్నారు. ఆ ద్వీప దేశ ప్రధాని పూర్వీకులు కూడా బిహార్ వారేనని, భారత ప్రజలు ఆమెను బిహార్ పుత్రికగా భావిస్తారని పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రధాని ఆ రాష్ట్ర వివరాలను ప్రధానంగా ప్రస్తావించారని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా ప్రధాని మోదీని ట్రినిడాడ్, టుబాగో అత్యున్నత పౌర పురస్కారం 'ద ఆర్డర్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టుబాగో'తో శుక్రవారం సత్కరించారు. మరోవైపు ఆ దేశ ప్రధాని ఇచ్చిన విందులో ఆయనకు సోహరీ ఆకుపై భోజనం వడ్డించడం విశేషం.



ట్రినిడాడ్ అండ్ టొబాగో అత్యున్నత పౌర పురస్కారాన్ని మోదీకి అందజేస్తున్న ఆ దేశ అధ్యక్షురాలు క్రిస్టీన్ కార్లా

వెస్ట్ ఇండీస్ జట్టు అంటే అభిమానం!

ట్రినిడాడ్ టుబాగో పర్యటనలో భాగంగా మోదీ ఆ దేశ పార్లమెంటులో శుక్రవారం ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రికెట్ గురించి ప్రస్తావించి పార్లమెంటు సభ్యులను ఆకట్టుకున్నారు. వెస్ట్ ఇండీస్ క్రికెట్ జట్టుకు భారతీయులు గట్టి అభిమానులు అని.. వారు భారత్‌తో ఆడినప్పుడు తప్ప మిగిలిన అన్ని పోటీల్లో వారి విజయాన్ని కాంక్షిస్తారని జోక్ చేశారు. 180 ఏళ్ల క్రితం భారతీయులు వలస రావడంతో మొదలైన రెండు దేశాల మధ్య అనుబంధాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తుచేసుకున్నారు. రాజకీయాల నుంచి కవితల వరకు, క్రికెట్ నుంచి వాణిజ్యం వరకు భారత్ నుంచి వలస వచ్చిన వారు ట్రినిడాడ్, టుబాగోలో అన్ని రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు.

చైనా ఆయుధాల పరీక్షకు.. పాకిస్థాన్ ఓ 'లైవ్ ల్యాబ్'

- 81% పాక్ సైనిక హార్డ్‌వేర్ చైనాదే
- ఆర్మీ అధికారి రాహుల్ సింగ్ వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి తర్వాత చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా ఒక్క సరిహద్దు ఆవల ముగ్గురు శత్రువులతో భారత్ పోరాడిందని ఆర్మీ డిప్యూటీ చీఫ్ (క్యాపబిలిటీ డెవలప్‌మెంట్) లెఫ్టినెంట్ జనరల్ రాహుల్.ఆర్.సింగ్ అన్నారు. యుద్ధంలో పాకిస్థాన్ నేరుగా పాల్గొన్నా.. ఆ దేశానికి ఆయుధాలిచ్చి చైనా, తుర్కియేలు భాగస్వాములైనట్లు ఆయన తెలిపారు. 2015 నుంచి పాకిస్థాన్‌కు చైనాయే ఆయుధాలను, యుద్ధ సామగ్రిని సరఫరా చేస్తోందని గుర్తుచేశారు. పాకిస్థాన్ సైనిక హార్డ్‌వేర్‌లో 81% చైనా అందజేసినదేనని చెప్పారు. చైనా తన సైనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్ష యుద్ధ పరిస్థితుల్లో పరీక్షించేందుకు పాకిస్థాన్‌ను లైవ్ ల్యాబ్‌లా వాడుకుంటోందని వివరించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన భారత, వాణిజ్య పరిశ్రమల సమాఖ్య(ఫిక్కీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్ నుంచి తాము ఎంతో నేర్చుకున్నామని జనరల్ రాహుల్ సింగ్ పేర్కొన్నారు. "తొలుత 21 టార్గెట్లు అనుకున్నాం. కానీ, చివరి క్షణాల్లో టార్గెట్లను 9కి తగ్గించాం" అని ఆయన వివరించారు. చైనా-పాకిస్థాన్ సంబంధాలు కేవలం ఆయుధాల సరఫరాకే పరిమితం కాలేదని.. చైనా తన ఆధునిక సాంకేతికత, యుద్ధ తంత్రాలను పాకిస్థాన్‌కు అందజేస్తోందని జనరల్ రాహుల్ పేర్కొన్నారు. పాకిస్థాన్ గడ్డ మీద నుంచి నిఘా వ్యవస్థలు, డ్రోన్లను చైనా ప్రత్యక్షంగా ప్రయోగిస్తోందని వివరించారు.

బీజేపీకి మహిళా బాస్!

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా మహిళా నాయకత్వానికి ఆరెస్సెస్ కూడా మద్దతు ఇస్తున్నట్టు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. మహారాష్ట్ర, హరియాణా, ఢిల్లీ వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయంలో మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం 2023 జనవరిలోనే ముగిసింది. గతేడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన పదవీ కాలాన్ని 2024 జూన్ వరకు పొడిగించారు.

నిర్మలా సీతారామన్

అధ్యక్ష రేసులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ముందు వరుసలో ఉన్నారు. ఇటీవల పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు నడ్డా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో ఆమె భేటీ అయ్యారు. సీతారామన్‌కు పగ్గాలు అప్పగించడం దక్షిణాదిలో పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

పురందేశ్వరి

ఏపీ బీజేపీ మాజీ చీఫ్ పురందేశ్వరి బహుభాషావేత్త. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రాజమండ్రి నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎన్టీఆర్ కుమార్తెగానే గాక రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'ఆపరేషన్ సిందూర్'పై వివరించడానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం విదేశాలకు పంపిన అఖిలపక్ష ప్రతినిధి బృందంలో ఆమె ఉన్నారు.

వనతీ శ్రీనివాసన్

1993లో బీజేపీలో చేరిన వనతీ శ్రీనివాసన్ పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో తమిళనాడు బీజేపీ రాష్ట్ర శాఖ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. 2020లో బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. 2022లో పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ పదవికి ఎంపికైన తొలి తమిళ మహిళ ఆమే.

లలిత్ మోదీ, విజయ్‌మాల్యా డ్యాన్స్

- లండన్‌లోని తన ఇంట్లో లలిత్ మోదీ పార్టీ.. వీడియో వైరల్



లండన్, జూలై 4: విదేశాలకు పారిపోయిన ఘరానా ఆర్థిక నేరగాళ్లు లండన్‌లోని ఓ పార్టీలో 'ఐ డిడ్ ఇట్ మై వే' అనే పాట పాడుతూ.. స్టెప్పులేయడం నెట్టింట వైరల్ అవుతోంది. కామన్వెల్త్ కుంభకోణం, మనీలాండరింగ్ కేసుల్లో నిందితుడు, ఐపీఎల్ మాజీ చీఫ్ లలిత్ మోదీ లండన్‌లోని తన ఇంట్లో ఇచ్చిన ఓ పార్టీకి రూ.9 వేల కోట్ల మేర బ్యాంకు రుణాలను ఎగ్గొట్టిన కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యా హాజరయ్యారు. మాజీ క్రికెటర్ క్రిస్ గేల్ సహా.. 310 మంది అతిథులు ఈ పార్టీలో పాల్గొన్నారు. ఈ విందులో లలిత్ మోదీ, విజయ్ మాల్యా కలిసి ఫ్రాంక్ సినత్రా ఆలపించిన ప్రసిద్ధ పాట 'ఐ డిడ్ ఇట్ మై వే.'ను కలిసి పాడారు. ఈ వీడియోను లలిత్ మోదీ స్వయంగా తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో పోస్టు చేశారు. "ఇంటర్నెట్‌ను ఈ వీడియో బ్రేక్ చేయదని ఆశిస్తున్నా. ఇది వివాదాస్పదమే కానీ.. నేను చేసేది అదే" అని ఆయన పోస్టు చేశారు. క్రిస్ గేల్ కూడా తన సోషల్ మీడియా ఖాతాల్లో ఈ వీడియోలు, ఫొటోలను షేర్ చేశారు. విజయ్ మాల్యా, లలిత్ మోదీని భారత్‌కు రప్పించాలని సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.! అయితే.. పరారీలో ఉన్న నేరస్థులుగా కోర్టులు గుర్తించిన వీరిద్దరు మాత్రం చిందులేయడంపై నెటిజన్లు మండిపడుతున్నారు.


ఆస్తే లేనప్పుడు మనీలాండరింగ్ ఎక్కడిది?

- నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా న్యాయవాది వాదనలు

న్యూఢిల్లీ, జూలై 4: నేషనల్ హెరాల్డ్ పత్రిక అప్పులు తీర్చే క్రమంలో నగదు అక్రమ చలామణికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీపై ఈడీ నమోదు చేసిన కేసుపై శుక్రవారం సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసును పరిగణనలోకి తీసుకోవాలంటూ ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు చేసిన వాదనను సోనియా తరఫున హాజరైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఖండించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను నిర్వహించే ఏజేఎల్‌కు ఉన్న రూ.90 కోట్ల అప్పులను యంగ్ ఇండియన్ అనే సంస్థ తీర్చిందని, ఇందుకు ప్రతిగా రూ.2వేల కోట్లు విలువ చేసే ఏజేఎల్ ఆస్తులను ఆ సంస్థకు బదలాయించారని ఈడీ ఆరోపించింది. యంగ్ ఇండియన్ సంస్థలో 76% వాటాలు సోనియా, రాహుల్ గాంధీలకు ఉన్నందున అంతిమ లబ్ధిదారులు వారేనని ఆరోపిస్తూ ఈడీ వారిపై మనీలాండరింగ్ కేసు పెట్టింది. అయితే, ఎలాంటి ఆస్తులు చేతులు మారకుండానే నగదు అక్రమ చలామణి జరిగినట్టు కేసు నమోదు చేయడం విచిత్రమని సింఘ్వీ వాదించారు. ఒకే పరిధిలో ఉన్న ఒక సంస్థ అప్పులను మరో సంస్థ తీర్చడం, అందుకు వివిధ మార్గాల్లో ఆస్తులు బదలాయించడం అన్ని కంపెనీలు చేస్తున్న పనేనని చెప్పారు. ఇందుకు చట్టం కూడా అనుమతి ఇస్తుందని తెలిపారు.

డ్రోన్ల తయారీకి రూ.20వేల కోట్ల ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీ, జూలై 4: దేశంలో డ్రోన్ల తయారీకి భారీ ఊతం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డ్రోన్ల తయారీ, విడిభాగాల రూపకల్పన, యాంటీ డ్రోన్ వ్యవస్థకు భారీ మద్దతు ప్రకటించింది. వచ్చే మూడేళ్లలో స్వదేశీ డ్రోన్ల తయారీకి ప్రాధాన్యం ఇస్తూ సుమారు రూ.20 వేల కోట్లమేరకు ప్రోత్సాహకాలను అందించనుంది. గత మేలో పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో దాయాది దేశానికి టర్కీ, చైనాలు డ్రోన్ల సాయం చేశాయి. అదేవిధంగా చైనా కూడా అధునాతన డ్రోన్లను సమకూర్చుకుంది. ఈ నేపథ్యంలో సరిహద్దుల భద్రత, సీమాంతర ఉద్రిక్తతలను బలంగా ఎదుర్కొనేందుకు భారత్ కూడా బలమైన డ్రోన్ వ్యవస్థను కలిగి ఉండాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రూ.20 వేల కోట్ల ప్రోత్సాహకాలతో డ్రోన్ల రంగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నట్టు అధికారులు తెలిపారు. తాజా పథకంలో చిన్న, మధ్య తరహా డ్రోన్ల తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేవారికి స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా స్వల్ప వడ్డీకే రుణాలు ఇప్పించనున్నారు. కాగా, దేశంలో ఇప్పటికే 600లకు పైగా కంపెనీలు డ్రోన్లను ఉత్పత్తి చేస్తున్నాయి.



సివిల్ రైట్స్ డేను ప్రతీ నెల నిర్వహించాలి

వడ్డెపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ పున్నయ కమిషన్ సిఫారస్ ప్రకారం ప్రతీ నెల చివరి తేదీన గ్రామాల్లో సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ హనుమకొండ డివిజన్ కన్వీనర్ ఆర్‌బీ. పరశురాము నాయక్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సివిల్ రైట్స్ డే నిర్వహించే ఒక రోజు ముందు గ్రామంలో దండోరా వేయించాలని పేర్కొన్నారు. తహసీల్దార్లు సివిల్ రైట్స్ డేను నిర్వహించకపోవడం వలన గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల సమస్యలు జఠిలమవుతున్నాయని తెలిపారు. సమావేశంలో కమిటీ ప్రతినిధి గుగులోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ చౌరస్తాలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హాల్‌లో ఈనెల 13న జరిగే కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి(కేపీఎన్‌పీఎస్) రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి పిలుపు నిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహంవద్ద నిర్వహించిన సమావేశంలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించగా, నాయకులు పాల్గొన్నారు.

నగరాన్ని ముంపు నుంచి కాపాడండి

● కమిషనర్‌కు వినతి పత్రం అందించిన బీజేపీ నాయకులు



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి):రానున్న వర్షాకాలం నేపధ్యంలో వరంగల్ నగరాన్ని ముంపు నుంచి కాపాడాలని బీజేపీ నాయకులు శుక్రవారం వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌ని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ వినతిలో పలు అంశాలను పేర్కొన్నారు. డ్రేనేజీ వ్యవస్థ, నాలాల కబ్జాపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. భద్రకాళి చెరువుతో పాటు మాడ వీధుల విస్తీర్ణం వల్ల బొందివాగు కుచించుకు పోయి వరద నీరు ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉందని అన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీజేపీ కార్పొరేటర్లు ఆడెపు స్వప్న, గండె కల్పన, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్‌షా, జిల్లా కార్యదర్శి బాకం హరిశంకర్, రంజీత్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, కుమార్, క్రాంతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించండి

తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం వరంగల్ పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మట్లాడుతూ.. అవసరం మేరకు యంత్రాంగం మరమ్మతులు చేసేలా చూడాలని అన్నారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. తప్పనిసరిగా ప్రజల నుంచి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించేలా అవగాహన కలిగించాలని అన్నారు. ప్రతీ రోజు సేకరించిన చెత్త ను వేగవంతంగా తరలించేందుకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఏఈ సంతోష్‌కుమార్, ఫణికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై తప్పుడు కేసులు

హసన్‌పర్తి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారనే తప్పుడు ఆరోపణలతో 2024 మేలో హసన్‌పర్తి బీజేపీ నాయకులపై అక్రమంగా నమోదైన కేసు నిరాధారమైనది తేలడంతో జడ్జి కొట్టివేసినట్లు 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నిజాయితీ గల కార్యకర్తలపై తప్పుడు సమాచారంతో ఎలా కుట్రలు జరుగుతున్నాయో ఈ కేసు ద్వారా స్పష్టమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, రైల్వే బోర్డు మెంబర్ దాసరి రాజు, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, నాయకులు రాజేశ్వర్‌రావు, సుమన్, భిక్షపతి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని రహమత్‌నగర్, జూబ్లీమార్కెట్, వెంకటాద్రినగర్, కాజీపేట మెయిన్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, డీమార్ట్ ఏరియాలో ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్ట వాటర్ ట్యాంక్ బ్యాక్‌సైడ్ ఏరియా, హరిత కాకతీయ హోటల్ ఎదురుగా ఉన్న ఏరియాలో సాయంత్రం 4 గంటల నుంచి 5.30వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్జీవోస్‌కాలనీ, శ్యామలగార్డెన్, అమరావతినగర్, టీవీ టవర్ కాలనీ, నాగరాజు టెంపుల్, ఎస్వీ కన్వెన్షన హాల్ ఏరియాలో ఉదయం 10 గంటల మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వసతి గృహాల్లో డ్రగ్ కంట్రోల్ టీమ్ సోదాలు



విద్యార్థి బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న డ్రగ్ కంట్రోల్ టీమ్ సిబ్బంది

వరంగల్ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్సార్, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలల అనుబంధ హాస్టళ్లలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీమ్ శుక్రవారం పోలీస్ జాగిలంతో విద్యార్థుల బ్యాగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సీఐ వై.సతీష్‌కుమార్, ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సై మనోజ్, పూర్ణ తదిరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారులకు న్యాయం చేయాలి

కాజీపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకందారులను గత ప్రభుత్వం మోసం చేసిందని ఈ ప్రభుత్వమైన తమకు న్యాయం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్ అన్నారు. కాజీపేటలో శుక్రవారం గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కిల్లె గోపాల్, ప్రజా కవి, గాయకుడు వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. గొల్ల, కురుమల సమస్యల పరిష్కారానికి ఐక్యం గా పోరాడాలని పిలుపునిచ్చారు. గొర్ల కాపరులకు బంజర భూములు 559, 1016 జీవో ప్రకారం కేటాయించాలని కోరారు.

కార్యక్రమంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీందర్, ప్రొఫెసర్ దాడబోయిన శ్రీకాంత్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ కొమ్ము కాస్తున్న డీఈవో జ్ఞానేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

8వ తరగతి వరకు ఎలాంటి టీసీలు లేకుండానే ప్రవేశాలు కల్పించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేస్తే వరంగల్ జిల్లాలో మాత్రం టీసీలు ఇచ్చిన విద్యార్థులకే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని ఎంఈవోలను ఆదేశాలు జారీ చేయడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో చేరుతున్న విద్యార్థులు టీసీలు ఇవ్వకుంటే వారికి పుస్తకాలు, యూనిఫామ్స్ మధ్యాహ్న భోజనం అందించరాదని ఎంఈవోలకు జూమ్ మీటింగ్‌లో ఆదేశాలు జారీ చేయడాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని కోరారు.

తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



బీఆర్ఎస్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్



కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

▸▸ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి దాస్యం వినయ్ భాస్కర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, నియోజక వర్గ కన్వీనర్ జనార్ధన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు ఉడుతల సారంగపాణి, తండమల్ల వేణు, మేకల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు కనకరాజు, కోటేశ్వర్‌రావు, దూలం వెంకన్న, జానకీరాములు, కృష్ణ, శంకర్, విజయ్‌కుమార్, మహేందర్, రాంమూర్తి పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో..

హనుమకొండ చౌరస్తా:తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకట్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వర్ధంతిలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి హాజరై ముందుగా కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య, నాయకులు మంద సంపత్, ఎం.రమాదేవి, ఆలకుంట యాకయ్య, కె.సుదర్శన్ ఎం.కావ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో..

న్యూశాయంపేట : హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

● కాజీపేట: దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాజీపేటకు చెందిన ప్రకాశ్ రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా 21వ సారి రక్త దానం చేసినట్లు చెప్పారు.

కలెక్టరేట్‌లో..

హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండ కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో తప్పిపోయిన యువతి



అపర్ణ

కాజీపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఓ యువతి తప్పిపోయింది. యువతి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాజీపేట రైల్వే సీఐ వడ్డే నరేశ్ తెలిపిన ప్రకారం... ఈ నెల 30 చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు రైల్వేస్టేషన్‌లో బండారు శాలమ్మ ఆమె కోడలు బత్తుల అపర్ణలు రైలెక్కారు. వీరు కాజీపేటలో బంధువుల ఇంటికి రావాల్సి ఉంది. కాజీపేటలో శాలమ్మ దిగే సరికి అపర్ణ కనిపించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని చెప్పారు. అపర్ణ వయస్సు 20 ఏళ్లు, ఎత్తు 5.4, మెరూన్ కలర్ టాప్, క్రీమ్ రెడ్‌కలర్ లెగిన్, క్రీమ్ చున్నీ ధరించి ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 87125 68532 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు

కేయూ భూముల జోలికి రావొద్దు

హనుమకొండ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం కాకతీయ యూనివర్సిటీ భూమిని కేటాయించడం అన్యాయమని, యూనివర్సిటీ భూముల జోలికి రావద్దని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు శరత్ చంద్ర హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విద్యార్థి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ.. గతంలో కేయూ భూములపై జరిపిన సర్వే వివరాలను తెలపాలని డిమాండ్ చేశారు. కేయూ పాలక మండలి అనుమతి లేకుండానే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం భూమిని కేటాయించినట్లు ప్రభుత్వం, స్థానిక నాయకులు ప్రకటించడం యూనివర్సిటీ అస్థిత్వాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. ఇప్పటికే కేయూ భూములు అన్యాక్రాంతమయ్యాయని, కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఏ విశ్వవిద్యాలయ భూములను సైతం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు కేటాయించలేదని, ఇక్కడ కేయూ భూములను ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు కేటాయించడం ప్రభుత్వానికి తగదని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, కేవలం కేయూ భూములను కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు శరత్‌చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ గంద్ర కోట రాకేష్‌యాదవ్, విద్యార్థి నాయకులు రాజగోపాల్, వీరస్వామి, ఆర్కే నరేంద్ర, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోల పాత్ర కీలకం

హసన్‌పర్తి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వోల పాత్ర కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ టీటీడీసీ సమావేశ మందిరంలో శుక్రవారం 107 వర్ధన్నపేట శాసన సభ నియోజకవర్గ బీఎల్‌వోల విధులపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కోసం పనిచేస్తున్న బీఎల్‌వోలు తమ విధుల పట్ల బాధ్యతాయుతంగా పనిచేసి శిక్షణలో నేర్చుకున్న అంశాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చల్ల ప్రసాద్, శిక్షణ బోధకులు ఏవీఆర్.చార్యులు, వర్ధన్నపేట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

వడ్డెపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన మెపా రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ముదిరాజ్‌ల రిజర్వేషన్ హామీని మార్చిందని దుయ్యబట్టారు. నామినేటెడ్ పదవులను జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకే ఎక్కువ పదవులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో మెపా జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్, రాష్ట్ర నాయకులు పొన్నం రాజు, పులి ప్రభాకర్, బైరి సోమయ్య దండు చిరంజీవి, నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, తాళ్ల రవీందర్, పెండ్యాల కృష్ణ, పులి సదానందం, గోనెల విజేందర్, మహేష్, హరీష్, శ్యామ్, రాజు, రవి, సమ్మయ్య తదితరులుపాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి



ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

వరంగల్ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, బోనాల కిషన్, సురేశ్‌కుమార్, శ్రీనువాస్, పరిపాలన విభాగం ఏఓ, ఏసీపీలు, ఆర్ఐలు పాల్గొన్నారు. ఎన్పీడీసీఎల్‌లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, టి.మధుసూదన్, వి.తిరుపతిరెడ్డి, సీఈలు పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయి సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, అకౌంట్స్ అధికారి శివలింగం, డిప్యూటీ కమిషనర్ రవీందర్, హెచ్‌వోలు రమేష్,లక్ష్మారెడ్డి,ఎంహెచ్‌వో రాజేశ్, ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, సంతోష్‌బాబు, మాధవీలత పాల్గొన్నారు.

● హనుమకొండ కలెక్టరేట్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

న్యూశాయంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి 8 గంటల పని విధానాన్ని ఎత్తివేసి, కార్మికుల సమ్మె హక్కును కాలరాసే విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు కలిసి వచ్చి కేంద్రంలోని బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. వామపక్షాలు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీపీఎం జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, ఎం. చుక్కయ్య, గొడుగు వెంకట్, న్యూడెమోక్రసీ నాయకులు బాలరాజు, నున్నా అప్పారావు, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి కొడగాని శివాజీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, మునగాల భిక్షపతి, కొట్టెపాక రవి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

హనుమకొండచౌరస్తా: ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆటోట్రాలీ గూడ్స్ ట్రాన్స్‌పోర్టు జిల్లా కన్వీనర్ ధరావత్ భానునాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ చౌరస్తాలో ఆటో యూనియన్ నాయకులను భానునాయక్ కలిసి సమ్మె కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసురావడం దుర్మార్గమన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెలో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏనుగులగడ్డ ఆటో అడ్డా నాయకులు మంచాల శ్రీనివాస్, రామగిరి శ్రీనివాస్, అక్బర్, లకావత్ శ్రీను, బానోత్ వీరు, బండి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

ఎఫ్ఆర్ఎస్ విధానంలో విద్యార్థులను నమోదు చేయాలి

● జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

మడికొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థుల నమోదును ఆన్‌లైన్‌లో ముఖ గుర్తింపు వ్యవస్థ(ఫేస్ రికగ్నేషన్ సిస్టం)ఉపాధ్యాయులు తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శుక్రవారం కాజీపేట మండలం మడికొండలో జిల్లా పరిషత్ పాఠశాలలోని తరగతులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థుల సంఖ్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ తదితర విషయాలను ఇచ్చారా లేదా అని ప్రధానోపాధ్యాయుడిని కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో భోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, తహసీల్దార్ బావుసింగ్, ఎంఈవో మనోజ్‌కుమార్, విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి



శ్యాంసుందర్‌రెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో నడికూడ మండలం రామక్రిష్టాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నడికూడ మండలం రామక్రిష్టాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి (48) హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆయన రామక్రిష్టాపూర్ పంచాయతీ కార్యాలయంలో విధులు ముగించుకొని స్కూటీపై తిరిగి హనుమకొండకు వెళుతున్నాడు. ఈ క్రమంలోనే పెగడపల్లి ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా కారు అతివేగంగా అజాగ్రత్తగా శ్యాంసుందర్‌రెడ్డి ప్రయాణిస్తున్న స్కూటీని వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు.

'సమరభేరి' సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



అంబేద్కర్ సెంటర్ వద్ద జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న బంక సరళ, తాళ్లపెల్లి విజయ్

వడ్డెపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న సామాజిక న్యాయ సమరభేరి సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హనుమకొండ నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. సామాజిక న్యాయ సమరభేరి సభకు వెళ్లే వాహనాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తాళ్లపెల్లి విజయ్, హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళసంపత్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. సభకు తరలివెళ్లిన వారిలో భద్రకాళి పాలక మండలి సభ్యులు ఎనుకొంటి పున్నం చందర్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్డీ అంకూస్, ఆనంద్, పూరెళ్ల రవికిరణ్, తేళ్ల సుగుణకిశోర్, దొంగర శ్రీనివాస్, సునిల్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

● గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లారు. సభకు తరలి వెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చింత రమేష్ గౌడ్, భూక్య విజయ్ నాయక్, శనిగరపు అనిత, అన్న విజయ తదితరులు ఉన్నారు.

● మడికొండ: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే సామాజిక న్యాయ సమరభేరి సభకు మడికొండ నుంచి కాజీపేట మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. కుర్ల మోహన్, ఎడబోయిన ప్రభాకర్, పైడిపాల రవిచందర్, రాజారపు స్వామి, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం అమర్‌నాథ్, నీలం రజిని, వేణు, వస్కుల భిక్షపతి, దండిగం సదానందం, సట్ల సదానందం, జక్కుల సదానందం , రాజు తదితరులు తరలి వెళ్లారు.

సింగరేణి మట్టే బంగారమే!

(మొదటిపేజీ తరువాయి)

ఖనిజాలు భారత్‌లో మరీ ముఖ్యంగా తెలంగాణలో పెద్దఎత్తున లభిస్తే..!? అది కూడా ఎందుకూ పనికిరాదని భావించిన మట్టి నుంచి వీటిని వెలికి తీయవచ్చని తెలిస్తే..!? ఇప్పుడు అదే జరిగింది! సింగరేణిలో వృథా అనుకున్న ఓపెన్ కాస్టు ఓవర్ బర్డెన్ (మట్టి) బంగారు బాతులా మారబోతోంది. ఉపరితల గనుల తవ్వకాలతో గుట్టల్లా పోగుపడిన ఆ మట్టిలో ప్రపంచంలోనే అత్యంత అరుదుగా లభించే స్కాండియం, స్ట్రాంచియం, ఎట్రియం, సీరియం వంటి భూ మూలకాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్- ఆర్‌ఈఈ) బయటపడ్డాయి. ఇటీవల లేబొరేటరీల్లో జరిపించిన ప్రాథమిక పరిశోధనల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ మొత్తంగా 14 రకాల అత్యంత అరుదైన భూ మూలకాలు ఉన్నట్లు ప్రాథమికంగా తేలింది. వీటిని ప్రపంచ మార్కెట్‌లో అత్యంత విలువైన, అరుదైన భూ మూలకాలుగా గుర్తించిన సింగరేణి యాజమాన్యం.. మరింత లోతైన అధ్యయనం కోసం కేంద్ర బొగ్గు గనుల శాఖకు నివేదించింది. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో వాటి సాంద్రతను తేల్చేందుకు పరిశోధనల బాధ్యతను పలు ఏజెన్సీలకు అప్పగించింది. సాధారణంగా 150-220 పీపీఎం స్థాయిలో అరుదైన ఖనిజాలు ఉంటాయి. మరికొన్ని ఖనిజాల పీపీఎం అతి తక్కువగానూ ఉంటుంది. ఉదాహరణకు, సీరియం పీపీఎం 43 కాగా.. ఎట్రియం పీపీఎం 19 మాత్రమే. అయితే, కొత్తగూడేం జిల్లా మణుగూరు బ్లాక్‌లోని దుర్గంగుట్ట గనుల్లో 266.21 పీపీఎం స్థాయిలో అరుదైన ఖనిజాలున్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గతంలోనే నిర్ధారించింది. వీటిని వెలికి తీయడమే కాకుండా అత్యంత అరుదైన ఖనిజాల వ్యాపారంలోకి అడుగు పెట్టాలని పావులు కదుపుతోంది. మరింత లోతైన అన్వేషణ చేసి ఆగస్టు నుంచి ఈ ఖనిజాలను వెలికి తీయడానికి సింగరేణి యాజమాన్యం సన్నాహాలుప్రారంభించింది. ఇందుకు ఐఐటీ హైదరాబాద్, నాన్ ఫెర్రస్ మెటీరియల్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎన్‌ఎఫ్‌టీడీసీ) వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది.

వందల టన్నుల్లోనే..

సింగరేణివ్యాప్తంగా కోట్ల టన్నుల ఓవర్ బర్డెన్ ఉంటుందని అంచనా. అయితే, ఖమ్మం జిల్లా సత్తుపల్లి, పెద్దపల్లి జిల్లా రామగుండం, మంచిర్యాల ప్రాంతాల్లో జరిపిన మట్టి నమునాల పరీక్షల్లో 15 టన్నుల మట్టి నుంచి కిలో అరుదైన ఖనిజాలు లభించే అవకాశం ఉన్నట్టు తేల్చారు. వీటిని ఉమ్మడిగా వెలికి తీయడానికి ఇటీవల డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్, నీతి ఆయోగ్ సభ్యుడు పద్మభూషణ్ డాక్టర్ వీకే సారస్వత్ సమక్షంలో భువనేశ్వర్‌కు చెందిన సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్(సీఎస్ఐఆర్)తో సింగరేణి సీఎండీ బలరాం ఒప్పందం కుదుర్చుకున్నారు. సీఎస్ఐఆర్, దాని అనుబంధ సంస్థ ఐఎంఎంటీ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ) వీటి అన్వేషణ, వెలికితీతలో కీలక భూమిక పోషించనున్నాయి. ఓవర్ బర్డెన్‌తోపాటు బొగ్గు గనుల పై పొరల్లో వెలికి తీసిన రాళ్లలోనూ అరుదైన ఖనిజాలు ఉండొచ్చని భావిస్తున్నారు. అంతేనా.. సెంట్రల్ కోల్ ఫీల్డ్స్, ఈశాన్య భారతదేశంలోని బొగ్గు గనుల మట్టివ్యర్థాలు, రాతి పలకలు, థర్మల్ విద్యుత్ కేంద్రాల నుండి ఉత్పన్నమయ్యే ఫ్లై యాష్‌లోనూ ఆర్‌ఈఈలు ఉన్నట్లు కనుగొన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం..



సింగరేణిలో ఓపెన్ కాస్ట్ తవ్వకాల వల్ల పోగైన మట్టి దిబ్బలు

వీటన్నిటిలో కలిపి దాదాపు 30లక్షల టన్నుల అరుదైన ఖనిజాలు బయటపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో, వీటిని వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రయత్నాలు ప్రారంభించింది.

కీలక పరికరాల తయారీలో..

అద్దాల నుంచి అంతరిక్ష సాధనాల వరకు వివిధ రకాల పరికరాల తయారీలో ఈ అరుదైన మూలకాలను ఉపయోగిస్తారు. ముఖ్యంగా విద్యుత్తు వాహనాలకు ఉపయోగించే బ్యాటరీలు, మ్యాగ్నెట్లు, ఎలక్ట్రానిక్స్, విమాన కీలక పరికరాల తయారీ, క్యాథోడ్ రే ట్యూబులు, ఫెర్రో అల్లాయిస్, న్యూక్లియర్ రియాక్టర్లు, వైద్య పరికరాల తయారీ, సిరామిక్, ఆయుధ పరికరాల తయారీలో అత్యంత కీలకంగా వాడతారు. సింగరేణిలో జరిపించిన ప్రాథమిక పరిశోధనల్లో అరుదైన ఖనిజాలు, భూ మూలకాల నిల్వల్లో భారతదేశం స్వయం సమృద్ధి దిశగా కీలక ముందడుగు వేసినట్లు అవుతుందని అంచనా వేస్తున్నారు. వీటి నిల్వల్లో ఇప్పటి వరకూ ప్రపంచంలోనే భారత్ ఐదో స్థానంలో ఉంది. మన దేశంలో సుమారు 13 మిలియన్ టన్నుల నిల్వలు ఉంటాయని అంచనా. ఇప్పుడు సింగరేణిలో రమారమి మూడు మిలియన్ మెట్రిక్ టన్నుల నిల్వలున్నట్టు ప్రాథమికంగా తేల్చారు. దీంతో, భారత్ ప్రపంచంలో మూడో స్థానానికి ఎగబాకుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 21 మిలియన్ మెట్రిక్ టన్నులతో బ్రెజిల్ రెండో స్థానంలో నిలవగా.. పొరుగు దేశం చైనా 42 మిలియన్ మెట్రిక్ టన్నుల నిల్వలతో అగ్ర స్థానంలో ఉంది. తద్వారా, గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తూ సప్లై చైన్‌ను శాసిస్తోంది.

ఖనిజాల వెలికితీతకు ఎన్‌ఎఫ్‌టీడీసీతో ఒప్పందం

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి చెందిన కొన్ని ఓపెన్ కాస్ట్ గనుల్లో , సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి వచ్చే ఫ్లైయాష్‌లో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొన్ని గుట్టల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు గుర్తించామని, మరింత పరిశోధన చేసి వీటిని వెలికి తీసేందుకు నాన్ ఫెర్రస్ మెటీరియల్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎన్‌ఎఫ్‌టీడీసీ)తో సింగరేణి శుక్రవారం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న దేశ అవసరాల రీత్యా కీలక ఖనిజ రంగంలోకి ప్రభుత్వ రంగ సంస్థలు రావాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపార విస్తరణలో సింగరేణి అగ్రభాగాన నిలవాలని ఆకాంక్షించారు. సింగరేణి సీఎండీ బలరాం మాట్లాడుతూ ప్రభుత్వ సూచనతో ఇప్పటికే కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించినట్లు తెలిపారు.



కోటపల్లిలో ఏసీబీ అధికారులకు చిక్కిన డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, తాత్కాలిక ఉద్యోగి అంజి

ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్

» రైతు నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా పట్టివేత

కోటపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కోటపల్లి రెవెన్యూ కార్యాలయంలో నరేష్ అనే రైతు నుంచి డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ రూ. 10 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం భీమారం గ్రామానికి చెందిన నరేష్‌కు తండ్రి గంట లక్ష్మణ్ పేరుతో కోటపల్లి మండలంలోని రాజారం గ్రామంలో సర్వే నెంబరు 71/13/2లో 20 గుంటల భూమి ఉంది. ఈ భూమిపై పట్టా పాస్ బుక్ పొందాలంటే ఆధార్ లింక్, ఈ కేవైసీ చేయడం కోసం డిప్యూటీ తహసీల్దార్‌ను కలువగా లంచం డిమాండ్ చేశాడు. రూ.10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. లంచం తీసుకుంటుండగా డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను, సహకరించిన తాత్కాలిక ఉద్యోగి అంజిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కగార్‌తో అమాయకులు, నక్సలైట్ల హతం

» చంపేస్తే పోరాటాలు ఆగుతాయా..?: నారాయణ



దేవరుప్పుల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాడు నిజాం వ్యతిరేక పోరాటంలో 4 వేల మందిని పొట్టనబెట్టుకున్నారని.. అయినా పోరాటాలు కొనసాగి చివరకు నిజాంనే తరిమేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఆపరేషన్ కగార్‌తో అమాయక ప్రజలు, నక్సలైట్లను ఎన్‌కౌంటర్లలో హతమార్చుతున్నారని మండిపడ్డారు. దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో ఆయన స్మారక స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీకే భవనంలో జరిగిన వర్ధంతి సభలో నారాయణ మాట్లాడారు. తుపాకీ పట్టిన వారందరినీ చంపుకుంటూ పోతే ఆశయాలు, సిద్ధాంతాలు చనిపోతాయా? అని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, తిరగబడితే నక్సలైట్లు, ద్రోహులు అంటున్నారని విమలక్క విమర్శించారు. దోపిడీ, పీడన లేకుండా చేస్తే నక్సలిజం వచ్చేదే కాదన్నారు.

విశాఖ వందేభారత్‌కు ఇకపై 20 బోగీలు

హైదరాబాద్, జులై 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య ప్రయాణించే 16 బోగీల వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా నాలుగు బోగీలను జతచేసి శనివారం నుంచి 20 బోగీలతో నడుపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ (20707-20708) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఇదివరకు 14 ఏసీ చైర్‌కార్, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు ఉండేవి. ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లను యథాతథంగా ఉంచి ఏసీ చైర్‌కార్ కోచ్‌ల సంఖ్యను 18కి పెంచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రాజుయాదవ్ (ఫైల్)

రామన్నపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పంట సాగుకు చేసిన అప్పు తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన బి.రాజుయాదవ్(35) ఎకరం పొలంలో వరి సాగు చేస్తున్నాడు. రెండు దఫాలుగా పొలం ఎండిపోవడంతో రూ.2 లక్షలు అప్పు తెచ్చి బోరు వేసినా నీరుపడలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రాజు ఇంట్లో గడ్డిమందు తాగాడు.

పంచాయతీ ఓటర్ల జాబితా తయారీపై
డీపీవో, ఎంపీడీవోలకు 14 నుంచి శిక్షణ

హైదరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా తయారీపై రాష్ట్రంలోని జిల్లా పంచాయతీ అధికారులు(డీపీవో), మండల పరిషత్ అభివృద్ధి అధికారుల(ఎంపీడీవో)కు ప్రభుత్వం ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనుంది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) ఈ నెల 14 నుంచి 17 వరకు ఈ శిక్షణ ఇవ్వనుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. తమ జిల్లాల్లోని డీపీవో, ఎంపీడీలు శిక్షణలో పాల్గొనేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఎన్నికల కమిషన్ కోరింది.

అమెరికాలో కుక్కకాటు..
15 ఏళ్ల తర్వాత సూర్యాపేట వాసికి పరిహారం

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతపాలెం మండలం శోభనాద్రి గూడానికి చెందిన కిశోర్ వెలమకన్నికి అమెరికాలో పదిహేనేళ్ల తర్వాత న్యాయం లభించింది. 2010లో ఒక మహిళ ఇంట్లో ఆయన కుక్క కాటుకు గురికావడంతో కోర్టును ఆశ్రయించారు. 2010 ఏప్రిల్ 22న కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. నష్టపరిహారం, వడ్డీ, ఇతర న్యాయపోరాటానికి అయిన ఖర్చులు కలిపి 10,359.90 డాలర్లు చెల్లించాలని ఆదేశించింది. అయితే ఈ కేసులో ప్రత్యర్థి ఆస్తి మీద అప్పులు ఉండటంతో వెంటనే పరిహారం చేతికి అందలేదు. తాజాగా ఆమె ఆస్తిని అమ్మడంతో కోర్టు తీర్పు మేరకు కిశోర్‌కు వడ్డీతో సహా మొత్తం 29,092.91 డాలర్లు ఇవ్వాలని ఖరారు చేశారు. లాయర్ ఫీజులు, ఇతర ఖర్చులు మినహాయించి చివరకు 18,429.83 డాలర్లు (రూ.15.74 లక్షలు) కిశోర్ చేతికి అందనున్నాయి.

42% బీసీ రిజర్వేషన్ల కోసం..
కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

» ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు జాజుల విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన పంపిన బిల్లుకు కేంద్రం ఆమోద ముద్ర కోసం జాతీయ స్థాయిలో ఒత్తిడి తేవాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను బీసీ సంక్షేమ సంఘంజాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ మేరకు జాజుల ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు శుక్రవారం గాంధీభవన్‌లో ఖర్గేను కలిసి వినతి పత్రం సమర్పించారు. బీసీల రిజర్వేషన్లు పెంచాలన్న న్యాయమైన డిమాండ్ ఆమోదానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. బీసీలకు డిప్యూటీ సీఎంతోపాటు క్యాబినెట్‌లో మరో ఇద్దరు బీసీలకు చోటు కల్పించాలని, జనాభా ప్రకారం నామినేటెడ్ పోస్టులు, ప్రభుత్వ కీలక పదవుల్లో బీసీలను నియమించాలని కోరారు. ఈ నెల 21 నుంచి మొదలయ్యే పార్లమెంట్ సమావేశాల్లో 42 బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రంపై పోరాటానికి ప్రతిపక్ష పార్టీగా కార్యాచరణ రూపొందించాలన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రెస్‌మీట్ పెడతా

» రైతు సమస్యలు, బనకచర్ల అంశాన్ని వివరిస్తా

» పార్టీ నేతలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యలు



కేటీఆర్, హరీశ్ తదితర బీఆర్ఎస్ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఒకటి, రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతానని, రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రెస్‌మీట్ పెడతానని బీఆర్ఎస్ నేతలతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం సమస్యలు, ఏపీలో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రాష్ట్రానికి కలిగే నష్టం సహా అనేక అంశాలను మీడియా ముఖంగా ప్రజలకు వివరిస్తానని చెప్పినట్లు తెలిసింది. సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం యశోద ఆస్పత్రిలో చేరిన కేసీఆర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇతర ముఖ్యనేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రైతులకు యూరియా, ఎరువుల లభ్యత, వ్యవసాయం, సాగునీరు వంటి ప్రజా సమస్యలు, తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. కాగా, కేసీఆర్ ఆరోగ్య సమాచారం అడుగుతూ ఆయన క్షేమంగా ఉండాలని కోరుకుంటున్న వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయిల పర్యవేక్షణ కోసం ఒకటి, రెండు రోజులు ఆస్పత్రిలో ఉండాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. మరోవైపు.. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు యశోద ఆస్పత్రి వైద్య వర్గాలు తెలిపాయి.

కేసీఆర్‌ను పరామర్శించిన కవిత

యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. శుక్రవారం తెల్లవారు జామున ఒకసారి, ఆ తర్వాత మరోసారి ఆమె ఆస్పత్రికి వెళ్లి తండ్రి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మృత్యువు మిగిల్చిన విషాదం

» అనారోగ్యంతో తండ్రి.. రోడ్డు ప్రమాదంలో కొడుకు, అల్లుడు

» సూర్యాపేట జిల్లాలోని ఓ ఇంట్లో ముగ్గురి మృతి



ఐలయ్య (ఫైల్)



రాములు (ఫైల్)

ఆత్మకూరు(ఎస్), జూలై 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం గట్టికల్‌లోని ఓ కుటుంబానికి మృత్యువు పెను విషాదాన్ని మిగిల్చింది. అనారోగ్యంతో బాధపడుతూ ఆ ఇంటి పెద్ద, తండ్రి మరణించగా.. అంత్యక్రియలకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు వెళ్లిన అతని కొడుకు, అల్లుడు రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం సాయంత్రానికి ఆ కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గట్టికల్ గ్రామానికి చెందిన మోరపాక భిక్షం అనారోగ్యం వల్ల గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భిక్షం అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. భిక్షం మరణవార్త తెలిసి అతని అల్లుడు మోనంది ఐలయ్య(55) గురువారం రాత్రి సూర్యాపేట నుంచి గట్టికల్ వచ్చాడు. అంత్యక్రియలకు అవసరమైన సామగ్రి కొనుగోలు కోసం ఐలయ్య, భిక్షం మూడో కుమారుడు రాములు(45) కలిసి గురువారం రాత్రి బైక్‌పై నెమ్మికల్ వైపు వెళ్లారు. అదే సమయంలో గట్టికల్ గ్రామానికి చెందిన కోన వినోద్, ఆయన తల్లి లక్ష్మమ్మ బైక్‌పై ఎదురుగా వచ్చి ఐలయ్య, రాములు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వినోద్, లక్ష్మమ్మకు స్వల్పగాయాలవగా ఐలయ్య, రాములు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఐలయ్య, సాయంత్రం రాములు మరణించారు. ఐలయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రాములు భార్య మూడేళ్ల క్రితం మరణించగా, అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భిక్షం అంత్యక్రియలను శుక్రవారం ఉదయం పూర్తి చేసిన కుటుంబసభ్యులు.. ఐలయ్య, రాములు మృతదేహాలను అప్పగించడంలో ఆలస్యం జరగడంతో తొలుత సూర్యాపేట ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం రోడ్డు ప్రమాదానికి కారణమైన వినోద్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగగా గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

మా సర్వీసులు పునరుద్ధరించండి

» గంటల చెల్లింపు విధానమొద్దు

» రాష్ట్ర ప్రభుత్వానికి డిగ్రీ అధ్యాపకుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకుల సర్వీసుల పునరుద్ధరణకు ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాను కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలోని యూనివర్శిటీల పరిధిలోని 149 డిగ్రీ కళాశాలల్లో గత నెల రెండో తేదీ నుంచి ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు, జూన్ 30 నుంచి ప్రథమ సంవత్సర విద్యార్థుల తరగతులు ప్రారంభమైనా డిగ్రీ కాలేజీ గెస్ట్ లెక్చరర్ల సర్వీసులను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేయలేదని తెలిపారు. డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న 1940 మంది గెస్ట్ లెక్చరర్లకు గంటల విధానంలో చెల్లిస్తున్న వేతనాలను 3,4 నెలలకోసారి ఇవ్వడం వల్ల చాలా ఇబ్బందుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కనుక ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు నెలకు రూ.50 వేల 'కన్సాలిడేటెడ్ వేతనం' చెల్లించాలని కోరారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న డెమో విధానాన్ని రద్దు చేసి, హైకోర్టు తీర్పుకనుగుణంగా తమ సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. దీనిపై యోగితా రాణా స్పందిస్తూ.. వచ్చే వారం నోటిఫికేషన్ జారీ చేయడానికి చర్యలు తీసుకుంటామని ఓ ప్రకటనలో తెలిపారు.

ఎదురెదురుగా రెండు లారీలు ఢీ

» మంటలు చెలరేగి ముగ్గురి సజీవ దహనం

» మానుకోట జిల్లా మరిపెడ మండలంలో ఘటన



మంటలను ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

మరిపెడ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం స్టేజీ తండా సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున 3.45 గంటలకు 563 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్ సజీవ దహనమయ్యారు. విజయవాడ నుంచి చేపల దాణాతో బయలుదేరిన లారీ గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్తోంది. కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడుతో మరో లారీ ఏపీలోని కాకినాడకు వెళ్తోంది. ఈ రెండు లారీలు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం స్టేజీ తండా సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై తెల్లవారుజామున ఎదురెదురుగా అతి వేగంగా ఢీకొన్నాయి. దీంతో చేపల దాణాతో వెళ్లే లారీ డీజిల్ ట్యాంక్‌కు గ్రానైట్ రాయి తగిలి పగలడంతో రెండు లారీల క్యాబిన్లలో మంటలు చేలరేగాయి. చేపల దాణా లారీ డ్రైవరు రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్‌కు చెందిన సర్వణ్‌రాం(21), క్లీనర్ బర్కత్‌ఖాన్(24), గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ డ్రైవర్ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్ తండాకు చెందిన గుగులోతు గణేష్(30) ఆ మంటల్లో సజీవ దహనమయ్యారు. ముగ్గురి శరీరాలు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న మరిపెడ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. లారీ క్యాబిన్లలో చిక్కుకుని సజీవ దహనమైన వారి మృతదేహాలను రెండు జేసీబీల సహాయంతో వెలికి తీసి, స్టేజీ తండా వద్దనే పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆర్జీయూకేటీకి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

» ప్రవేశాల్లో సత్తా చాటిన బాలికలు

» ఈ నెల 7, 8, 9 తేదీల్లో కౌన్సెలింగ్



ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తున్న వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్

బాసర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి బాసర, మహబూబ్‌నగర్ ఆర్జీయూకేటీలో ఎంపికైన విద్యార్థుల జాబితాను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్, ఏవో మురళీధరన్ శుక్రవారం బాసరలో విడుదల చేశారు. ప్రవేశాల్లో ఏకంగా 72శాతం బాలికలు ఎంపికై సత్తా చాటారు. అలాగే ఎంపికైన వారిలో 88శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన వారే. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో 20, 258 దరఖాస్తులు రాగా.. రెండు క్యాంపస్‌లో కలిపి మొత్తం 1690 సీట్లకు సంబంధించిన జాబితాను ప్రకటించారు. ఈ వివరాలన్నింటినీ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అధికారులు అందుబాటులో ఉంచామని వీసీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 7, 8, 9తేదీల్లో బాసర క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా నుంచి 297 మంది విద్యార్థులు.. అత్యల్పంగా జయశంకర్ జిల్లా నుంచి ఒక్కరు ఎంపికైనట్టు అధికారులు చెప్పారు. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ క్యాంపస్ కోసం తాత్కాలిక భవనాలను సిద్ధం చేశామని, వచ్చే నెల 4నుంచి తరగతులు ప్రారంభిస్తామని వీసీ తెలిపారు.

మత్స్యకార సొసైటీలకే చేప పిల్లల.. పంపిణీ నిధులివ్వండి: జాన్‌వెస్లీ

హైదరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): చేప పిల్లల పెంపకం నిధులను నేరుగా మత్స్యకార సంఘాల ఖాతాల్లో జమ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ శుక్రవారం లేఖ రాశారు. ఈ ఏడాది 80 శాతం చెరువులు చేపల పెంపకానికి అందుబాటులో ఉన్నా, ఇప్పటికీ ఉచిత చేప పిల్లల పథకంపై ప్రభుత్వం ప్రకటన చేయలేదన్నారు. తక్షణం ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరుతూ ఆందోళనకు దిగిన నిరుద్యోగ యువత, యువజన సంఘాల నేతలను అరెస్టు చేయడం సరి కాదని జాన్‌వెస్లీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జాగృతి రైల్ రోకోకు న్యాయవాదుల మద్దతు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న చేపట్టనున్న రైల్‌రోకో కార్యక్రమానికి న్యాయవాదులు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు జాగృతి లీగల్ సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు.


SMT.ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
BLOCKBUSTER
PROMISE
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR


KRIA FILM CORP
DHAMMA PRODUCTIONS
POWER STAR
FOR VIKRANTH IPS
TRAILER LAUNCH BY
SHRI PAWAN KALYAN GARU
ON JULY 5TH
RK SAGAR AS VIKRANTH IPS
THE 100
RELEASE ON
11TH JULY 2025
IN THEATERS
TELUGU


SMT VEENADHARI
BABY NEHA SRI PRESENTS
V MOVIES
SOULFUL
ENTERTAINER
SOLO BOY
PRODUCED BY SEVENHILLS SATISH DIRECTED BY P.NAVEEN KUMAR
IN CINEMAS NOW


SUPER DUPER HIT
తప్పక చూడండి !
జురాసిక్ వరల్డ్
రీబర్త్
IN CINEMAS NOW SHOWING
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU IN 3D
UNIVERSAL


UNANIMOUS
MEGA BLOCKBUSTER
RUNNING
SUCCESSFULLY
3RD
WEEK
SEKHAR KAMMULA'S
కుబేర

అల్లూరి సీతారామరాజు గొప్ప పోరాటయోధుడు

బ్రిటిషర్లకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాలు.. సాగించిన రాబిన్‌హుడ్.. మన్యం వీరుడు

ఆయన ఆశయాలకు అనుగుణంగానే గిరిజనుల సంక్షేమానికి మోదీ కృషి: రక్షణ మంత్రి రాజ్‌నాథ్

హైదరాబాద్, బేగంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాలు నిర్వహించిన రాబిన్‌హుడ్ అల్లూరి సీతారామరాజు అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కొనియాడారు. అడవి బిడ్డల కోసం ఆయన గొప్ప పోరాటం చేశారని.. వీరోచిత పోరాటంతో మన్యం వీరుడిగా గుర్తింపు పొందారని ప్రశంసించారు. అల్లూరి ఆశయాలకు అనుగుణంగానే.. ప్రధాని మోదీ గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. క్షత్రియ సేవా సమితి(తెలంగాణ, ఏపీ), భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ శుక్రవారం ఇక్కడ శిల్ప కళావేదికలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు 128వ జయంతి ఉత్సవాలకు రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "బానిసత్వంతో కాదు. ఆత్మాభిమానంతో బతకాలి" అన్న అల్లూరి పిలుపునకు అనుగుణంగా ప్రజలు జీవించాలని సూచించారు. ఆయన పుట్టిన ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని, ఆ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. నక్సల్స్ ఒకప్పుడు గిరిజన ప్రాంతాలను ఆక్రమించుకునేవారని దుయ్యబట్టిన ఆయన.. నక్సలిజం ఇప్పుడు దేశవ్యాప్తంగా ఐదారు జిల్లాలకే పరిమితమైందని అన్నారు. 2026 మార్చి 31 నాటికి భారత్ నక్సల్ రహిత దేశం కావాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. అలాగే.. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా, హనుమంతుడి స్ఫూర్తితో ఆపరేషన్ సిందూర్ కొనసాగిందని.. అందులో పాక్ పౌర సమాజానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేశారు. ఇక.. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులకు చరిత్రలో సరైన స్థానం దక్కలేదని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వారి చరిత్రను సమాజానికి అందించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని ఆయన తెలిపారు.



అల్లూరి జయంతి ఉత్సవాల్లో జ్యోతి వెలిగిస్తున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, చిత్రంలో కేంద్ర మంత్రులు షెకావత్, కిషన్‌రెడ్డి

మహేశ్వరంలో బీజేపీ నేత ఇంటి వద్ద రోహింగ్యాల రెక్కీ!

» పోలీసులకు ఫిర్యాదు.. ఆరుగురి అరెస్టు

సరూర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ ఇంటి వద్ద రోహింగ్యాలు రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. శుక్రవారం ఐదుగురు అనుమానిత యువకులను పార్టీ కార్యకర్తలు పట్టుకుని, మీర్‌పేట్ పోలీసులకు అప్పగించారు. మరో అనుమానిత రోహింగ్యా యువకుడు ఏకంగా శ్రీరాములు ఇంటి వద్దే తచ్చాడడం, అనంతరం సదరు యువకుడు తన వాహనాన్ని అక్కడే వదిలిపెట్టి.. పారిపోవడం కలకలం రేపింది. గత కొంత కాలంగా తాను రోహింగ్యాలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తూ.. అక్రమ మదర్సాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నానని, అందుకే తనను చంపాలనే ప్రణాళికతో రోహింగ్యాలు తన ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారని, వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీరాములు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తించారిలా..

మల్లాపూర్‌లోని అక్రమ మదర్సాను సందర్శించేందుకు శుక్రవారం ఉదయం శ్రీరాములు బయలుదేరాల్సి ఉండగా.. పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అదే సమయంలో పాత బైక్‌ను స్క్రాప్ ట్రాలీగా మార్చుకున్న ఓ యువకుడు శ్రీరాములు ఇంటి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడాడు. అక్కడే ఉన్న బీజేపీ కార్యకర్తలు వివరాలు అడుగుతుండగా..వాహనంపై పారిపోయాడు. ఆ యువకుడిని పోలీసులు బాలాపూర్ చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో శ్రీరాములు ఇంటివద్ద అనుమానాస్పదంగా తిరిగిన ఐదుగురు రోహింగ్యా యువకులను బీజేపీ కార్యకర్తలు పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. విచారణ జరుగుతోందని, ఇప్పుడే వివరాలు చెప్పలేమని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు. ట్రాలీతో తిరిగిన వ్యక్తి స్క్రాప్ వ్యాపారం చేస్తాడని, మిగతా ఐదుగురు నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నట్లు గుర్తించామన్నారు.

బీసీలకు అన్యాయమే.. కాంగ్రెస్ సామాజిక న్యాయమా?

(మొదటిపేజీ తరువాయి)

కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని నిర్వీర్యం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకపోగా, గ్రామాభివృద్ధి పనుల బిల్లులు రూ.1,200కోట్లు పెండింగ్‌లో పెట్టింది. ఇది గాంధీ స్ఫూర్తికి విరుద్ధం. జై భీమ్.. అని నినదిస్తున్న కాంగ్రెస్ లగచర్ల, కొడంగల్‌లో గిరిజనుల భూములను లాక్కొని, పోడు భూముల్లోకి బుల్డోజర్లు పంపింది. ఎస్టీ రైతులపై కేసులు బనాయించి, గురుకులాల మూసివేతతో దుర్మార్గంగా వ్యవహరించింది" అని ఆ ప్రకటనలో రాంచందర్‌రావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. "జై సంవిధాన్" అనే ముందు కాంగ్రెస్ పార్టీ తన చరిత్రను గుర్తు చేసుకోవాలని, 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పార్టీకి రాజ్యాంగంపై బోధనలు చెప్పే అర్హత లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఆ పార్టీ దోపిడీకి అక్షయపాత్రలుగా మారాయని ఆయన ఆరోపించారు.

బీసీలకు ఏం చేశారని సామాజిక న్యాయ సభ?

కాంగ్రెస్ సభపై కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా స్పందించారు. ఆ పార్టీది "సామాజిక అన్యాయ భేరి" అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా మరిమడ్లలో రూ.5 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "దేశాన్ని యాభై ఏళ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ ఒక్కసారైనా బీసీని ప్రధానమంత్రిని చేసిందా.. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్క బీసీనైనా సీఎం చేసిందా.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ క్యాబినెట్‌లో ఎంత మంది బీసీలకు అవకాశం ఇచ్చారు... మరి ఏ ముఖం పెట్టుకొని సామాజిక న్యాయ సమరభేరి సభ నిర్వహించారు" అని నిలదీశారు. బీజేపీ.. బీసీని ప్రధాని చేసిందని, దళిత, ఆదివాసీ, మైనారిటీ వర్గాలకు చెందినవారిని రాష్ట్రపతులను చేసిందని సంజయ్ అన్నారు. యూరియా కొరతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కావాలనే కేంద్రాన్ని బదనాం చేస్తున్నాయని సంజయ్ ఆరోపించారు. తెలంగాణకు గత సీజన్‌లో 9 లక్షల టన్నుల యూరియా అవసరమైతే కేంద్రం 12 లక్షల టన్నులు ఇచ్చిందని, ఈ సీజన్‌లో కూడా కోరినంత యూరియా ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని, కానీ గత సీజన్‌లో అదనంగా కేటాయించిన యూరియా ఎటు పోయిందో చెప్పకుండా కేంద్రాన్ని బదనాం చేయడం సరికాదని అన్నారు. కాగా, తన పాపాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సభను నిర్వహించిందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు.



నేడు బీజేపీ రాష్ట్ర సారథిగా రాంచందర్‌రావు బాధ్యతలు

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రాంచందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 9 గంటలకు భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేస్తారు. 10 గంటలకు గన్‌పార్కు అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం 11 గంటలకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు చేపడతారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పదాధికారులు, సీనియర్ నాయకులు హాజరుకానున్నారు.

'మోదీ కానుక'గా 20 వేల సైకిళ్లు

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీలు, మునిసిపాలిటీలు, మండలాల వారీగా మరికొందరికి కూడా సైకిళ్లు అందించనున్నారు. ఒక్కో సైకిలు ధర రూ.4,000 కాగా.. సైకిల్‌పై ప్రధాని మోదీ ఫొటో ముద్రించి ఉంటుంది. కాగా, కరీంనగర్ జిల్లాలో 3,096 మంది, రాజన్న సిరిసిల్లలో 3,841, జగిత్యాల 1,137, సిద్దిపేట 783, హనుమకొండ 491 కలిపి మొత్తం 9,348 పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వనున్నారు. ఇది కాక, కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 66 డివిజన్లు ఉండగా.. ఒక్కో డివిజన్‌కు 50 సైకిళ్లు ఇవ్వనున్నారు. నియోజకవర్గంలోని ప్రతీ మండలానికి 100 చొప్పున సైకిళ్లు ఇస్తారు. హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వార్డుకు 50 సైకిళ్లు ఇవ్వనున్నారు. ఇప్పటికే 5,000 సైకిళ్లు సిద్ధమవ్వగా.. జూలై 8 లేదా 9 తేదీల్లో పంపిణీని ప్రారంభించనున్నారు.

గనుల లీజ్ మరింత సులభతరం

» సుస్థిర మైనింగ్ విధానాలపై ప్రత్యేక దృష్టి
» పర్యావరణ పరిరక్షణే తొలి ప్రాధాన్యం
» మైనింగ్ సదస్సులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): గనుల లీజ్, రెన్యూవల్స్‌ను మరింత సులభతరం చేస్తామని, ఇందుకోసం సింగిల్ విండో విధానం అమల్లోకి తెచ్చామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చెప్పారు. సుస్థిర మైనింగ్ విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మైనింగ్ కాంగ్రెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి మైనింగ్ సదస్సులో ఆయన మాట్లాడారు. మైనింగ్ సంస్థలు ప్రజలను, ప్రకృతిని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం నిబంధనలను మరింత సరళీకృతం చేయడంతో పాటు సాంకేతికతకు పెద్దపీట వేస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకే ప్రభుత్వ ప్రాధాన్యత ఉంటుందన్నారు. మైనింగ్ తరువాత కూడా క్వారీలను వదిలేయకుండా పూర్వస్థితి ఏర్పడేలా ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. దేశ అవసరాలకు అనుగుణంగా తగినంత బొగ్గు, అల్యూమినియం, రాగి తదితర ఖనిజాలను ఉత్పత్తి చేసి, ఈ రంగంలో దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడపాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉందని చెప్పారు. కాగా, పర్యావరణానికి నష్టం కలగకుండా, సమీప ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా సింగరేణి బొగ్గు తవ్వకాలను జరుపుతోందని సంస్థ సీఎండీ బలరాం పేర్కొన్నారు. పర్యావరణానికి హానికలగకుండా నూతన సాంకేతికతతో మైనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్‌బర్డెన్ డంప్‌లపైనా సోలార్‌ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

కీలక అంశాలపై చర్చ

దేశంలోని మైనింగ్ సంస్థలు, అంతర్జాతీయ మైనింగ్ సంస్థల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. బొగ్గుగనులు, లైమ్‌స్టోన్, ఐరన్‌ఓర్ వంటి ఖనిజాల అన్వేషణ పూర్తయ్యాక శాస్త్రీయ పద్ధతిలో మైన్‌క్లోజర్ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరంపై చర్చించారు. మైనింగ్ పూర్తయిన భూముల్లో ఫిషరీస్ అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యావరణహిత మైనింగ్ విధానాలపై రూపొందించిన మిషన్ గ్రీన్ బుక్, రిక్లెయిమ్ అనే పుస్తకాలను కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సింగిల్ విండో విధానానికి సంబంధించిన పోర్టల్‌ను, 24వ నైవేలి బుక్ ఫెయిర్‌ను ప్రారంభించారు.

గోదావరి నీళ్లను ఏపీ దోచుకుంటే ఊరుకోం

» నిరుద్యోగుల అరెస్టు అప్రజాస్వామికం: హరీశ్‌రావు

"బనకచర్ల పేరిట గోదావరి నీళ్లను ఏపీ దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం. ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే పొలిమేర దాకా తరిమికొడతాం. ఈ ప్రాంతం వాడే ద్రోహం చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తాం" అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. పోలవరం, పోతిరెడ్డిపాడు, పులిచింతల వంటి అక్రమ ప్రాజెక్టులను నిరసిస్తూ 20ఏళ్ల కిందట ఇదే రోజున (2005 జూలై 4న) మంత్రి పదవులకు రాజీనామాలు చేశామని గుర్తుచేశారు. "పదవులకు రాజీనామాలు చేయడం మాత్రమే కాదు.. పేగులు తెగే దాకా కొట్లాడతాం. తెలంగాణకు అన్యాయం జరగకుండా కాపలా ఉంటూ.. కంటికి రెప్పలా కాపాడుకుంటాం" అని పేర్కొన్నారు. చలో సచివాలయం కార్యక్రమానికి పిలుపునిచ్చిన నిరుద్యోగులు, విద్యార్థిసంఘాల నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.

నిరుద్యోగుల కష్టాలు కనబడట్లేదా?

» నియామకాలపై నిలదీస్తే అరెస్టు చేస్తారా?: కేటీఆర్

అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామని రాహుల్‌గాంధీ పదే పదే చెప్పారని, ఈ విషయమై నిలదీసేందుకు వస్తే నిరుద్యోగులను అరెస్టు చేస్తారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి నిరుద్యోగుల కష్టాలు కనబడడం లేదా? అని 'ఎక్స్' వేదికగా శుక్రవారం నిలదీశారు. ఏడాదిన్నరలో పదివేల ఉద్యోగాల నోటిఫికేషన్లైనా ఇవ్వకుండా నిరుద్యోగులకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కార్ ద్రోహాన్ని గడప గడపకు తీసుకువెళ్తామని, నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపారు. కాగా, సిగాచీ ఫ్యాక్టరీ పేలుడులో మృతిచెందినవారి పట్ల రేవంత్ సర్కార్ వ్యవహరిస్తున్న తీరు అమానవీయమని, కార్మికుల మృతదేహాలను అట్టపెట్టల్లో తరలించడం దారుణమని కేటీఆర్ పేర్కొన్నారు. ఉపాధి కోసం వచ్చి చనిపోయిన కార్మికులకు కనీస గౌరవం ఇవ్వలేరా? అని ప్రశ్నించారు.

టీవీవీపీలో 2,363మంది ఉద్యోగుల కొనసాగింపు

» కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టుల గడువు పెంచుతూ జీవో

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని 2,363 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి31కే ఈ పోస్టుల కాలపరిమితి ముగిసింది. అయితే, ప్రజారోగ్య సంచాలకుల నుంచి కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు టీవీవీపీకి బదిలీ కావడం, కొత్తగా కొన్ని సీహెచ్‌ఎసీలు ఏర్పాటవడంతో ఈ పోస్టులను కొనసాగించాలని టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో వచ్చేఏడాది మార్చి31వరకు ఆయా పోస్టులను కొనసాగిస్తూ జీవో జారీ అయింది. వీటిలో 944 కాంట్రాక్టు పోస్టులు, 1,332 ఔట్‌సోర్సింగ్ పోస్టులు,87ఎంటీఎస్ పోస్టులు ఉన్నాయి.

నేడు అక్కడక్కడ భారీ వర్షాలు

రాష్ట్రంలోని ఒకటి రెండు జిల్లాల్లో శనివారం అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆది, సోమవారాల్లో కూడా కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

డిసెంబరు దాకా సాగర్ భద్రత సీఆర్‌పీఎఫ్‌కే

నాగార్జునసాగర్‌పై డిసెంబరు నెలాఖరుదాకా సీఆర్‌పీఎఫ్ బలగాలు కాపలా కాయనున్నాయి. ఇదివరకు నిర్ణయించిన ప్రకారం జూన్ 30న సీఆర్‌పీఎఫ్ కాపలా గడువు ముగిసింది. అయితే సీఆర్‌పీఎఫ్ బలగాలను ఉపసంహరించుకుంటే సాగర్ కట్ట ఏపీ వైపు(కుడిభాగం)లో తమ పోలీసులను మోహరిస్తామని పేర్కొంటూ కృష్ణా బోర్డుకు ఏపీ లేఖ రాసింది. దాంతో సీఆర్‌పీఎఫ్ బలగాలను డిసెంబరు 31దాకా కొనసాగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

20 కంటే ఎక్కువ మంది పిల్లలున్న చోట బడి!

» 212 గ్రామాలు, 359 పట్టణ కాలనీల్లో ఏర్పాటుకు నిర్ణయం

రాష్ట్రంలో 20 మంది కంటే ఎక్కువ మంది పిల్లలుండే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బడులు తెరవాలని సర్కారు నిర్ణయించింది. ఒకవేళ ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే స్కూళ్లు మూతపడి ఉంటే వాటినీ తెరవనుంది. ఈ నేపథ్యంలోనే 212 గ్రామాలు, 359 పట్టణ కాలనీలు/వార్డుల్లో ప్రాథమిక స్కూళ్ల అవసరముందని సర్కారు గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో డీఈవోలు, ఎంఈవోల వర్క్‌షాపు జరిగింది. '20 కంటే ఎక్కువ మంది పిల్లలున్న గ్రామాలు, పట్టణ ప్రాంతాల జాబితాను రూపొందించాం. సంబంధిత డీఈవోలు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వసతి గృహాలు లేదా అద్దె వసతి గృహాల్లో పాఠశాలలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు భవనాలకు అద్దెలను నిర్ణయించే విధానాలను త్వరలో తెలియజేస్తాం. ఫర్నిచర్, స్టేషనరీ, ఇతర విద్యా సామగ్రికి సంబంధించి జిల్లా కలెక్టర్లకు నిధులు విడుదల చేస్తాం' అని పాఠశాల విద్యా సంచాలకుడు నవీన్ నికోలస్ పేర్కొన్నారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్


పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

ఈడీ విచారణకు హాజరైన అల్లు అరవింద్

» ఆర్‌టీపీఎల్ కేసులో దర్యాప్తు సంస్థ విచారణ
» మూడు గంటలకు పైగా ప్రశ్నించిన అధికారులు
» మరోమారు విచారణకు హాజరు కావాలని ఆదేశం
» ఆస్తి కొనుగోలు అంశంపై పిలిచారు: అల్లు అరవింద్



హైదరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, రామకృష్ణ టెలిట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్‌టీపీఎల్) సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(గతంలో ఆంధ్రా బ్యాంకు)ను రూ.101.48 కోట్లకు మోసం చేసిన కేసులో సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారించింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో విచారణ చేపట్టిన ఈడీ.. పలు లావాదేవీల విషయంలో అరవింద్‌ను ప్రశ్నించింది. అల్లు అరవింద్ బుధవారం ఈడీ విచారణకు హాజరవ్వగా అధికారులను ఆయన్ను మూడు గంటలకు పైగా విచారణ చేశారు. ఈ సంగతి ఆలస్యంగా వెలుగు చూసింది. దర్యాప్తు సంస్థల కథనం ప్రకారం.. ఆర్‌టీపీఎల్ డైరెక్టర్లు వేముల రవి కుమార్, వేముల రాఘవేంద్ర.. ఆర్‌టీపీఎల్ పేరిట శాంసంగ్, సోనీ మొబైల్స్ వ్యాపారం చేస్తుంటారు. హైదరాబాద్‌లోని ఎస్ మార్ట్ వీరి సంస్థే. అయితే, ఆర్‌టీపీఎల్ డైరెక్టర్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ఓసీసీ(ఓపెన్ క్యాష్ క్రెడిట్) కింద రూ.101.48 కోట్లు రుణం తీసుకుని ఆ నగదును దారి మళ్లించారు. రుణం తిరిగి చెల్లించకపోవడంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్‌టీపీఎల్‌పై సీబీఐ గతంలో కేసు నమోదు చేసింది. అయితే, ఆర్‌టీపీఎల్ లావాదేవీల్లో మనీలాండరింగ్ కోణం కనిపించడంతో రంగంలోకి దిగిన ఈడీ.. హైదరాబాద్, కర్నూలు, ఘజియబాద్ ప్రాంతాల్లో ఆర్‌టీపీఎల్‌కు చెందిన కార్యాలయాల్లో గతేడాది సోదాలు చేసింది. పలు రికార్డులను స్వాధీనం చేసుకోవడమే కాక ఆర్‌టీపీఎల్ డైరెక్టర్ల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.1.45కోట్ల నగదును సీజ్ చేసింది. ఆర్‌టీపీఎల్ బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన ఈడీ ఈ క్రమంలోనే అల్లు అరవింద్‌ను ప్రశ్నించింది. ఈడీ కోరిన పత్రాలను అరవింద్ సమర్పించకపోవడంతో మరోమారు విచారణకు రావాలని ఆయన్ను ఆదేశించింది. కాగా, ఆర్‌టీపీఎల్ డైరెక్టర్లలో ఒకరైన రవి కుమార్‌పై హైదరాబాద్ సీసీఎస్ అధికారులు 2016లోనే ఓ కేసు నమోదు చేశారు. ఆర్‌టీపీఎల్ పేరిట రవి కుమార్ సోదరులు తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో పలు ఆర్థిక సంస్థలు న్యాయస్థానాలను కూడా ఆశ్రయించాయి.

ఓ ఆస్తి కొనుగోలు అంశంలో ఈడీ పిలిచింది: అరవింద్

2017లో తాను కొనుగోలు చేసిన ఓ ఆస్తికి సంబంధించిన విషయంలో ఈడీ అధికారులు తనని ప్రశ్నించారంటూ అల్లు అరవింద్ శుక్రవారం ఓ ప్రకటన చేశారు. అంతకుమించి ఇందులో పెద్ద విషయమేమీ లేదని పేర్కొన్నారు. తనకు ఆస్తి అమ్మిన వ్యక్తిపై ఈడీ విచారణ కొనసాగుతుందని, అతని ఖాతా పుస్తకాల్లో తనతో జరిగిన లావాదేవీ ఉండటంతో ఈడీ అధికారులు ఆ వివరాలు అడిగారని వివరించారు. ఈడీ కోరిన వివరాలను అందజేశానని తెలిపారు. బాధ్యత కలిగిన పౌరుడిగా ఈడీ పిలిచిన వెంటనే వెళ్లానని, ఈ అంశాన్ని మీడియా పెద్దగా చూపిస్తుందని అరవింద్ పేర్కొన్నారు.





Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.